సోమవారం
5•2•2018
కరీంనగర్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 219
• పేజీలు : 16 + (20/16)

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

గో మూత్రంతో ఔషధాలు

కాలేయ వ్యాధి, కీళ్ల నొప్పులు తదితర రోగాలకు మందు

ఆయుర్వేద ప్రాధాన్యాన్ని పెంచేలా యూపీ ప్రభుత్వం అడుగులు 5



ఆవులకూ ఆధార్!

మొదటిదశలో 4 కోట్ల ఆవులకు కేటాయింపు

బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించిన కేంద్రం

ఆధార్ గుర్తింపు కార్డు మాదిరిగానే ఆవులకు కూడా ఓ నంబర్‌ను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ప్రాజెక్టు కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు కేటాయించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ (యూఐడీ) టెక్నాలజీని సమకూర్చుకున్నదని డెయిరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు తెలిపారు. 5

వలసబాటలో మిలియనీర్లు!

స్వదేశానికి దూరమైపోతున్న సంపన్నులు

గతేడాది పరాయి దేశాలకు పోయిన 7 వేల మంది

అమెరికాయే అత్యధికుల గమ్యస్థానం

ఆ తర్వాత యూఏఈ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ 7



రాజధానికి పచ్చనిహారం

ప్రత్యేక అటవీమండళ్లు ఏర్పాటుచేయాలి: సీఎం కేసీఆర్

- మున్సిపల్, అటవీ మంత్రులు సమన్వయంతో అధ్యయనం చేయాలి
- బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీరాజ్ బిల్లు
- బడ్జెట్ ద్వారా పంచాయతీలకు నిధుల కేటాయింపు
- 3 నెలల్లో అన్ని గ్రామాల్లో నేత్రవైద్య పరీక్షలు
- పరీక్షలు జరిగిన వెంటనే కండ్లద్దాల పంపిణీ
- ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- సమీక్షాసమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్



ఆదివారం ప్రగతిభవన్‌లో వివిధశాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఒకప్పుడు అడుగడుగునా తోటలతో విలసిల్లిన రాజధాని హైదరాబాద్‌కు పునర్వైభవం తెచ్చేందుకు నగరం చుట్టూ లక్షన్నర ఎకరాల అటవీభూముల్లో ప్రత్యేక అటవీ మండళ్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్ర పురపాలక, అటవీశాఖ మంత్రులు కలిసి అధ్యయనం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలను పరిపుష్టం చేసేందుకు ఉద్దేశించిన నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దీంతోపాటు ముందుగా నిర్ణయించిన మేరకు మార్చి 11న పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీకి గడువు విధించామని, ఆ సమయానికి అన్ని పనులు పూర్తికావాలని స్పష్టంచేశారు. మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో నేత్రవైద్య శిబిరాలు నిర్వహించి, ఉచితంగా కండ్లద్దాలు పంపిణీచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేవిధంగా విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించారు.

> రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో నేత్ర శిబిరాలను నిర్వహించేందుకు ప్రభుత్వేతర సంస్థలను, ఆసక్తిగల ఇతర వ్యవస్థలను భాగస్వాములను చేయాలి. దీనికి అవలంబించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయాలి. ఈ కార్యక్రమం మొత్తం మూడు నెలల్లో పూర్తి కావాలి. నేత్ర శిబిరాలలో స్క్రీనింగ్‌తోపాటు కండ్లద్దాలు ఇవ్వాలి. వైద్య, ఆరోగ్య అంశాలకు సంబంధించి, ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలగురించి వారిని చైతన్యపరిచేవిధంగా పెద్దఎత్తున ప్రభుత్వపరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి.
>
> **- అధికారులతో సీఎం కేసీఆర్**

నగరం చుట్టూ అటవీ మండళ్ల అభివృద్ధి

రోజురోజుకూ అభివృద్ధి పథాన పయనిస్తూ, భౌగోళికంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరాన్ని, చుట్టుపక్కల ప్రాంతాల్ని అన్ని విధాలుగా సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, అన్నింటికన్నా ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ చేసుకోవాలని సీఎం కేసీఆర్ అన్నారు. నగరానికి అన్నివైపులా 50-60 కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు లక్షన్నర ఎకరాలకుపైగా అటవీభూమి ఉన్నదని, దాన్ని కాపాడుకొంటూ ఆరోగ్యకరమెన గాలి పీల్చుకొనేలా అటవీ మండళ్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ ప్రాంతాల్లో పచ్చదనం పరిఢవిల్లాలని ఆయన అన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్, హైదరాబాద్ అర్బన్ ఫారెస్ట్రీ ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని, దానికి అవసరమైన నిధులు వెచ్చించాలని అధికారులను ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో కేబీఆర్ పార్క్‌లో మాదిరిగా వాక్ వే రూపొందించాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్, అటవీశాఖల మంత్రులు, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్

మిగతా 2వ పేజీలో



- 2017-18 లో 18 శాతం కేటాయింపులు
- తొమ్మిది శాతంతో రెండో స్థానంలో ఏపీ
- తేల్చిచెప్పిన పీఆర్‌ఎస్ సర్వే
- 2014-15లోనూ తెలంగాణ ప్రథమస్థానం.. అసోచామ్-2016 సర్వే వెల్లడి

రాష్ట్ర సాగునీటి బడ్జెట్ దేశంలోనే టాప్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ.. కోటి ఎకరాల మాగాణం కావాలన్న స్వప్నాన్ని సాకారం చేసుకొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన భగీరథ ప్రయత్నానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నది. రాష్ట్రం ఏర్పడింది మొదలు ప్రతిఏటా బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నది. ప్రతిఏటా బడ్జెట్ కేటాయింపుల్లో సాగునీటిప్రాజెక్టులకు దేశంలోని ఏ ఇతర రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంతటి ప్రాధాన్యం ఇవ్వటంలేదని అనేక సర్వేలు స్పష్టంచేస్తున్నాయి. 2016లో వచ్చిన అసోచామ్ సర్వే మొదలు, తాజాగా ఆదివారం వెల్లడైన 'పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్' అధ్యయనంలోనూ ఇదే అంశం వెల్లడయింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశంలోని 19 రాష్ట్రాల బడ్జెట్లపై అధ్యయనంచేసిన పీఆర్‌ఎస్.. సాగునీటి రంగానికి 18 శాతం కేటాయింపులతో తెలంగాణ ప్రథమస్థానంలో నిలిచిందని వెల్లడించడం విశేషం. సాగునీటి ప్రాజెక్టుల కారణంగా వ్యవసాయరంగం బలోపేతమై రాష్ట్ర ఆర్థిక ప్రగతి అనూహ్యంగా పెరుగుతుందని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

తెలంగాణలో సాగునీటిరంగాన్ని బలోపేతంచేయాలనే జల సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రతియేటా బడ్జెట్‌లో నీటిపారుదలశాఖకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏటా రూ.25 వేల కోట్ల కేటాయింపులు చేస్తామని ప్రకటించిన ఆయన.. తదనుగుణంగా నిధులు మంజూరుచేస్తూ సాగునీటిరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటిరంగానికి నామమాత్రపు ప్రాధాన్యమిచ్చారు. ఇక తెలంగాణ ప్రాజెక్టులకైతే అరకొర కేటాయింపులే ఉండేవి. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటిరంగంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. సాగునీటి

మిగతా 8వ పేజీలో

అభివృద్ధిలో హైదరాబాద్ దౌడ్



ఐటీ, పారిశ్రామికరంగాల్లో దేశంలోనే ముందంజ

ప్రపంచ దేశాలు గర్వపడేలా అభివృద్ధి

ప్రశంసించిన ఏపీ మంత్రి పితాని 2

ఏఎన్‌ఎంలకు భారీగా వేతనం పెంపు

రూ.10 వేల నుంచి 21 వేలకు

ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం 3

బ్రాండెడ్ పేర్లతో నకిలీ మోటర్లు!

ఉచిత విద్యుత్‌కు గుదిబండలు

- మార్కెట్లో జోరుగా జీరో దందా.. ఖజానాకు చిల్లు
- జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేని వ్యాపారులే అధికం
- హైదరాబాద్‌లో రోజూ 2 వేల మోటర్ల అమ్మకం
- ఢిల్లీ నుంచి నకిలీ కేబుల్ వైర్లు
- అహ్మదాబాద్, రాజ్‌కోట్, కోయంబత్తూరు నుంచి మోటర్ల దిగుమతి
- ఏటా ప్రభుత్వానికి రూ.100 కోట్లు గండి
- నాణ్యమైన మోటర్లతో సగానికి తగ్గనున్న విద్యుత్ వినియోగం



రైతులు వినియోగిస్తున్న నకిలీ మోటర్ (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

తెలంగాణలో రైతాంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ నిర్విరామంగా ఇస్తూ ప్రపంచ ఖ్యాతిని ఆర్జించింది. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మరోవైపు సాగునీటి పథకాలు, మిషన్ కాకతీయ పథకాల ఫలితంగా పెరిగిన భూగర్భ జలాలతో పాత బోర్లు కూడా కళకళలాడుతున్నాయి. ఇదే అదనుగా రైతులు కూడా ఇష్టారాజ్యంగా పాత బోర్లకు మోటర్లు బిగించేస్తున్నారు. అవి కూడా సగం ధరకే దొరికే నకిలీ/అసెంబుల్డ్ పంపుసెట్లను వినియోగిస్తున్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం ఎంతైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ నకిలీ మోటర్ల (అసెంబుల్డ్)తోనే విద్యుత్తు వినియోగం రెట్టింపు అవుతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాణ్యమైన వాటికంటే నకిలీ సబ్‌మెర్సిబుల్ మోటర్లకు రెట్టింపు విద్యుత్ అవసరమవుతుందని అంటున్నారు. బ్రాండెడ్ కంటే అన్‌బ్రాండెడ్/అసెంబుల్డ్ మోటర్ల ద్వారా ఉచిత విద్యుత్ పథకానికి తీరని నష్టం వాటిల్లుతున్నదని హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా పంపుసెట్లు ఉండగా వాటిలో సగం నాసిరకమేనని ఓ డీలర్ అభిప్రాయపడ్డారు. ఉచిత కరంటును నకిలీ మోటర్ల కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఆరు స్టేజ్‌ల సబ్‌మెర్సిబుల్ పంప్ కేవలం రూ.2860కే లభిస్తుంది. ఎనిమిది స్టేజ్‌లదైతే రూ.3355లకే దొరుకుతుంది. 10 స్టేజ్‌ల పంప్ రూ.3833 మాత్రమే.. ట్యాక్స్ ఇన్‌వాయిస్ ధరలివి. ఇవి 'ఐఎస్‌ఐ మార్కు' సబ్‌మెర్సిబుల్ మోటర్లే. తక్కువ ధరలను కోట్ చేస్తూ పొరుగు రాష్ట్రాల కంపెనీలు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాయి. డీలర్లు చెల్లించే బిల్లు ఎస్టిమేట్ పేరిట తెల్లకాగితంపై రాసిస్తున్నారు. మిగతా సొమ్మంతా హవాలా ద్వారా ఉత్పత్తిదారులకు అందుతున్నట్టు తెలుస్తున్నది. తక్కువ బిల్లు కోట్

మిగతా 8వ పేజీలో

ఎల్‌వోసీలో పాక్ కాల్పులు

ఆర్మీ అధికారి, ముగ్గురు జవాన్లు మృతి 5

ముల్కీ స్ఫూర్తితో జోనల్ వ్యవస్థ

స్థానికత కోసమే మొదలైన తెలంగాణ ఉద్యమం.. వెనుకబడిన జిల్లాలకు ప్రాధాన్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో స్థానికతకు సంబంధించి ముల్కీ నిబంధనల స్ఫూర్తితో జోనల్ వ్యవస్థను అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రజలు, చదువుకున్న విద్యావంతులు, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలని.. దశాబ్దాలుగా చేసిన ఉద్యమాలన్నింటి చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తున్నది. జోన్లు ఏర్పాటుచేసే ప్రతిపాదనలలో జోన్ల సంఖ్యను కాకుండా రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలలో చదువుకొన్నవారికి ఎక్కువ అవకాశాలు లభించే విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రజల్లో అత్యంత అసంతృప్తికి కారణమైన స్థానికత అంశం ఇకపై సమస్యాత్మకం కాకుండా.. వెనుకబడిన గ్రామాల్లోని విద్యావంతులకు కూడా సరైన అవకాశాలు లభించేవిధంగా జోనల్ వ్యవస్థ రూపకల్పనపై కసరత్తు జరుగుతున్నది. 1919 లోనే స్థానికత కోసం గర్జించిన తెలంగాణ స్వరం.. ముల్కీ ఉద్యమానికి కారణమై, మూడున్నరేండ్ల క్రితం రాష్ట్రం విడిపోయేంతవరకూ కొనసాగింది. మరో ఏడాది గడిస్తే ఈ స్థానికత పోరాటానికి వందేండ్లు నిండుతాయి. నాడు నిజాం ఇచ్చిన ముల్కీ ఫర్మానా నుంచి నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమం ఎగిసిపడేవరకూ ఉద్యమాలన్నింటికీ స్థానికత ఆయువుపట్టుగా ఉన్నది.

ఈ నేపథ్యంలోనే ఇప్పుడు తెలంగాణలో పుట్టిన ఏ ఒక్కరికీ అన్యాయం జరుగకుండా ఉండేందుకు స్థానికత విషయంలో 1957లో ఏడో రాజ్యాంగ సవరణ ద్వారా ముల్కీ నిబంధనలకు సంక్రమించిన రాజ్యాంగ రక్షణకు సంబంధించిన చారిత్రక

మిగతా 9వ పేజీలో

అభివృద్ధిలో హైదరాబాద్ దౌడ్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారంలో మీడియాతో మాట్లాడుతున్న ఏపీ మంత్రి సత్యనారాయణ

- ఐటీ, పారిశ్రామిక రంగాల్లో దేశంలోనే ముందంజ
- ప్రపంచ దేశాలు గర్వపడేలా డెవలప్‌మెంట్
- ప్రశంసించిన ఏపీ మంత్రి పితాని సత్యనారాయణ

చౌటుప్పల్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి చెందుతున్నదని ఆంధ్రప్రదేశ్ కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ పేర్కొన్నారు. దేశంలోనే ఐటీ, పారిశ్రామిక రంగాల్లో హైదరాబాద్ ముందంజలో ఉన్నదని చెప్పారు. ఆదివారం ఆయన ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ వస్తే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుందని కొందరు భావించారని, కానీ ప్రపంచ దేశాలు గర్వపడేలా అభివృద్ధి వైపు దూసుకుపోతున్నదని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణానికి గాని, పారిశ్రామిక అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని తెలిపారు. రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటిగానే మెలుగుతున్నారని, ఇది ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

కువైట్ బాధితులకు ఆసరా



క్షమాభిక్ష పొందినవారిని రప్పిస్తున్నాం
టికెట్ డబ్బులు లేనివారి వివరాలు ఇవ్వండి
అధికారులకు ఎన్నారైశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కువైట్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్షతో పర్మిట్, వీసా లేకుండా పని చేస్తున్నవారిని తెలంగాణ రాష్ట్రానికి రప్పించేందుకు సాయం అందించాలని అధికారులను ఎన్నారైశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. ఏడేండ్ల తర్వాత కువైట్ ప్రభుత్వం ఇచ్చిన క్షమాభిక్ష అవకాశాన్ని వినియోగించుకొని, అక్కడినుంచి వస్తున్నవారికి పూర్తి సహకారం అందించాలని, దీనికి సంబంధించి ఎన్నారైశాఖ కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నదని తెలిపారు. కువైట్‌లోని భారత ఎంబసీ అధికారులతో తెలంగాణ ఎన్నారై శాఖాధికారులు ఆదివారం మాట్లాడారు. తెలంగాణ కార్మికుల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నారై అధికారులకు అందిస్తామని వారు తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే విదేశాంగమంత్రి సుష్మస్వరాజ్ సహకారం కోరుతామని మంత్రి కేటీఆర్ చెప్పారు. క్షమాభిక్షతో దేశానికి రావాల్సినవారు అక్కడి రాయబార కార్యాలయాన్ని కలుస్తున్నారని, కొందరికి కనీసం విమాన టికెట్‌కు సరిపడ డబ్బులు లేని పరిస్థితి తమ దృష్టికొచ్చిందని, వారికి ప్రభుత్వమే టికెట్ సమకూరుస్తుందని తెలిపారు. ఎంతమందికి టిక్కెట్లు అవసరం అవుతాయనే అంశంపై వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. కువైట్‌లోని తెలంగాణ పౌరులు తెలంగాణ ఎన్నారైశాఖ మొబైల్ నంబర్ 94408 54433 లేదా so_nri@telangana.gov.in ఈ మెయిల్ ద్వారా తమ వివరాలు అందించాలని మంత్రి కేటీఆర్ కోరారు.

కార్పొరేషన్ ఓపెన్ ఎయిర్‌జిమ్‌లకు
విశేష స్పందన

వీడియోను ట్వీట్ చేసిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లలో ఏర్పాటుచేసిన ఓపెన్ ఎయిర్ జిమ్‌లకు విశేష స్పందన వస్తున్నదని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసిన పార్కుల్లో వస్తున్న స్పందనను ఓ వీడియో రూపంలో రూపొందించగా మంత్రి కేటీఆర్ ట్వీట్‌చేశారు. ఇలాంటివే హైదరాబాద్ సహా రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాల్లో రానున్నాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు.

ప్రజల్లోకి బలంగా వెళ్దాం



- ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ క్యాడర్ భాగస్వామ్యం
- రానున్న నాలుగు నెలల్లో కీలక కార్యక్రమాలు
- త్వరలో టీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం
- బడ్జెట్ సమావేశాల్లోపు రైతు సమన్వయ సమితి సదస్సులు
- పార్టీ నాయకులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కార్యాచరణను రూపొందించారు. ఇందుకుగాను ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ క్యాడర్‌ను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. రాబోయే నాలుగు నెలలపాటుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు జరుగబోతున్నాయి. ప్రభుత్వ పథకాల ప్రచారంలో క్యాడర్ ఉత్సాహంగా పాల్గొనడానికి పార్టీ నాయకులను సంసిద్ధులను చేస్తున్నారు. మొదట రైతు సమన్వయ సమితులు, ఆ తర్వాత పాస్ పుస్తకాల పంపిణీ, మే నెలలో రైతులకు పెట్టుబడి పథకం అమలు కానున్నది. ఏప్రిల్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో మహాసభలు జరుగనున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో వచ్చే వారం, పది రోజుల్లో పార్టీ శాసనసభాపక్షం, రాష్ట్ర పార్టీ కమిటీ సమావేశం ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా రైతు సమన్వయ సమితి సదస్సులను పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. రైతులను సంఘటితపరుచడానికి ఏర్పాటుచేసిన సమన్వయసమితి సదస్సుల్లో ఇప్పటికే గ్రామ, మండల కమిటీల ఏర్పాటు పూర్తయింది. కొన్ని జిల్లాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా కొన్నింటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నది. వాటన్నింటిని పూర్తి చేసి రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొని జాబితాలను పూర్తి చేయాలని మంత్రులకు సూచించారు. పాత జిల్లాల ఆధారంగా రెండుమూడు జిల్లాలకు కలిపి ఒక ప్రాంతంలో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తారు. ఈ సదస్సులకు గ్రామ, మండల, జిల్లా సమన్వయ సమితుల బాధ్యులను ఆహ్వానిస్తారు. అనంతరం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సమన్వయ సమితి అన్నిస్థాయిల సభ్యులతో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశాల్లో సీఎం కేసీఆర్ వారి బాధ్యతలు, విధులపై దిశానిర్దేశం చేయనున్నారు.

పార్టీ ప్లీనరీ నిర్వహణ

పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోనే టీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీ ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనికి ముందుగా ఏప్రిల్ రెండోవారం నుంచి ప్రతి జిల్లాలో జిల్లా పార్టీ మహాసభలను నిర్వహిస్తారు. ఈ సభలకు పార్టీ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతినిధులను ఆహ్వానించి ప్రభుత్వపరంగా చేస్తున్న కార్యక్రమాలపై చర్చిస్తారు. ప్రభుత్వ పథకాలపై సలహాలు, సూచనలను రాష్ట్ర పార్టీకి పంపిస్తారు. వీటన్నింటినీ రాష్ట్ర ప్లీనరీలో చర్చించే అవకాశమున్నది.

మే 15 నాటికి పెట్టుబడి చెక్కుల పంపిణీ

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పెట్టుబడి పథకాన్ని విజయవంతం చేసేవిధంగా పార్టీ శ్రేణులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారు. మే 15 కల్లా రైతులకు చెక్కుల పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా రైతుల్లో నూతనోత్సాహం నెలకొంటుందని అంచనా వేస్తున్నారు. ఈ పథకాన్ని దేశం యావత్తు ఆసక్తిగా గమనిస్తున్నది. రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునే అవకాశాలున్నాయి. ఈ పథకాన్ని మాజీ ప్రధాని దేవెగౌడ సహా అనేక మంది ప్రాంతీయ పార్టీల నేతలు ప్రశంసించారు. దీంతో ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ఇప్పటికే చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని పథకాన్ని అర్హులైన రైతులందరికీ అందేవిధంగా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచిస్తున్నారు.



ఆదివారం ప్రగతిభవన్‌లో వివిధ శాఖల పనితీరుపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు సీతారాంనాయక్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తదితరులు కూడా ఉన్నారు.

రాజధానికి పచ్చనిహారం

మొదటిపేజీ తరువాయి...

ఫారెస్ట్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాలను సందర్శించి అభివృద్ధికి ఏం చేయాలో అధ్యయనం చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. 'సేవ్ హైదరాబాద్' లో భాగంగా ఇవన్నీ జరుగాలని ఆయన స్పష్టంచేశారు.

బడ్జెట్ సమావేశాల్లోనే కొత్త పంచాయతీ బిల్లు

ప్రభుత్వం రూపొందిస్తున్న నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని రానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ముసాయిదా బిల్లు పురోగతి, కొత్త పంచాయతీల ఏర్పాటు, కొత్తగా నగర పంచాయతీల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికగా రూ. 5 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ప్రతి ఏటా నిధులిచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులుండాలని ఆర్థికశాఖ కార్యదర్శిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. గ్రామపంచాయతీలకు 'నరేగా' నిధులు, ఫైనాన్స్ కమిషన్ నిధులు, రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు, ఆస్తి పన్నుల వసూలు ద్వారా వచ్చే నిధులను పంచాయతీలకు సమకూర్చే విధివిధానాలను రూపొందించాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ నిధులు ఏ విధంగా పొందవచ్చునో అధ్యయనం చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు.

గడువులోగా అన్నీ పూర్తికావాలి

మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో పాస్‌పుస్తకాల ముద్రణ పురోగతి, ధరణి వెబ్‌సైట్ ఏర్పాటు పురోగతి, రెవెన్యూ, ఐటి అధికారులతో సీఎం సమీక్షించారు. ఇవన్నీ త్వరితగతిన అనుకున్న సమయం లోపల పూర్తయ్యేటట్లు చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు.

కండ్లద్దాలు ఉచితంగా సరఫరా చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో నేత్ర శిబిరాలను నిర్వహించి, కండ్ల పరీక్షలు జరిపి అవసరమైనవారికి కండ్లద్దాలు ఉచితంగా సరఫరా చేయాలని శనివారం తీసుకొన్న నిర్ణయంమేరకు, విధివిధానాల గురించి అధికారులతో సీఎం కేసీఆర్ సమీక్షించారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రభుత్వేతర సంస్థలను, ఎన్జీఓలను, ఆసక్తిగల ఇతర వ్యవస్థలను భాగస్వాములను చేయాలని సీఎం సూచించారు. దీనికి అవలంబించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఆరోగ్యశాఖ మంత్రిని, వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని, వైద్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమం మొత్తం మూడునెలల్లో పూర్తి కావాలని, శిబిరాలలో స్క్రీనింగ్‌తోపాటు కండ్లద్దాలు ఇవ్వాలని సీఎంచెప్పారు. వైద్య, ఆరోగ్య అంశాలకు సంబంధించి, ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలగురించి వారిని చైతన్యపరిచేవిధంగా పెద్ద ఎత్తున ప్రభుత్వపరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, తన్నీరు హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావు, కే తారకరామారావు, జీ జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్లమెంట్ సభ్యులు సీతారాంనాయక్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సీసీఎల్‌ఏ డైరెక్టర్ వాకాటి కరుణ, పీసీసీ ఎఫ్ పీకే ఝా, ఐటీ సీఇవో వెంకటేశ్వర్‌రావు, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, శాంతి కుమారి, స్మితాసబర్వాల్ పాల్గొన్నారు.

రెండేండ్ల సర్వీసు అధికారులకు పదోన్నతులు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండేండ్ల సర్వీస్ పూర్తిచేసిన అధికారులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. రాష్ట్రంలో ఖాళీగాఉన్న ఉన్నతస్థాయి పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. శాఖలవారీగా ప్రమోషన్ కమిటీలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పదోన్నతులు కల్పిస్తున్నప్పటికీ.. చాలాశాఖల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో రెండేండ్ల సర్వీస్ పూర్తిచేసినవారికి ప్రమోషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు త్వరలో విధానపరమైన నిర్ణయం వెలువడనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం

- రాష్ట్రాభివృద్ధి కోణంలో ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆస్తుల విభజన, ఉద్యోగుల విభజన వంటి సమస్యలు ఉన్నప్పటికీ.. రాష్ట్రాభివృద్ధి కోణంలో పబ్లిక్‌సెక్టార్ సంస్థల్లోని ప్రస్తుత వనరులను నిశితంగా అధ్యయనం చేసి.. ఆయా సంస్థలను లాభాల దిశలో నడిపించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఈ సంస్థలన్నింటినీ పటిష్ఠం చేసినట్లయితే 20 నుంచి 30 వేల ఉద్యోగాలను కల్పించవచ్చని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ప్రభుత్వానికి సూచించినట్టు సమాచారం. తొమ్మిదో షెడ్యూల్‌లో 90 సంస్థలు, పదో షెడ్యూల్‌లో 140 వరకు సంస్థలు ఉన్నాయి. వీటిలో వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పిస్తున్న విద్యుత్ మండలి, ఆర్టీసీ వంటి సంస్థలు ఉన్నాయి. కేవలం సేవలను అందించేందుకే ఏర్పరిచిన ఫోరెన్సిక్, ఐపీఎం వంటి సంస్థలు ఉన్నాయి. తొమ్మిది, పది షెడ్యూళ్లలోని సంస్థలను అభివృద్ధి పరిచినట్లయితే కేంద్రం నుంచి నిధులను సమీకరించుకునేందుకు అవకాశాలు ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తొమ్మిదో షెడ్యూల్‌లోని దాదాపు 70 సంస్థలకు తెలంగాణలోనే ఎక్కువగా ఆస్తులున్నాయి. ఉదాహరణకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థల ద్వారా ఆదాయవనరులు, ఉద్యోగావకాశాలు పెంచుకునే అవకాశాలు ఉన్నాయి. కాగా పదో షెడ్యూల్‌లోని 30 సంస్థలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో విభజించుకునేందుకు అవకాశాలు ఉన్నట్టు ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.10 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం పంచమి ఉదయం 8.07 వరకు తదుపరి షష్ఠి, నక్షత్రం: హస్త ఉదయం 10.18 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: తె. 4.21 నుంచి 5.57 వరకు, రాహుకాలం: ఉదయం 8.15 నుంచి 9.40 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.07 నుంచి 12.53 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.09 నుంచి 3.54 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.06 వరకు.

లోకం పోకడ



మరోరకంగా అర్థం చేసుకున్నట్టుంది.. పుస్తకాలకు బదులు ఏం తీసుకెళ్తున్నాడో చూడండి!



రాష్ట్రంలోఅత్యాధునిక హంగులతో నిర్మించిన రైతు బజార్‌లోని లోపలిభాగం



సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ. 8.16 కోట్ల వ్యయంతో నిర్మించిన హైటెక్ రైతు బజార్

సిద్దిపేటలో హైటెక్ రైతుబజార్

రాష్ట్రంలోనే తొలిసారిగా రూ.8.16కోట్లతో నిర్మాణం
నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
రైతులతో భారీ ర్యాలీకి ఏర్పాటు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోనే అత్యాధునిక హంగులతో తొలి మోడల్ రైతుబజార్ భవనాన్ని సిద్దిపేటలో నిర్మించారు. కార్పొరేట్ కార్యాలయం తరహాలో నిర్మించిన ఈ భవనాన్ని సోమవారం రాష్ట్ర భారీ నీటిపారుదల, మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభిస్తారు. తానే మొదటగా కూరగాయలు కొనుగోలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రికి ఘనస్వాగతం పలుకడానికి సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి మోడల్ రైతుబజార్ వరకు బోనాలు, బతుకమ్మలు, మంగళహారతులతో రైతులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. 1999లో సిద్దిపేటలో రైతుబజార్ ఏర్పాటైంది. ఇక్కడికి సిద్దిపేట చుట్టూ ఉన్న వివిధ గ్రామాల రైతులు తాము పండించిన తాజా కూరగాయలను తీసుకొచ్చి అమ్ముతుంటారు. రోజురోజుకూ క్రయవిక్రయాలు ఇక్కడ ఎక్కువయ్యాయి. అమ్మకాలు రేకులషెడ్లలో కొనసాగుతుండటంతో వర్షాకాలంలో రైతులకు, వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ పరిస్థితిని స్వయంగా గమనించిన మంత్రి హరీశ్‌రావు రైతుబజార్ కొనసాగుతున్న స్థలంలోనే ఆదర్శ భవన సముదాయం నిర్మించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని అందుకనుగుణంగా అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. మార్కెటింగ్ శాఖలోనే నూతన ఒరవడిని తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోనే ఒక మోడల్ రైతుబజార్ నిర్మాణానికి సిద్దిపేట నుంచే శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణం మొత్తం పూర్తయ్యేసరికి సుమారు రూ.8.16 కోట్ల వ్యయమైంది. కేవలం 13 నెలల వ్యవధిలోనే రైతుబజార్‌ను నిర్మించడం గమనార్హం. శాశ్వత ప్రాతిపదికన సాంకేతికంగా అన్ని రకాల అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన భవనం పూర్తయ్యేంతవరకూ అంతకుముందున్న రైతుబజార్‌ను తాత్కాలికంగా సిద్దిపేట మల్టీపర్పస్ హైస్కూల్ మైదానంలో నిర్వహించారు. సెల్లార్, జీ ప్లస్ 1 పద్ధతిలో నిర్మించిన ఆధునిక రైతుబజార్ సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నది. ఈ రైతుబజార్‌లో సుమారు వెయ్యి మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కొన్ని గ్రామాల నుంచి ఉదయం, మరికొన్ని గ్రామాల నుంచి సాయంత్రం వేళలో రైతులు తాము పండించిన కూరగాయలను రైతుబజార్‌కు తెస్తారు. ఇందుకు అనుగుణంగా మొదటి, రెండో అంతస్తులో కలిపి 332 స్టాళ్లను ఏర్పాటుచేశారు. కూరగాయలు అమ్మే రైతులకు బ్లాకులవారీగా స్టాళ్ల నంబర్లు కేటాయిస్తారు. మొదటి, రెండో అంతస్తులో కూరగాయల ధరలు తెలిపే డిస్‌ప్లే బోర్డులను ఏడింటిని ఏర్పాటుచేశారు. రైతుబజార్ మొత్తంలో 32 సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. తొమ్మిది కమర్షియల్ షట్టర్లను నిర్మించారు. సెల్లార్‌లో పార్కింగ్ సౌకర్యంతోపాటు 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పాడైన కూరగాయల కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుచేశారు. వీటిద్వారా విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు. ఎల్‌ఈడీ బల్బులు, ఫ్యాన్లు ఏర్పాటుచేయడమే కాకుండా ఎలక్ట్రానిక్ కాంటాలను రైతులకు అందించారు. సెల్లార్‌తోపాటు, రెండంతస్తుల్లోనూ మరుగుదొడ్లను నిర్మించారు. మంచినీటి సౌకర్యం కోసం పై అంతస్తులో రెండువేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంట్‌ను నెలకొల్పారు. వికలాంగులు, వృద్ధులు వెళ్లడానికి అనువుగా ర్యాంప్ సౌకర్యం ఏర్పాటుచేశారు. రైతుబజార్ ముందు భారీ ఎల్‌ఈడీ తెర ఉంది. ఇన్ని హంగులతో నిర్మాణమైన రైతుబజార్ సోమవారం ప్రారంభంకానుండటంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బయటపడుతున్న అవినీతి ఆస్తులు

- హెచ్‌ఎండీఏ డైరెక్టర్ ఇండ్లలో కొనసాగిన ఏసీబీ సోదాలు
- ఆదాయానికి మించిన ఆస్తులు మరో రూ.25 కోట్లు?
- పరారీలోనే పురుషోత్తంరెడ్డి, అతడి బినామీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హెచ్‌ఎండీఏ డైరెక్టర్ (ప్లానింగ్) పురుషోత్తంరెడ్డి ఇండ్లలో ఏసీబీ అధికారులు ఆదివారం కూడా సోదాలు నిర్వహించారు. శుక్రవారం ఆరుచోట్ల సోదాలు చేయగా, దాదాపు రూ.25 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు తేలిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా శని, ఆదివారాలు జరిపిన సోదాల్లో మరో రూ.25 కోట్లకుపైగానే ఆదాయానికి మించిన ఆస్తులు బయటపడినట్టు తెలిసింది. ప్రాథమిక సమాచారం మేరకు దాదాపు పదిమంది కుటుంబసభ్యులు, బంధువులే బినామీలుగా ఉన్నట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. పరారీలో ఉన్న పురుషోత్తంరెడ్డి, ఆయన బినామీలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఏసీబీ అధికారులు కొంతమంది హెచ్‌ఎండీఏ సిబ్బంది, పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బినామీలు చిక్కితే వారి ఇండ్లు, కొన్ని కార్యాలయాలు, వారిచ్చే సమాచారంతో బ్యాంకు లాకర్లను పరిశీలించాల్సి ఉంటుందని, మరిన్ని ఆస్తులు బయటపడుతాయని చెప్తున్నారు. సోదాలపై ఓ ఏసీబీ సీనియర్ అధికారి మాట్లాడుతూ.. డైరెక్టర్, అతడి బినామీల ఆచూకీ, ఇతర సమాచారం కోసం పురుషోత్తంరెడ్డి కూతురు, అల్లుడు, బావమరిదికి సంబంధించిన వారిని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌పై ఓ కేసు ఉన్నదని, తాజా కేసు దర్యాప్తులో భాగంగా అవసరమైతే పాత కేసును పరిశీలిస్తామని తెలిపారు.

తెలంగాణ బీజేపీకి బండి సంజయ్ గుడ్‌బై

- రాష్ట్ర కార్యాలయం సాక్షిగా ఆవేదన
- రాష్ట్ర అధ్యక్షుడితో చర్చలు విఫలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలు మరోమారు బహిర్గతమయ్యాయి. ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయం వేదికగా రాష్ట్ర అధికార ప్రతినిధి తన అసంతృప్తిని వ్యక్తపరిచారు. రాష్ట్ర అధ్యక్షుడితో జరిపిన చర్చలు విఫలం కావడంతో పార్టీ అధికార ప్రతినిధి పదవికి ఆయన గుడ్‌బై చెప్పారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న బండి సంజయ్‌కి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడితో పొసగడం లేదు. తన ఆవేదనను పార్టీ ముఖ్యనేతలకు వినిపించాలని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్‌ను పట్టించుకునే వారు కరువయ్యారు. దాంతో మరుసటి రోజు వరకు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో భేటీ కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బండి సంజయ్ మీడియాతో తన ఆవేదనను వ్యక్తం చేశారు. పార్టీ కోసం జైలుకు వెళ్లిన తాను ప్రస్తుతం బీజేపీలో ఇమడలేకపోతున్నానని, అందుకే రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటానన్నారు. రాష్ట్ర ఆఫీసు వేదికగా అధికార ప్రతినిధిగా ఉన్న వ్యక్తి పార్టీ తీరుపై విమర్శలు గుప్పించడం, పార్టీకి గుడ్‌బై చెప్పడం సంచలనంగా మారింది.

మిషన్ కాకతీయతో గణనీయ మార్పులు

- ఆర్థిక, సామాజిక పరిస్థితులపై మిషన్ కాకతీయ ప్రభావం
- 'మిషన్ కాకతీయ-సుస్థిర గ్రామీణాభివృద్ధి' పుస్తకావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు



జలసౌధలో 'మిషన్ కాకతీయ-సుస్థిర గ్రామీణాభివృద్ధి' అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయతో తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు చెప్పారు. ఆదివారం జలసౌధలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ టీ శ్రీనివాస్ రచించిన 'మిషన్ కాకతీయ-సుస్థిర గ్రామీణాభివృద్ధి' అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. కేయూ సోషియాలజీ విభాగం వారు మిషన్ కాకతీయపై జాతీయ సెమినార్ నిర్వహించడం, అందులో సమర్పించిన కొన్ని పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. సాగునీటిరంగంలో జరుగుతున్న అనూహ్యమైన కార్యక్రమాలు, విజయాలను మరింత లోతుగా అధ్యయనం చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి కోరారు. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను, మిషన్ కాకతీయ పథకాల అమలు తీరును సామాజిక శాస్త్రవేత్తలు, అధ్యాపకులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. రచయిత ప్రొఫెసర్ శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, మిషన్ కాకతీయ చీఫ్ ఇంజినీర్లు సురేశ్‌కుమార్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

నీటిపారుదలశాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ఐదేండ్ల బాలుడు



రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులపై అనర్గళంగా మాట్లాడిన ఖమ్మం జిల్లాకు చెందిన ఐదేండ్ల బాలుడు నేహాల్‌ను ఆదివారం జలసౌధలో అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఘంటా చక్రపాణి, దేవీప్రసాద్ తదితరులు కూడా ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ఓ ఐదేండ్ల బాలుడు అనర్గళంగా 20 నిమిషాలపాటు ప్రసంగించి అబ్బురపరిచాడు. దీంతో రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి హరీశ్‌రావు ఆ విద్యార్థిని నీటిపారుదలశాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో మంత్రి హరీశ్‌రావు, తెలంగాణ పబ్లిక్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి సమక్షంలో నేహాల్ చేసిన ప్రసంగం ఆకట్టుకున్నది. కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డ పాయింట్‌కు మార్చ డం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో సహా పలు ప్రాజెక్టుల రీడిజైనింగ్‌పై ఖమ్మం జిల్లాకు చెందిన యూకేజీ చదువుతున్న నేహాల్ ప్రసంగించాడు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లకు చెందిన హనుమంతరావు కుమారుడు నేహాల్ షాపూర్‌నగర్‌లోని ఓ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. నేహాల్ చదువుకయ్యే ఖర్చును నీటిపారుదలశాఖ భరిస్తుందని మంత్రి హరీశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలువాలని ఉందని నేహాల్ కోరడంతో.. త్వరలోనే తీసుకెళ్తానని మంత్రి హామీఇచ్చారు. నేహాల్‌తోపాటు అతడి కుటుంబసభ్యులను కాళేశ్వరం ప్రాజెక్టుకు తీసుకువెళ్లాలని సీఈ హరిరామ్‌కు మంత్రి హరీశ్‌రావు ఆదేశాలిచ్చారు.

కాకతీయుల వారసత్వాన్ని అందుకోవాలి

- ప్రాజెక్టుల నాణ్యతలో రాజీ కుదురదు
- యావత్‌దేశానికి మనం ఆదర్శం కావాలి
- నాణ్యత, నియంత్రణ విభాగంపై ఈఎన్సీ నాగేందర్‌రావు పర్యవేక్షణ
- ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో రోజుకు 2 లక్షల సంచుల సిమెంట్ వినియోగం
- సమీక్ష సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు



ఆదివారం హైదరాబాద్ జలసౌధలో నీటిపారుదలశాఖ నాణ్యత, నియంత్రణ, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ విభాగ ఇంజినీర్లతో మేధోమథనం నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాకతీయుల కాలంలో ప్రదర్శించిన అద్భుతమైన నిర్మాణ నైపుణ్యం, నాణ్యత, మంచి సామగ్రి కారణంగానే ఆనాటి నిర్మాణాలు నేటికీ సేవలు అందిస్తున్నాయని, కాకతీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఇప్పుడు ఇంజినీర్లు ముందుకుపోవాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణలో ఇప్పుడు నిర్మాణంలో ఉన్న భారీ ప్రాజెక్టులు దేశంలో ఎక్కడా లేవని, ఇవి భవిష్యత్తులో గొప్ప మాన్యుమెంట్స్‌గా చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు. అందువల్ల నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోనే కాకుండా నాణ్యతలోనూ దేశంలో తెలంగాణ ఆదర్శంగా (రోల్ మోడల్)గా నిలువాలని తెలిపారు. ఆదివారం జలసౌధలో నీటిపారుదలశాఖ నాణ్యత, నియంత్రణ, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ విభాగ ఇంజినీర్లతో మంత్రి మేధోమథనం నిర్వహించారు. పలువురు ఇంజినీర్లు చేసిన సూచనలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. నియంత్రణ విభాగానికి చెందిన ఇంజినీర్లు పనుల్ని పర్యవేక్షించినపుడు సైట్లలో ఉండే రిజిస్టర్లలో నమోదుచేయాలని, తనిఖీలో తాము గుర్తించిన అంశాల గురించి అధికారులు, క్షేత్రస్థాయి ఇంజినీర్లకు రిపోర్టుచేయాలని మంత్రి ఆదేశించారు. బిల్లులు చెల్లించే ముందు తప్పనిసరిగా సైట్‌కి వెళ్లాలని, కొలతలు, నాణ్యత నిర్ధారించుకొని, నాణ్యత, నియంత్రణ విభాగం ఇం జినీర్లు సంతృప్తి చెందిన తర్వాతే సర్టిఫికెట్లు జారీచేయాలన్నారు.

కష్టించే ఇంజినీర్లకు గుర్తింపు

ఇకపై నాణ్యత, నియంత్రణ విభాగం పనితీరును ఈఎన్సీ (పరిపాలన) నాగేందర్‌రావు పర్యవేక్షిస్తారని మంత్రి చెప్పారు. తెలంగాణ అంతటా సాగునీటి రంగంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు దాదాపు 40కి పైగా నిర్మాణంలో ఉన్నాయని, రాబోయే ఏడాది కాలం నాణ్యత, నియంత్రణ విభాగానికి అత్యంత కీలకమని వివరించారు. ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కాలంతో పోటీ పడుతున్నామని, అదే సందర్భంలో ఎట్టి పరిస్థితిల్లోనూ నాణ్యతపై రాజీపడటంలేదని స్పష్టంచేశారు. మంచిగా, నిజాయితీగా, 16 గంటల పాటు పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించాలని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని ఆదేశించారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పాలుపంచుకొంటూ ఆకుపచ్చని, రైతుల ఆత్మహత్యలులేని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నందుకు ఇంజినీర్లు గర్వపడాలని మంత్రి అన్నారు.

సీఎం మూడంచెల వ్యూహం

రాష్ట్రం ఏర్పడిన క్షణంనుంచే సీఎం కేసీఆర్ ముందుచూపుతో సాగునీటి రంగ అభివృద్ధికి మూడంచెల వ్యూహం అమలు చేస్తున్నట్టు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. గత ప్రభుత్వాలు మంజూరుచేసి అమలు చేయకుండా అటకెక్కించిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి నిర్దేశిత ఆయకట్టుకు నీరందించడం, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా కొన్ని ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేసుకోవడం, గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలమైన పాత సాగునీటి వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం వంటి బృహత్తర లక్ష్యాలతో పనులు జరుగుతున్నట్లు మంత్రి వివరించారు. ఈ వ్యూహంలో భాగంగా సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగడానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచామని చెప్పారు. సాగునీటి శాఖను కూడా ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించినట్లు పేర్కొన్నారు. సాగునీటి శాఖలో ఇంజినీర్ల బాధ్యతలను పునరుద్ధరించడంతో ఇంజినీర్లలో జవాబుదారీతనం పెరిగిందని పేర్కొన్నారు.

రోజుకు రెండు లక్షల సంచుల సిమెంటు వినియోగం..

తెలంగాణలో శరవేగంగా జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో.. రోజుకు రెండు లక్షల సంచుల సిమెంటు వినియోగం అవుతున్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అదేవిధంగా రోజుకు లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి పని, 20 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌజ్‌లు, సర్జ్‌పూల్స్, టన్నెల్స్ తవ్వకం, లైనింగ్ తదితర పనులను చూసి దేశమంతా అబ్బురపడుతున్నదని మంత్రి హరీశ్ వివరించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి, చనాక-కొర్టా, తుపాకులగూడెం, సదర్మాట్ బరాజ్‌ల నిర్మాణం, వందలాది భారీ స్ట్రక్చర్ల నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు. సమావేశంలో ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, సీఈలు సునీల్, హరిరాం, ఖగేందర్‌రావు, సురేశ్, శ్యాంసుందర్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు భారీగా వేతనం పెంపు

- రూ.10వేల నుంచి రూ.21వేలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం
- ఫైల్‌పై సంతకం చేసిన సీఎం కేసీఆర్
- 710 మందికి ప్రయోజనం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఏఎన్‌ఎంలకు శుభవార్త వినిపించారు. యూరోపియన్ కమిషన్ కింద 2003లో నియామకమైన 710 మంది ఏఎన్‌ఎంలకు భారీగా వేతనాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రూ.10 వేలు ఉన్న వేతనాన్ని రూ.21 వేలకు పెంచారు. ఆదివారం సాయంత్రం వేతనాల పెంపునకు సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రెండో ఏఎన్‌ఎంలకు వేతనాల పెంపుపై సైతం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి.. ముఖ్యమంత్రికి విన్నవించారు. వీరి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని త్వరలో నిర్ణయం వెలువరించనున్నట్టు సీఎంవో ఒక ప్రకటనలో తెలిపింది.

మేడారం జాతర ఎక్సైజ్ ఆదాయం 3.86 కోట్లు

రెండేండ్ల క్రితం 3.09 కోట్లు, 77 లక్షలు పెరిగిన ఆదాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం జాతర సందర్భంగా వారంరోజుల ఎక్సైజ్‌శాఖ ఆదాయం రూ.3.86 కోట్లు సమకూరింది. జాతర సందర్భంగా ఒక్కో మద్యం దుకాణం లైసెన్స్ ఫీజు రోజుకు రూ.9 వేలుగా నిర్ధారించి 22 మద్యం షాపులకు అనుమతులిచ్చారు. లైసెన్స్ ఫీజుల ద్వారా వారం రోజులకు రూ.13.86 లక్షల రెవెన్యూ వచ్చింది. వారంపాటు సాగిన జాతరలో 22 మద్యం షాపుల ద్వారా రూ.3.72 కోట్ల ఆదాయం వచ్చింది. మద్యంషాపుల లైసెన్స్ ఫీజుతో కలిపి మొత్తం రూ.3.86 కోట్లు వచ్చినట్టు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. గత రెండేండ్ల క్రితం జరిగిన జాతరలో వారంరోజులకు రూ. 3.09 కోట్ల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. దానితో పోల్చితే ఈసారి రూ.77లక్షలు అధికంగా రెవెన్యూ వచ్చింది.

ఎస్ఎస్‌బీని కలవరపరుస్తున్న బైక్ యాక్సిడెంట్లు

- మూడేండ్లలో 38 మంది సైనికులు దుర్మరణం
- నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ప్రమాదానికి కారణాలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: భూటాన్, నేపాల్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ)కు చెందిన సైనికులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్య కంటే రోడ్డు ప్రమాదంలో మరణించేవారి సంఖ్య 10రెట్లు ఎక్కువగా ఉంది. ఈ విషయాలను ధ్రువీకరిస్తూ ఇటీవల పారామిలిటరీ దళం ఓ నివేదికను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం..

- గత మూడేండ్లలో(2015-17) ఎస్ఎస్‌బీకి చెందిన సైనికులు 38 మంది బైక్ యాక్సిడెంట్లలో చనిపోయారు. అంటే నెలకు ఒకరు చొప్పున మృతి చెందారు.
- ఈ 38 మందిలో 28 మంది విధులు పూర్తయిన తర్వాత బైక్‌పై వెళ్తుండగా మరణించారు. మిగిలిన 10 మంది విధుల్లో భాగంగా బైక్‌పై తిరుగుతుండగా మృతిచెందారు.
- సరిహద్దుల్లో నిలబడి విధులు నిర్వహిస్తుండగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అంటే బైక్‌పై వెళ్తున్నప్పుడు జరిగిన ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది చనిపోతున్నారు.
- బైక్ యాక్సిడెంట్లలో ప్రాణాలు కోల్పోతున్నవారి వయస్సు కేవలం 30 నుంచి 40 ఏండ్ల మధ్యే ఉంది.
- బైక్ యాక్సిడెంట్లు ఎందుకు జరుగుతున్నాయంటే.. విధులు పూర్తయిన తర్వాత సైనికులు తమకు స్వేచ్ఛ దొరికిందని ఇష్టమొచ్చినట్లు బైక్‌లను నడుపుతున్నారు. నిర్లక్ష్యం, మద్యం తాగి బైక్ నడుపడం తదితర కారణాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. విధుల్లో ఉన్నప్పుడు వేగంగా బైక్‌ని నడుపడం, నిర్లక్ష్యంగా వ్యవహించడం కూడా ప్రాణాలు కోల్పోవడానికి కారణం.

నివారణ చర్యలు చేపడుతున్నాం

బైక్ ప్రమాదాలపై ఎస్ఎస్‌బీ ఉన్నతాధికారులు మాట్లాడుతూ ప్రమాదాల్లో ఎక్కువ మంది సైనికులు ప్రాణాలుకోల్పోవడం దురదృష్టకరమని చెప్పారు. బైక్‌లను వేగంగా నడుపడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడమనే కొత్త ట్రెండ్ ఎస్ఎస్‌బీలో కనిపిస్తున్నదని, దీనికి అడ్డుకట్ట వేయడానికి తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రోడ్డు భద్రతా ప్రమాణాలపై సైనికులకు అవగాహన కల్పించడానికి ప్రచారోద్యమం చేపట్టామని పేర్కొన్నారు.



లింగేశ్వరి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

అదే కళాశాలకు చెందిన మరో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వెల్దండ: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రానికి చెందిన మట్ట లింగేశ్వరి (17) అనే ఇంటర్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, అదే కళాశాలకు చెందిన మరో విద్యార్థి సాయి ఆత్మహత్యాయత్నం చేశాడు. లింగేశ్వరి కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నది. బాగా చదువుకోవాలని లింగేశ్వరిని తల్లిదండ్రులు మందలించడంతో పరీక్షల్లో పాసవుతానో, కానోనని మనస్తాపానికి గురైంది. ఆదివారం తల్లిదండ్రుల వెంట వ్యవసాయ పొలానికి వెళ్లి, కొట్టంలో ఉరి వేసుకుంది. తండ్రి కొట్టంలోకి రాగా, కూతురు శవమై కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామపంచాయతీ పరిధిలోని సంజాపూర్‌కు చెందిన సాయి మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. గమనించిన రైతులు సాయిని కల్వకుర్తికి, మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కల్వకుర్తి పట్టణంలోని లింగేశ్వరి చదివే కళాశాలలోనే సాయి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఒకే కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈ దారుణాలకు ఒడిగట్టడం అనుమానాలకు తావిస్తున్నది.

మైనార్టీ సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం

- సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- ఏటా నిధుల కేటాయింపుల్లో పెరుగుదల
- మూడేండ్లలో రూ.119.13 కోట్లు పెరిగిన బడ్జెట్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనార్టీ సంక్షేమంలో నవశకం మొదలైంది. టీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన మూడేండ్లలో మైనార్టీల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలుపరిచి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నది. బడ్జెట్‌లో ఏటా నిధుల కేటాయింపులు పెంచుతూ అదేస్థాయిలో ఖర్చు చేస్తున్నది. మూడేండ్లలో మైనార్టీ సంక్షేమ బడ్జెట్ రూ.119.13 కోట్లు పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ సంక్షేమానికి రూ.1249.49 కోట్లు కేటాయించగా, రూ.1054.10 నిధులు విడుదలయ్యాయి. వీటిలో 2017 డిసెంబర్ 31 నాటికి రూ.716 కోట్లు ఖర్చుచేశారు. అలాగే 69 కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఉమ్మడిరాష్ట్రంలో నిరాదరణకు గురైన మైనార్టీ వర్గాల్లో సీఎం కేసీఆర్ పాలన కొత్త ఆశలు రేకెత్తిస్తున్నది. మైనార్టీ కుటుంబాల్లో నిరక్షరాస్యత, విద్యలేమి, నిరుద్యోగం వంటి సమస్యలను గుర్తించిన ప్రభుత్వం.. వారి సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతున్నది. షాదీముబారక్, గురుకుల పాఠశాలలు వంటి పథకాలు విశేష ఆదరణ పొందాయి.

మూడేండ్లలో మైనార్టీ సంక్షేమానికి కేటాయింపులు, ఖర్చు

	2015-16	2016-17	2017-18
బడ్జెట్ కేటాయింపు	1130.36	1204.00	1249.49
విడుదల	610.39	950.71	1054.10
ఖర్చులు	491.52	863.36	716.00


(2017 డిసెంబర్ 31)


మైనార్టీల కోసం అమలుచేస్తున్న కార్యక్రమాలు

- 204 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, రెండు మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల మంజూరు, ప్రారంభం.
- విదేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం.
- నిరుపేద మైనార్టీ యువతుల వివాహానికి షాదీముబారక్ పథకం. తొలుత రూ.51 వేలు, ఆ తర్వాత రూ. 75,116కు పెంపు.
- ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల అమలుకు శాసనసభలో తీర్మానం.
- సివిల్స్ కోసం ఏటా 100 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్.
- బీసీ స్టడీ సర్కిల్ తరహాలో మైనార్టీలకు స్టడీ సర్కిల్ ఏర్పాటు.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తరహాలో మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.
- మైనార్టీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు (కేంద్రం నుంచి అందని వారికి).
- రాష్ట్రంలో ఉర్దూకు రెండో అధికార భాషగా గుర్తింపు.
- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 1721 మందికి ఆటోలు మంజూరు.
- ఏటా ముస్లింలకు ఇఫ్తార్ విందు, క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు విందు.
- అంతర్జాతీయ స్థాయిలో రూ.40 కోట్లతో ఇస్లామిక్, కల్చరల్ కన్వెన్షన్ సెంటర్ మంజూరు.
- రూ.10 కోట్ల ఖర్చుతో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయింపు.
- సిక్కుల గురుద్వారా కోసం మూడు ఎకరాల స్థలం కేటాయింపు.
- ఇమామ్, మౌజంలకు ప్రతినెలా గౌరవ వేతనం కోసం ఏడాదికి రూ.18 కోట్ల నిధుల మంజూరు.
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో 234 మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల భవనాల నిర్మాణం.
- స్వయం ఉపాధి కోసం మైనార్టీలకు రుణాల పంపిణీ.. వృత్తి నైపుణ్య శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు.
- ముస్లిం కమ్యూనిటీ అవసరాల కోసం 50 ఎకరాల స్థలం కేటాయింపు. శ్మశానవాటికకు రూ.43 లక్షలు మంజూరు.
- హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ సహాయంతో గరీబ్ నవాజ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైయినింగ్ సెంటర్ ఏర్పాటు.
- మైనార్టీ సంక్షేమ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేవిధంగా చర్యలు.
- టీఎస్ ప్రైడ్ తరహాలో మైనార్టీ పారిశ్రామికవేత్తలకు సహాయం.
- తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఏర్పాటు.

బెదిరించి.. ఆపై మెత్తబడి..

- కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా ఫోన్లతో చంద్రబాబు యూటర్న్
- తొలుత నిలదీద్దామని పిలుపు.. పిదప పరిస్థితిని బట్టి వెళ్దామనే వైఖరి








హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై పోరాటానికి సిద్ధపడ్డ సీఎం చంద్రబాబు.. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా ఫోన్లు చేయడంతో వ్యూహం మార్చారు. తొలుత తెగిద్దామన్నట్టు మాట్లాడిన చంద్రబాబు.. ఆ వెంటనే కేంద్రమంత్రులు మాట్లాడటంతో మెత్తబడిపోయారు. అమరావతిలో ఆదివారం జరిగిన టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో తొలుత చంద్రబాబు మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ఆందోళనకు ఎంపీలు సిద్ధంకావాలని, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాడాలని చెప్పారు. ఎవరు చెప్పినా తగ్గొద్దని పేర్కొన్నారు. సమావేశం జరుగుతుండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్.. సీఎం చంద్రబాబుకు ఫోన్ చేశారు. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని అమిత్‌షా కోరినట్టు సమాచారం. త్వరలో అన్ని విషయాలపై చర్చిద్దామని భరోసా ఇచ్చినట్టు తెలిసింది. అప్పటివరకు కేంద్రంపై మండిపడ్డ చంద్రబాబు.. ఒక్కసారిగా స్వరం తగ్గించారు. బడ్జెట్‌లో కేటాయింపులపై కేంద్రంతో చర్చించిన తర్వాత పరిస్థితిని బట్టి ఆందోళన చేయాలా? వద్దా ? బీజేపీతో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశానికి వెళ్లేముందు కేంద్రంపై మండిపడ్డ టీడీపీ ఎంపీలు.. తిరిగొచ్చేటప్పుడు మీడియాతో మాట్లాడేందుకు కూడా నిరాకరించారు.

టీడీపీ నేతలు అవినీతికి వారసులు: బీజేపీ ఎమ్మెల్సీ

టీడీపీ నేతలు అవినీతికి వారసులంటూ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మరోసారి మండిపడ్డారు. ఏపీలోని కర్నూల్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. రెండెకరాల రైతును అంటున్న మీకు (పరోక్షంగా చంద్రబాబుకు) రూ.లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఓ మహానేత (పరోక్షంగా మాజీ సీఎం ఎన్టీఆర్ అర్థం వచ్చేలా)ను భూస్థాపితం చేసి రాజ్యమేలుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకే అవినీతిపై దాడిచేస్తున్నామని వీర్రాజు చెప్పారు. రాష్ట్ర మంత్రి లోకేష్‌కు 19 అవార్డులు రావడానికి కేంద్రం ఇచ్చిన నిధులే కారణమని ఆరోపించారు.

బడ్జెట్‌కు సంబంధం లేకుండా ప్రత్యేక ప్యాకేజీ

కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ



రాష్ట్ర పునర్విభజనలో భాగంగా ఏపీకి ఇచ్చిన వాగ్దానాలను అమ లు పరుస్తామని, 2019 ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకమైన కేటాయింపులులేవని ఏపీ సీఎం చంద్రబాబు నిరసన తెలిపి, బీజేపీతో తెగదెంపులు చేసుకుంటారని వచ్చిన వార్తల నేపథ్యంలో జైట్లీ స్పందించారు. ఆదివారం ఢిల్లీలో ఓ ఆంగ్ల జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఏపీకి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తామని, ఇందులో భాగంగా ఇప్పటికే పలు దఫాలుగా నిధులను అందించామని తెలిపారు.



ప్రజలు వృద్ధాప్యం వల్ల తమ స్వప్నాలను సాకారం చేసుకునేందుకు ప్రయత్నించడం లేదనడం వాస్తవం కాదు. స్వప్నాలను సాకారం చేసుకునే ప్రయత్నాలను నిలిపివేయడం వల్లనే వారు వృద్ధులవుతున్నారు.

గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్

అసహజాలు



పక్షికున్న విశ్వాసం
మనిషికుంటే బాగుండేది!

బిడ్డల్ని మోసేది
రెక్కలొచ్చేదాక!

ఏరుక తినటం
ఎగరటం నేర్పిందా
సమస్త అరణ్యాలనూ
సప్త సముద్రాలనూ రాసిస్తది!

ఆకలి
అన్వేషణని నేర్పితే
వెతుకులాట
అధ్యయనాన్ని పురికొల్పుతది!

అనుభవం
పాఠాలు నేర్పితే
నమ్మకం
విజయగీతం పాడిస్తది!

అది రెక్కలల్లార్చిందా
నింగికీ నేలకీ మధ్య
చూస్తూ ఉండంగనే
విస్తరించిన దూరం చెరిగి పోతది!

బంధాల సుడి గుండాల్లో
బంధీయైన మనిషి
సకల సంపదలు సృష్టించుకున్నా
నిత్యం బాధల్నే మోస్తున్నాడు!

కోరుకున్న సుఖాలూ
కొని తెచ్చుకున్న దుఃఖాలూ
మనిషి జీవితాన్ని
పుట్ బాల్ బంతిని చేస్తున్నాయి!!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 94402 33261

సైరన్

వేకువనే...
ఊరి చివర మోరెత్తి అరిచే
ముసలి నక్క అరుపులాంటి
నార మిల్లు ఊల వింటుంటే

మా నాన్న 'ఎ'షిఫ్టుకు వెళ్లేముందు
మునిగాళ్లపై కూర్చుని
ఆదరాబాదరాగా మూడు ముద్దలు తిని
ఎడతెగని ఎక్కిళ్ళనాపడానికై
చీకటి గిన్నెలోంచి
తాగిన చల్ది గంజి చప్పుడే వినిపిస్తుంది

పని యంత్రంలో కదిలే
నారదారపు కండె మా నాన్న
అలసిన ప్రాణాన్ని ఆదమరచడానికి
జీతాల రోజున తప్ప తాగితే...
నెలవారీ ఖర్చుల చీటీలాంటి మా అమ్మ
పొదుపు మంత్రాన్ని పఠించలేక
మాట తూలితే
అసహనపు అరచేతి దెబ్బకు




విరిగిన చేతిగాజు ముక్కలలో
మా బాల్యం కనిపిస్తుంది

మూతపడ్డ మిల్లును తెరవమని
నిరసనగళాలై నిలిచినందుకు
చెమటచుక్కలు నెత్తుటి మడుగులుగా మారిన
ఓ తడి జ్ఞాపకం కళ్ళల్లో
కన్నీటి తెరై కదలాడుతూనే వుంది

రక్తం తాగే పెట్టుబడి పురుగు
చీకటిని చిందిస్తుంటుంది
సామూహికమై సాగిన కార్మికుల చైతన్యం
భవిష్యత్ దీపమై వెలుగుతుంటుంది

– మొయిద శ్రీనివాసరావు, 99082 56267

మన వెలుగు దివ్వె



> **జైలు జీవితాన్ని కూడా జ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకున్నారు ఆళ్వారు స్వామి. మిణుగురు ఎక్కడ ఉన్నా తన స్వభావం వీడదు. జైలులోనూ ఉద్యమ పంథా వీడని మహనీయుడు ఆయన. జైల్లో బాధలు అనుభవిస్తున్న సామాన్యుల పక్షాన ప్రభుత్వాని కి అనేక పర్యాయాలు విజ్ఞప్తులు చేశారు. జైలు సంస్కరణల కోసం కృషిచేశారు. నాటి సామాజిక పరిస్థితుల్లో చిన్నచిన్న కారణాల వల్ల జైలుపాలైన అమాయకుల పక్షాన నిలిచి పోరాడారు. వారి హక్కుల కోసం ఉద్యమించారు.**

అక్షరాస్యత అంతంతమాత్రంగానే ఉన్నకాలంలోనే తెలంగాణలో పఠనాసక్తిని పెంచేందుకు అవిరళకృషి చేశారు వట్టికోట ఆళ్వారుస్వామి. ఒక భాషగా కూడా తెలుగుకు గుర్తింపు లేని కాలంలో తెలుగు భాషాసాహిత్యాలకు ప్రాచుర్యం కల్పించేందుకు శ్రమించారు. తెలంగాణ జ్ఞాన సమాజంగా రూపొందేందుకు నిరుపమాన సేవలందించారు. తెలంగాణకు వెలుగుదివ్వెగా నిలిచారు. జీవితాన్ని, ధనాన్ని ప్రజల కోసం వెచ్చించిన వారు అరుదు. అందులోనూ ప్రజల్లో జ్ఞానతృష్ణ తీర్చేందుకు నడుంకట్టినవారు అతి స్వల్పం. అలాంటి అరుదైన పుస్తక ప్రేమికుడు వట్టికోట.

తాను ఎంతగానో అభిమానించే దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు మరణంతో ఆయన పేరిట ఒక గ్రంథ ప్రచురణాలయాన్ని, సూచీ గ్రంథాలయాన్ని స్థాపించాలని 1938లో నిర్ణయించుకున్నారు. అప్పటికే గోలకొండ పత్రికలో పనిచేయడం, ప్రచురితమైన గ్రంథాలపై ఆయనకున్న విస్తృత అవగాహన వల్ల వచన సాహిత్యంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నట్టు కనబడుతుంది. అందువల్లే ఆయన ప్రచురించిన గ్రంథాల్లో ఎక్కువ వచన సాహిత్యానికి సంబంధించినవే. దీన్నిబట్టి వచన సాహిత్యం ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తుందనేది ఆయన విశ్వాసంగా భావించవచ్చు.

ప్రజల్లో చదువు చాలా తక్కువ, పాఠశాలల్లోనూ బోధనాభాషగా ఉర్దూ చలామణిలో ఉన్న కాలం. తెలుగు వార్తా పత్రికలను చదువడం తక్కువే. తెలుగు మాట్లాడే విద్యావంతులు కూడా ఉర్దూ దినపత్రికలను చదివేవారు. అలాంటి పరిస్థితుల్లో తెలుగు గ్రంథాలను ప్రజలకు అందజేయ పూనుకోవటం ఆయన భాషాభిమానాన్ని చాటుతుంది. తక్కువ ధరతో పుస్తకాలను పాఠకుడికి అందుబాటులో ఉంచారు వట్టికోట. పైగా పాఠకుడి ఇంటి దగ్గరికే గ్రంథం అందజేసేందుకు పూనుకున్నారు ఆయన. అందుకోసం నెత్తిపై పుస్తకాల మూటతో ఊరూరా తిరుగుతూ గ్రంథ పఠనాన్ని ప్రోత్సహించారు. విజ్ఞానాన్ని పంచారు.

దేశోద్ధారక గ్రంథమాల సభ్యత్వం కోసం కాలికి బలపంకట్టి వట్టికోట ఆళ్వారు స్వామి ఊరూరూ తిరిగారు. దాదాపు 800 మందికి పైగా చదువరులను సభ్యులుగా చేర్చుకున్నారు.ఎంతో మనోధైర్యంతో ఆయన ముందుకు నడిచి తన ఆశయాన్ని సాధించారు. 'నేను కొన్నాళ్లనుంచి ఒక గ్రంథమాలను స్థాపించి, అఖిలాంధ్రుల ముఖ్యంగా తెలంగాణ వాసుల సేవ చేయు కుతూహలంతో నుంటిని. కానీ వార్తాపత్రికలనే నిరాటంకంగా చదువుటకు స్వాతంత్ర్యం, విజ్ఞానం లేని ఈ తెలంగాణవాసుల వల్ల నా కోరిక నెరవేరదేమోయను నిరాశచే వెనుకముందులాడితిని. ఇంతలో తెలంగాణ వాసుల సంస్కృతిని కాపాడుటకు, విజ్ఞానము, వికాసమును పెంపొందించుటకు కంకణము ధరించి, విజయవంతంగా తన కర్తవ్య నిర్వహణమునకు బూనుకొని నిజాం రాష్ట్రాంధ్ర మహాసభకు తోడుగా అభివృద్ధి పక్షము స్థాపించబడుటచే వెనుక ముందులు చూచుటనవసరమని తలచి ముందుకే నడువసాహసించితిని'అని ఆళ్వారుస్వామి పేర్కొన్నారు. దేశోద్ధారక గ్రంథమాల ప్రచురించిన ప్రతి గ్రంథంపై దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు చిత్రాన్ని ముద్రించడం ఆయనపై ఆళ్వారుస్వామికి ఉన్న అభిమానానికి ప్రబల నిదర్శనం.

ప్రచురణాలయ స్థాపనతో ఆయన కృషి ఆగిపోలేదు. గ్రంథాలయం నెలకొల్పడం ద్వారా విజ్ఞాన సమాజాన్ని రూపుదిద్దవచ్చన్న ఆలోచన ఆళ్వారు స్వామిది. ఆ ఆలోచనలోంచి పుట్టిందే 'దేశోద్ధారక సూచీ గ్రంథాలయం'. ఈ గ్రంథాలయం కోసం ఎన్నో పుస్తకాలను, పత్రికలను సేకరించారు. వివిధ రాజకీయ, సామాజిక అంశాలకు సంబంధించిన కరపత్రాలను, బుక్‌లెట్లను కూడా ఓపికగా సంపాదించారు. ఆ విధంగా ఆయన సేకరించిన పుస్తకాలు పదివేల దాకా ఉంటాయి. వాటిలో అభ్యుదయ, భారతి, మీజాన్, తెలంగాణ, తెలుగుతల్లి, నీలగిరి, తెనుగు, స్రవంతి మొదలైన పత్రికలున్నాయి. కేవలం తెలుగు భాషకు సంబంధించినవి మాత్రమే కాకుండా వీటిలో ఆంగ్లం, ఉర్దూ భాషల పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆ పుస్తకాలను ఎంతో శ్రద్ధగా వేర్వేరు సంపుటాలుగా బైండింగ్ చేయించి, గ్రంథాలయంలో ఉంచారు. తెలంగాణలోనే ఈ గ్రంథాలయం పెద్ద గ్రంథాలయంగా రూపొందడం గమనార్హం.

ఎంతో విలువైన పుస్తక భాండాగారంగా పేరొందిన ఈ గ్రంథాలయంలోని పుస్తకాలను వట్టికోట మరణానంతరం చాలా పెద్ద మొత్తాన్ని వెచ్చించి కొనేందుకు కలకత్తాలోని జాతీయ గ్రంథాలయం సిద్ధమైంది. కానీ, వట్టికోట మిత్రుల శ్రమ ఫలితంగా ఈ గ్రంథాలయం కలకత్తాకు తరలిపోలేదు. అనంతర కాలంలో ఈ గ్రంథాలయాన్ని హైదరాబాద్ చిక్కడపల్లిలోని నగర కేంద్రం గ్రంథాలయంలో విలీనం చేశారు.

నైజాం వ్యతిరేక పోరాటంలో భాగంగా వివిధ సందర్భాల్లో ఆళ్వారుస్వామి జైలు జీవితం గడిపారు. మొదటిసారి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఫలితంగా 1942 నుంచి 1943 వరకు ఏడాది పాటు ముషీరాబాద్ జైల్లో ఉన్నారు. ఆ కాలంలోనే 250 రూపాయల జరిమానా కూడా చెల్లించారు. సామాన్యప్రజానీకం నిత్యావసర వస్తువుల కొరతతో అల్లాడుతున్న పరిస్థితులను పేర్కొంటూ 'హైదరాబాదు ప్రజల రేషన్‌కష్టాలు' పేరుతో కరపత్రం ప్రచురించి వారం రోజులపాటు జైలు జీవితం గడిపారు. కమ్యూనిస్టుగా మారిన తర్వాత 1946 నుంచి 1951 వరకు జైల్లోనే ఉన్నారు. సంగారెడ్డి, గుల్బర్గా, హైదరాబాదు, వరంగల్లు, నిజామాబాదు జైళ్లలో జైలు జీవితంగడిపారు.

జైలు పాలైనప్పటికీ వట్టికోట కుంగిపోలేదు. మరింత పోరాట పటిమతో జైలు జీవితాన్ని మరింత అర్థవంతంగా గడిపారు. ఎన్నో రచనలు చేశారు. నాటి సమాజ సమస్యల గురించే ఆయన ఆలోచన ఉండేది. జైలు జీవితంలో ఆయనను ఎక్కువగా బాధపెట్టిన అంశం గ్రంథాల ప్రచురణకు అంతరాయం ఏర్పడటమే. గ్రంథాలయోద్యమం, నిజాం వ్యతిరేకోద్యమం తాను జైలుపాలు కావడం ఫలితంగా ఉద్యమాల్లో భాగస్వామ్యం కాలేకపోయానని బాధపడ్డారు.

జైలు జీవితాన్ని కూడా జ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకున్నారు ఆళ్వారు స్వామి. మిణుగురు ఎక్కడ ఉన్నా తన స్వభావం వీడదు. జైలులోనూ ఉద్యమ పంథా వీడని మహనీయుడు ఆయన. జైల్లో బాధలు అనుభవిస్తున్న సామాన్యుల పక్షాన ప్రభుత్వానికి అనేక పర్యాయాలు విజ్ఞప్తులు చేశారు. జైలు సంస్కరణల కోసం కృషిచేశారు. నాటి సామాజిక పరిస్థితుల్లో చిన్నచిన్న కారణాల వల్ల జైలుపాలైన అమాయకుల పక్షాన నిలిచి పోరాడారు. వారి హక్కుల కోసం ఉద్యమించారు.

జైలు జీవితంలోని తన అనుభవాలను '**జైలు కథలు**' లుగా ఆళ్వారు స్వామి మలిచారు. 1944లో గుమస్తాల సంఘం స్థాపించి, వారిని సంఘటితం చేశారు. వారానికొక సెలవుదినాన్ని, రాయితీలను సాధించారు. గుమస్తాల్లో చైతన్యం నింపేందుకు 'గుమాస్తా' అనే పేరుతో పత్రిక స్థాపించారు.

చీకట్లో మగ్గుతున్న నేలపై వెలుగు రవ్వలు వెదజల్లిన మహనీయుడతను. ఆ వెలుగు రవ్వలు ఆచంద్రతారార్కం తెలంగాణలో కాంతిని పంచుతూనే ఉంటాయి.

– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 94410 46839

(నేడు వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి)

కరువు జ్ఞాపకాలు

నలభై యేళ్ల క్రితం చూశాను
పాలమూరు పల్లెల్లో
పడగవిప్పిన కరువు సర్పాన్ని
తవుడులో దేవదారు గడ్డిని
కలిపి చేసిన బండ రొట్టెలతో
కడుపు నింపుకునే దీనావస్థలను
పోషకాహార విలువల గురించి
ప్రచారం చేసే తెల్లబట్టల సార్లను
తరిమికొట్టే ఆక్రోశ దృశ్యాలను

నిజం చెప్పాలి
నేనప్పుడు నవయువకుణ్ణి
తెల్లకాగితం లెక్కనే
తెలివితేటల గీతలు పడనివాణ్ని



ఆరోజుల్లో
కరువును చూస్తే నాకు
అంగీ బరువయ్యేది
అన్నం వెగటయ్యేది
అపరాధ భావం
అశాంతిగా మారేది

అవును మిత్రమా!
నువ్వు కరువును గురించి రాయమంటే
ఆనాటి జ్ఞాపకాలు తాజాగా కదుల్తున్నై
కవులం కదా మనం
కరువును మనం
కళ్ళతోనే చూస్తాం
అనుభవించం

మనది కేవలం సానుభూతి
సాక్షీభూతులం మనం
బరువును మనం కళ్ళతోనే కొలుస్తాం
మొయ్యం
ఆకలిని మనం
కవిత్వంతోనే చూస్తాం
అనుభవించం
నిజానికి దేన్నైనా
మనిషిగా చూడటం నేర్చుకోవాలి మనం...

– డాక్టర్ ఎన్. గోపి



పసిడిపచ్చ తెలంగాణ

అన్నీ దేశాలకన్న అందమైన తెలంగాణ
ఉన్నత శిఖరాలకెదగి–ఉన్నది మన తెలంగాణ ||అన్నీ||

హరితహార తెలంగాణ–ఆనందం పంచుతుంది
పచ్చనికాంతులు గలిగి–పరవశింపజేస్తుంది
పల్లెపట్టణములకెల్ల పచ్చదనం పంచుతుంది
సంపూర్ణ ఆరోగ్యం సర్వులకందిస్తుంది ||అన్నీ||

కరువులను నివారించి–చెరువులను నింపుతుంది
వానలు సమృద్ధి కురిసె–వనరులు కల్పించింది
మనిషికొక్క చెట్టునాటి–మనుగడ సాధించింది
భారతాన తెలంగాణ–బహువిధాల ఎదిగింది ||అన్నీ||

విప్లవాల తెలంగాణ –పచ్చదనం తెచ్చింది
బంగారు తెలంగాణ–శృంగారాలొలికింది
ప్రజల యోగక్షేమముకై–పట్టుబట్టి నిలచింది
తెలంగాణ జనముఖాలు–చిరునవ్వులు పంచింది ||అన్నీ||

వన్యప్రాణ రక్షణకై–అడుగుముందుకేసింది
అఖిలప్రాణ రక్షణకై–అడవులకాపాడుతుంది
చల్లదనం పచ్చదనం–ఉల్లాసాన్నిస్తుంది
వన రక్షణ జేయుటకే–మనప్రాణం అంటుంది ||అన్నీ||

– గోశికొండ మురారి పంతులు, 89789 74367

చెరువులను తవ్వించిరి, కవులను పోషించిరి

తెలంగాణ సంస్థానాల్లో మహిళల పాత్ర-2

> **సంస్థాన తొలిపాలకుడైన కామారెడ్డి కుమారుడు మొదటి కాచారెడ్డి. ఇతని కుమారుడు రెడ్డి భూపతి, రెడ్డి భూపతి భార్య దేచాంబిక. ఈమె తన పేర ప్రజల సౌకర్యార్థం పెద్ద చెరువును నిర్మించింది. దేచాంబిక మనుమడైన ఎల్లారెడ్డి భార్య మల్లాం బ. వీరికి ముగ్గురు కుమారులు. వీరిలో మొదటి కుమారుడైన ముమ్మడి కాచిరెడ్డి భార్య తిప్పాంబ. ఈమె కాచాపురం, తిప్పాపుర ములందు చెరువులను నిర్మించినది. వీరికి నలుగురు కుమారులు వీరిలో మొదటివాడైన జంగమరెడ్డి భార్య ఎల్లాం బ దానగుణశీలి, మృదు మధుర భాషిణిగా పేరు గాంచినది.**

పాపన్నపేట సంస్థానం: నిజాం రాష్ట్రంలో ప్రాచీనమైన సంస్థానాలలో పాపన్నపేట సంస్థానం పెద్దది. ఈ సంస్థాన మూలపురుషుడు రాంరెడ్డి (1357–88). కాలక్రమంలో అఫ్ఘనులు ఢిల్లీని పాలించిన కాలంలో (ఫిరోజ్ షా తుగ్లక్ కాలం) ఈ సంస్థానం ఆవిర్భవించినట్లు తెలుస్తుంది. 1707 నాటికి ఈ సంస్థానం మొఘల్ చక్రవర్తుల కాలంలో పాలనా సౌలభ్యం కోసం కుదించబడింది. 1748లో అసఫ్‌జాహీలు ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న కాలంలో పాపన్నపేట సంస్థాన పాలకుడైన సదాశివరెడ్డి మరణానంతరం అతని కుమార్తె లింగాయమ్మ సంస్థానాధీశులలో 6వ తరానికి చెందినవారు. లింగాయమ్మ వివాహం నరసింహారెడ్డితో జరిగింది. అతనికి ఈ సంస్థానాధిపత్యాన్ని కట్టబెట్టారు. వీరికాలం స్వర్ణయుగంగా భాసిల్లింది. లింగామయ్య పేరు మీదుగానే నేటి కామారెడ్డి జిల్లాలోని లింగంపేట నిర్మాణం జరిగినట్లు తెలుస్తుంది. ఈమె భర్త రాజా వెంకటనరసింహారెడ్డి మరణానంతరం ఈమె సంస్థానాధీశురాలిగా బాధ్యతలు చేపట్టింది. వీరవనితయైన ఈమె గొప్పసైన్యాన్ని సమకూర్చుకొని పశ్చిమదిశగా తమ సంస్థానంపైకి దండెత్తిన శత్రువులను ఎదుర్కొన్నది. నిజాం రాజ్యభాగాలపై దండెత్తి వచ్చి ప్రజల్ని పీడించి చౌత్, సర్దేశ్‌ముఖ్‌వంటి పన్నులను వసూలు చేసుకొనిపోతున్న మహారాష్ట్ర సైన్యాన్ని ఎదిరించింది.

ఈమె ధైర్య సాహసాలకు మెచ్చి నిజాంప్రభువు 'రాయ్‌బాగన్' అనే బిరుదునిచ్చి గౌరవించాడు. రాయ్‌బాగన్ అంటే ఆడ సింహం అని అర్థం. రాయ్‌బాగన్ క్రమంగా సాయ్‌బాగన్, రాయ్‌బేగంగా మారింది. గొప్ప పాలనానుభవం గల రాణి శంకరమ్మ వ్యవసాయాభివృద్ధికి అనేక చెరువులు, పంటకాల్వలు తవ్వించింది. పుత్రసంతతి లేని ఈ రాణి సూర్యవంశ క్షత్రియులు దోమకొండ పాలకులైన 1వ రాజా రాజేశ్వర్రావు, రంగమాంబల కుమారుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకొని అతనికి పట్టంకట్టింది. రాణి శంకరమ్మ తీర్థయాత్రలకు వెళ్ళిన సమయంలో శత్రువులు సంస్థానాన్ని వశపర్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాణి తిరిగివచ్చి శత్రువులను ఎదిరించి, సంస్థానాన్ని స్వాధీనం చేసుకున్న పరాక్రమవంతురాలు. సదాశివరెడ్డికి గద్వాల సంస్థానాధీశుని కుమార్తెయైన పార్వతితో వివాహం జరిపించింది. పార్వతి యుద్ధ విద్యల్లో నిష్ణాతురాలు. భర్త చేసే యుద్ధాల్లో పాల్గొని అతని అంగరక్షకురాలిగా అనేక సార్లు అతని ప్రాణాలు కాపాడి సంస్థాన ప్రజల ఆదరాభిమానాలు పొందింది. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి రాజా వెంకట దుర్గారెడ్డి సంస్థానాధీశుడయ్యాడు. కాని అతని తదనంతరం సమర్థులైన పాలకులు లేకపోవడంతో సంస్థానం 1927లో 'కోర్ట్ ఆఫ్ వార్స్' వారి స్వాధీనమైంది. తర్వాత దుర్గారెడ్డి భార్య రాణి వెంకట లక్ష్మాయమ్మ రామచంద్రారెడ్డిని దత్తత తీసుకొని సంస్థానాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నది. లక్ష్మాయమ్మ కార్యదక్షతకు ఆనందించిన నాటి నిజాం ప్రభువు 'సర్‌దేశాయ్' అనే బిరుదుతో సత్కరించాడు.

వెంకట లక్ష్మాయమ్మ సర్‌దేశాయ్ పాలనాదక్షత గల పాలకురాలే గాక స్వయాన కవయిత్రి. ఈమె కవిత్వం వేదాంతమార్గంలో పయనించింది. '**మానసబోధ**' అనే పద్యకావ్యాన్ని లలిత పద కవితాశైలిలో రచించింది. ఈమె పీల్వానా శంకరరాయ కవి, చిదెరే లక్ష్మణశాస్త్రి వంటి కవులెందరినో ఆదరించింది. రాణి వెంకటలక్ష్మాయమ్మ దత్తపుత్రుడైన రామచంద్రారెడ్డికి గద్వాల సంస్థానాధీశుల ఆడబిడ్డ లక్ష్మీదేవమ్మతో వివాహం జరిగింది. లక్ష్మీదేవమ్మ సంస్థానాధిపతురాలిగానే గాకుండా స్వతంత్ర భారతంలో రాజకీయరంగంలో కూడా గణనీయమైన పాత్ర పోషించింది 1948 తర్వాత పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది. ఈమె 1962లో అందోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు.

దోమకొండ సంస్థానం: దోమకొండ కామారెడ్డి జిల్లా ప్రాంతంలో ఉన్నది. దీన్ని తొలుత బిక్కవోలు సంస్థానంగా వ్యవహరించేవారు. బిక్కవోలు నేటి బిక్నూరు. ఈ సంస్థానాధీశులు గోల్కొండ సుల్తానులకు, అసఫ్‌జాహీలకు సామంతులుగా ఉన్నారు. ఈ సంస్థానానికి చెందిన రాజన్న చౌదరి బిక్కవోలు నుంచి రాజధానిని కామారెడ్డి పేటకు మార్చాడు. ఇతని కుమారుడైన రాజేశ్వరరావు కామారెడ్డి పేట నుంచి రాజధానిని దోమకొండకు మార్చడంవల్ల ఈ సంస్థానం దోమకొండ సంస్థానంగా పిలువబడింది. ఈ సంస్థానాధీశులు పాకనాటి రెడ్లు. కామినేడు ఈ వంశానికి ఆద్యుడు. వీరిది రాచుళ్ళగోత్రం.

సంస్థాన తొలిపాలకుడైన కామారెడ్డి కుమారుడు మొదటి కాచారెడ్డి. ఇతని కుమారుడు రెడ్డి భూపతి, రెడ్డి భూపతి భార్య దేచాంబిక. ఈమె తనపేర ప్రజల సౌకర్యార్థం పెద్ద చెరువును నిర్మించింది. దేచాంబిక మనుమడైన ఎల్లారెడ్డి భార్య మల్లాంబ. వీరికి ముగ్గురు కుమారులు. వీరిలో మొదటి కుమారుడైన ముమ్మడి కాచిరెడ్డి భార్య తిప్పాంబ. ఈమె కాచాపురం, తిప్పాపురములందు చెరువులను నిర్మించినది. వీరికి నలుగురు కుమారులు వీరిలో మొదటివాడైన జంగమరెడ్డి భార్య ఎల్లాంబ దానగుణశీలి, మృదు మధుర భాషిణిగా పేరు గాంచినది.

ఈ సంస్థానాధీశుల్లో 17వ శతాబ్దికి చెందిన మొదటి పోతారెడ్డి మనుమడైన ఇమ్మడి పోతిరెడ్డి భార్య సర్వమాంబకు రాజన్న చౌదరి అనే పుత్రుడు జన్మించాడు. ఇతని కుమారుడే రాజన్న దేశాయి. ఇతడే 1785లో దోమకొండ సంస్థానాన్ని స్థాపించాడు. ఈ సంస్థానాధీశుల్లో 20వ శతాబ్దికి చెందిన మహబలవంత్ బహదూర్ ముమ్మడి ఉమాపతి భార్య లచ్చవ్వ దానగుణశీలిగా పేరొందినది.

ఈ సంస్థానం చివరి పాలకుడు ఇమ్మడి రాజా సోమేశ్వరరావు. ఇతని ఆస్థానంలోని పెద్ద మందడి వేంకటకృష్ణకవి రాజుగారి తల్లిగారైన రాణి రాజవ్వ కీర్తిశేషురాలైన సందర్భంగా ఆమె జీవిత చరిత్రను 21 పద్యాల్లో సంగ్రహకావ్యంగా రచించారు. ఈ సంస్థానం 1950లో హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

– డాక్టర్ నమిలకొండ సునీత, 9908468171

ప్రకటనలు

ప్రాణహిత (కవితా సంహిత)

పుస్తకం విడుదల సభ

సన్నిధానం నరసింహశర్మ రచించిన 'ప్రాణహిత' కవితా సంహిత పుస్తక విడుదల సభ 2018,ఫిబ్రవరి 6, సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రం షోయబ్‌హాల్‌లో జరుగుతుంది. ప్రొఫెసర్ ఆర్.ఎస్. సర్రాజు అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా సతీష్‌చందర్, డాక్టర్ శ్రీనివాసులు దాసరి, పొట్లపల్లి వరప్రసాదరావు, ప్రొఫెసర్ గూడూరు మనోజ హాజరవుతారు. పుస్తకాన్ని జయధీర్ తిరుమలరావు ఆవిష్కరిస్తారు. డాక్టర్ ఏకే ప్రభాకర్ సమీక్షిస్తారు.

–సాహితీ సర్కిల్

పాఠశాల విద్యార్థులకు కవితల పోటీలు

వసుంధర విజ్ఞాన వికాస మండలి సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహిస్తున్నాం. కవితలు పంపే విద్యార్థులు పదో తరగతి లోపు వారై ఉండాలి. 'తెలంగాణ సంస్కృతి' అంశంపై 20లైన్లకు మించని విధంగా రాసి పంపాలి. కవితతో హామీ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జతచేసి పంపాలి. కవితలు 2018 ఫిబ్రవరి 28లోపు పంపాలి. చిరునామా–సీహెచ్ వెంకటరెడ్డి, వసుం ధర విజ్ఞాన వికాస మండలి, ఇంటినెం–16–1–238, శివాజీనగర్, గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా. ఫోన్–9182777409, 9989078568

–చదువు వెంకటరెడ్డి, అధ్యక్షులు
–మధుకర్ వైద్యుల, వ్యవస్థాపకులు

సమాచార వినిమయ మాధ్యమాలు–జండర్ దృక్పథంపై

జాతీయ సదస్సు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నాల్గవ మహాసభల సందర్భంగా 'సమాచార వినిమయ మాధ్యమాలు–జండర్ దృక్పథం'పై రెండు రోజుల జాతీయ సదస్సు తిరుపతిలోని బైరాగిపట్టెడ, గంధమనేని శివయ్య భవన్‌లో 2018 ఫిబ్రవరి 10,11 తేదీల్లో జరుగుతుంది. డాక్టర్ పుట్ల హేమలత అధ్యక్షతన జరుగు ప్రారంభ సభలో అతిథులుగా నందివెలుగు ముక్తేశ్వరరావు, నాగసూరి వేణుగోపాల్, ఎం. రత్నమాల, డాక్టర్ పద్మజాషా, డాక్టర్ కాత్యాయని విద్మహే పాల్గొంటారు.

రెండు రోజులు జరిగే వివిధ సెషన్లకు సభాధ్యక్షులుగా అనిశెట్టి రజిత, పి.రాజ్యలక్ష్మి, విష్ణుప్రియ వ్యవహరిస్తారు. వక్తలుగా.. సి. వనజ, కట్టకవిత, పింగళి చైతన్య, వంగపల్లి పద్మ, స్వేచ్ఛ వొటొర్కర్, ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు, మందరపు హైమవతి, కళ్యాణం రాజేశ్వరి, తాయమ్మ కరుణ, కొండేపూడి నిర్మల, అత్తలూరి అరుణ, ఉష తురగా, మల్లిక, డాక్టర్ కొమర్రాజు రామలక్ష్మి, బి.జ్యోతి, ఎం. లక్ష్మి, లక్ష్మి, నలిగంటి రత్నమాల, డాక్టర్ మురాడి శ్యామల హాజరవుతారు. రెహనా అధ్యక్షతన జరుగు చర్చాగోష్ఠిలో.. సి.సుజాత, సూర్యకుమారి, ఆలూరు రాఘవశర్మ, డి.జి. భవాని, ఆదిమూలం శేఖర్, వాకా మంజులారెడ్డి, రంగరాజన్, పపుదేశి ఝాన్సీ, మన్నెం చంద్రశేఖర్, మురళి, మంజుల, నాగరాజు, ఎండపల్లి భారతి, సరస్వతీ రమ పాల్గొంటారు. డాక్టర్ కె.ఎన్. మల్లీశ్వరి అధ్యక్షతన జరుగు ముగింపు సమావేశంలో డాక్టర్ కె. శ్రీనివాస్, వాసిరెడ్డి అమర్‌నాథ్, కొండవీటి సత్యవతి, వి. శాంతి ప్రబోధ, బండారు విజయ పాల్గొంటారు.

–ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

కలిసి డ్యాన్స్ చేయనంటే కడతేర్చారు

■ పాకిస్థాన్‌లో రంగస్థల నటి హత్య

పెషావర్: పాకిస్థాన్ ఖైబర్ పంక్తువా రాష్ట్రంలో ఆదివారం దారుణం జరిగింది. తమతో కలిసి డ్యాన్స్ చేయడానికి రంగస్థల నటి అంగీకరించలేదని తుపాకీతో కాల్చిచంపారు. మాజీ పోలీసు అధికారి నయీం, జాహంగీర్, మరొకరు.. రంగస్థలి నటి ఇంట్లోకి చొరబడ్డారు. ఓ వేడుకలో తమతో కలిసి డ్యాన్స్ చేయాలని కోరారు. అందుకు ఆమె నిరాకరించడంతో కాల్పులు జరిపి అక్కడినుంచి పారిపోయారని డాన్ పత్రిక పేర్కొన్నది. తీవ్రగాయలైన ఆమెను సమీపంలోని మర్దాన్ దవాఖానకు తరలిస్తుండగా మరణించారు. మృతురాలి తాత అమీర్ బాహదార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పాక్ కాల్పుల్లో నలుగురు సైనికుల మృతి

■ అమరులైన ఆర్మీ అధికారి, ముగ్గురు జవాన్లు

■ ఓ సైనికుడు, నలుగురు పౌరులకు గాయాలు

జమ్ము, ఫిబ్రవరి 4: పాకిస్థాన్ మళ్లీ బరితెగించింది. ఆదివారం జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట విచక్షణా రహితంగా కాల్పులు జరిపింది. దీంతో ఆర్మీ అధికారి కెప్టెన్ కపిల్ (22), ముగ్గురు సైనికులు మృతి చెందారు. ఓ జవాన్, నలుగురు పౌరులు గాయపడ్డారు. రాజౌరీ, పూంచ్ జిల్లాలో ఉన్న భారత పోస్టులు, సరిహద్దు గ్రామాలు లక్ష్యంగా పాక్ సైనికులు కాల్పులకు పాల్పడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. రాజౌరీ జిల్లాలోని భింభర్ గలి సెక్టార్‌పై జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతిచెందారని, తీవ్రగాయాలపాలైన ఆర్మీ అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నాయి. పూంచ్ జిల్లాలోని షాపూర్ సెక్టార్‌పై జరిపిన కాల్పుల్లో ఓ సైనికుడు, నలుగురు పౌరులు గాయపడ్డారని తెలిపాయి. రాజౌరీలోని మాంజకోటె సెక్టార్‌పైనా పాక్ కాల్పులకు దిగిందని పేర్కొన్నాయి. కాల్పుల్లో గాయపడిన వారిని సమీప దవాఖానకు తరలించామని చెప్పాయి. పాక్ కాల్పులకు భారత సైన్యం కూడా ధీటుగా సమాధానమిచ్చిందని పేర్కొన్నాయి. పాకిస్థాన్ గత నెలలో 130సార్లకుపైగా కాల్పులకు పాల్పడిందని, ఇలా కాల్పులు జరుపడం 2014 తర్వాత ఇదే మొదటిసారి అని చెప్పాయి. గత నెల 18 నుంచి 22 తేదీ మధ్య పాక్ జరిపిన కాల్పుల్లో ఆరుగురు సైనికులు, ఎనిమిది మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని అధికార వర్గాలు తెలిపాయి.



ఎల్వోసీ వద్ద పాక్‌పై కాల్పులు జరుపుతున్న భారత సైన్యం

జనాకర్షకం కాదు.. కానీ ప్రముఖ బడ్జెట్:జైట్లీ

న్యూఢిల్లీ: వేతన జీవులకు, మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపులు ఇవ్వకుండా అసంతృప్తికి గురిచేశారని.. దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నువేయడంతో స్టాక్ మార్కెట్లు పడిపోతున్నాయని.. ఎన్ని విమర్శలు వస్తున్నా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ వాటిని పట్టించుకోవడం లేదు. భారత ఆర్థికవ్యవస్థకు ప్రస్తుత పరిస్థితుల్లో ఏది అవసరమో అదే చేశామని ఆయన పేర్కొంటున్నారు. లాభాలను ఏకీకృతం చేయడానికి నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని స్పష్టంచేశారు. 'ఇది జనాకర్షక బడ్జెట్ కాకపోవచ్చు.. కానీ ప్రముఖ బడ్జెట్. ఆర్థిక, రాజకీయ వ్యవస్థల మిశ్రమం' అని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పెరుగుతున్న రాజకీయ ఆందోళనలకు ప్రభుత్వం బడ్జెట్ ద్వారా సమాధానం చెప్పాల్సి ఉన్నదని చెప్పారు.

బుల్లి రాకెట్ తయారుచేసిన జపాన్

13.6 అంగుళాల శాటిలైట్‌తో కక్ష్యలోకి..



టోక్యో: అంతరిక్ష నౌకల ప్రయోగంలో జపాన్ సరికొత్త రికార్డు నెలకొల్పింది. అంతరిక్ష నౌకలను తీసుకెళ్లే బుల్లి రాకెట్‌ను తయారుచేసి జపాన్ శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని అబ్బురపరిచారు. బుల్లి రాకెట్ సాయంతో శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టగలిగారు. ఎస్ఎస్-520 రాకెట్ ముక్కు భాగంలో థర్డ్ స్టేజీని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలు, 13.6 అంగుళాల పొడవు గల మూడు దశల క్యూబ్ శాట్ ట్రైకామ్-1ఆర్ ను అంతరిక్షంలోకి పంపడంలో కృతార్థులయ్యారు. లాంచింగ్ ప్యాడ్ ప్రదేశానికి తరలించేందుకు భారీ వాహనం కాకుండా కారు వెనుక సీట్ భాగం సరిపోతుండటం ఈ బుల్లి రాకెట్ ప్రత్యేకత.

ఆవులకూ ఓ నంబర్

ఆధార్ తరహాలో 4 కోట్ల ఆవులకు ప్రత్యేక నంబరు కేటాయింపు

మొదటిదశ కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:

దేశంలోని ప్రతి ఒక్కరికీ 12 అంకెల ఆధార్ కార్డు ఉన్నట్లుగానే ఆవులకు కూడా ఓ నంబర్‌ను (యూనిక్ ఐడెంటిఫికేషన్) కేటాయించేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నది. తొలుత ఈ ప్రతిపాదనను 2015లో తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ అమలు కోసం ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో మొదటిదశలో నాలుగు కోట్ల ఆవులకు నంబర్లు కేటాయిస్తారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు యూనిక్ ఐడెంటిఫికేషన్ (యూఐడీ) టెక్నాలజీని సమకూర్చుకున్నదని డెయిరీ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం అత్యంత చవకైనదని.. ఆవుకు సంబంధించిన జాతి, వయస్సు, లింగం, ఎత్తు, శరీర గుర్తులు వంటి వివరాలతో కూడిన టాంపరింగ్‌కు అవకాశం లేని ట్యాగ్ ఉంటుందన్నారు. ఒక్కో కార్డుకు రూ.8 నుంచి రూ.10 వరకు వ్యయం అవుతుందన్నారు. పశుసంజీవిని పేరుతో చేపట్టే ఈ ప్రాజెక్టు డెయిరీ, ఫిషరీస్ రంగంలో అతిపెద్దదని పేర్కొన్నారు.

రైతు ఆదాయం రెట్టింపుచేసేందుకు..

2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే డెయిరీ రంగం చాలా కీలకమని కేంద్రం భావిస్తున్నది. చిన్న చిన్న కమతాలు ఉన్న రైతులు వ్యవసాయంతోనే ఆదాయం సాధించలేరని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లతో చేపలపెంపకం, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి నిధి, పశుసంవర్ధక మౌలికవసతుల అభివృద్ధి నిధిని ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించారు. పశు జాతుల అభివృద్ధి, కృత్రిమ గర్భధారణ, పశుఅభివృద్ధి కోసం రూ.200 కోట్లను కేటాయించారు. ప్రతిపాదనలకు అనుగుణంగా 4 కోట్ల పశువులకు ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయిస్తే పాల ఉత్పత్తి 20 శాతం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అత్యధిక జన్యు యోగ్యత కలిగిన పాడిపశువుల సృష్టికి 15 లక్షల పశువులకు కృత్రిమ గర్భధారణ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనివల్ల 15 శాతం వృద్ధితోపాటు పాల ఉత్పత్తి విలువ రూ.15 వేల కోట్ల మేర పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాగా పశువుల అక్రమ రవాణాను నిరోధానికి చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ప్రభుత్వం 2015లో నియమించిన కమిటీ సిఫారసుల మేరకు యూఐడీ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు కింద పశువులను రిజిస్ట్రేషన్ చేయించే బాధ్యత వాటి యజమానులదే. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పశువులను చట్టబద్ధంగా విక్రయిస్తే.. హక్కులు దాని తర్వాత యజమానికి ట్రాన్స్‌ఫర్ అవుతాయి.



గోమూత్రంతో ఔషధాలు

కాలేయ వ్యాధి, కీళ్ల నొప్పులు వంటి రోగాలకు మందుల తయారీ

ఆయుర్వేద ప్రాధాన్యతను పెంచేలా యూపీ ప్రభుత్వం అడుగులు

లక్నో, ఫిబ్రవరి 4:

గోమూత్రంతో నేలను శుభ్రంచేసే ద్రవాన్ని తయారుచేసేందుకు ప్రతిపాదించిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.. ఇప్పుడు మరో అడుగువేసింది. గోమూత్రం వినియోగించి ఔషధాలను తయారుచేసింది. ఆయుర్వేద ప్రాధాన్యతను విస్తరించేందుకు కృషి చేస్తున్నది. 'గోమూత్రాన్ని ఉపయోగించి ఆయుర్వేద విభాగం ఎనిమిది రకాల ఔషధాలను తయారుచేసింది. ఈ ఔషధాలతో కాలేయ వ్యాధులు, కీళ్ల నొప్పులు, వ్యాధి నిరోధక శక్తి లోపించడం వంటి సమస్యలు దూరం అవుతాయి' అని యూపీ ఆయుర్వేద విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్ఆర్ చౌదరి ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ విభాగానికి లక్నో, ఫిలిబిత్‌లో ఫార్మసీలతోపాటు ఇతర ప్రైవేటు యూనిట్లు ఉన్నాయని, ఇక్కడ గోమూత్రం, ఆవు పాలు, నెయ్యిని ఉపయోగించి ఆయుర్వేద ఔషధాలను తయారుచేస్తున్నామని చెప్పారు. 'రాష్ట్రంలో బండా, ఝాన్సీ, ముజఫర్‌నగర్, అలహాబాద్, వారణాసి, బరేలి, లక్నో, ఫిలిబిత్‌లో మొత్తం ఎనిమిది ఆయుర్వేద వైద్య కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ ఆయుర్వేదంపై డిగ్రీ కోర్సులు నడుస్తున్నాయి. దీంతోపాటు నిత్యం వేలాదిమంది రోగులు వివిధ చికిత్సల కోసం ఆయా వైద్య కళాశాలలకు వస్తున్నారు' అని చౌదరి తెలిపారు. ఒక్క లక్నోలోని ఆయుర్వేద దవాఖానకు ఔట్ పేషెంట్ విభాగం కింద రోజుకు 700 నుంచి 800 మంది రోగులు వస్తున్నారని పేర్కొన్నారు. 'ఆయుర్వేదంలో గోమూత్రం అనేది అంతర్భాగం. గోమూత్రంతోపాటు ఇతర ఆవు ఉత్పత్తులను ఉపయోగించి ఎనిమిది రకాల మందులను తయారుచేస్తున్నాం. ఇతర వ్యాధుల నివారణకు కూడా ఈ ఔషధాలను విస్తరించేలా ప్రయత్నాలు చేస్తున్నాం. గోమూత్రం, ఇతర ఆవు ఉత్పత్తులు ఎంతో ఉపయోగకరమని అధ్యయనాలూ చెప్తున్నాయి' అని తెలిపారు. త్వరలోనే కొత్త ఫార్మసీలను ప్రారంభించేందుకు, ఆయుర్వేద వైద్య కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఎండీ కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఔషధాల తయారీకి గోమూత్రం వినియోగంపై.. కేంద్రం 2017 జులైలో ఆరెస్సెస్, వీహెచ్‌పీతో సంబంధాలు ఉన్న ముగ్గురితోపాటు వివిధ రంగాల్లో నిపుణులైన 19 మంది సభ్యులతో కమిటీ వేసింది. పంచగవ్య (ఆవు పేడ, మూత్రం, పాలు, పెరుగు, నెయ్యి) అనేది.. పోషకాహారం, ఆరోగ్యం, వ్యవసాయపరంగా ఎలాంటి ప్రయోజనాలు కలిగిస్తుందో కూడా గుర్తించాలని అప్పట్లోనే ప్రభుత్వం సర్క్యులర్‌లో పేర్కొన్నది.

అత్యవసర మందులు.. అంతంతే!

ప్రజలకు పూర్తిగా అందుబాటులో లేని 376 అత్యవసర మందులు

అనివార్యంగా ఖరీదైన మెడిసిన్ కొనుగోలు

మిశ్రమ డ్రగ్స్‌తో ఎఫ్‌డీసీ మందులు మార్కెట్లోకి

అధ్యయనంలో వెల్లడి



ముంబై, ఫిబ్రవరి 4:

విస్తృతంగా అందుబాటులోకి వచ్చేందుకు ఏటా వేలాది మందులకు ప్రభుత్వం అనుమతినిస్తున్నా, అత్యవసర మందులు మాత్రం ప్రజలకు అందుబాటులో లేవని ఓ అధ్యయనంలో తేలింది. బ్రిటన్‌కు చెందిన న్యూ క్యాజిల్ యూనివర్సిటీ, ముంబైకి చెందిన ప్రజారోగ్య చైతన్య సంస్థ 'లక్ష్య' సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం అనేక విషయాలను వెల్లడించింది. 'గ్లోబల్ హెల్త్' తాజా సంచికలో వీరి పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి.

ఒకే ఫార్ములాతో రూపొందించిన పలురకాల మందులు విస్తృతంగా మార్కెట్‌లో ఉంటున్నాయని అంకెలు చెబుతున్నా, వాస్తవానికి చాలా మందులషాపుల్లో అవి దొరుకడం లేదు. అందులో ప్రజలు చౌకగా పొందగలిగేవి చాలా స్వల్పం.

376 మందుల్ని అత్యవసర మందులుగా 2015లో ప్రభుత్వం ప్రకటించింది. మూడేండ్ల తర్వాత కూడా వీటిలో అత్యధికం అందుబాటులో లేవు.


ఆర్టెమిసినిన్ (మలేరియా), లామివుడైన్(హెచ్ఐవీ), రిఫాంపిసిన్ (టీబీ నియంత్రణ), ఆక్సిటోసిన్ (పునరుత్పాదక ఆరోగ్యం), ఫ్లూఆక్సెటిన్ (మానసిక ఆరోగ్యం), మెట్‌ఫోర్మిన్ (మధుమేహం)... ఈ ఆరు అవసరమైన మందులపై 124 రిటైల్ మెడికల్ దుకాణాల్లో సర్వే జరుపగా, ఒకటీరెండు మినహా ఏ షాపులోనూ ఈ మందులు లభ్యం కాలేవు.

2186 ప్రభుత్వం ప్రకటించిన 376 అత్యవసర మందులకు సంబంధించి... వివిధ కంపెనీలు వేర్వేరు పేర్లతో 2186 రకాలైన మందులు తయారు చేస్తున్నాయి. ఇవన్నీ మార్కెట్‌లో ఉన్నాయని ఆయా సంస్థల వెబ్‌సైట్లు, డేటాబేస్ చెబుతున్నాయి. కానీ వాస్తవానికి ప్రజలకు అందుబాటులో ఉన్నవి మాత్రం వేళ్లమీద లెక్కించగలిగేవే.

ఆరు అత్యవసర మందుల్లో.. కేవలం మెట్‌ఫోర్మిన్ మాత్రమే విస్తృతంగా అందుబాటులో ఉన్నది. 91శాతం దుకాణాల్లో అవి లభ్యమయ్యాయి. ఇక రిఫాంపిసిన్ సగానికి పైగా (64.5శాతం) దుకాణాల్లో దొరుకుతున్నాయి.

294 కేంద్ర అనుమతి లేకుండా కేవలం రాష్ట్రాల అనుమతితో విక్రయిస్తున్న 294 ఎఫ్‌డీసీ మందుల్ని 2007లో సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీవో) నిషేధించింది. 2012లో ఇలాంటి మరో 45మందుల్ని నిషేధిత జాబితాలో చేర్చింది.

అత్యవసర మందులుగా గుర్తించినవవి ప్రజారోగ్యరంగంలో విస్తృతంగా అందుబాటులో ఉండాలి. కానీ అలా జరుగడం లేదు. అనివార్యంగా ప్రజలు అవసరమైన మందుల కోసం అత్యంత ఖరీదైన ప్రైవేట్‌రంగం వైపు మళ్లుతున్నారు..



- డాక్టర్ కోలిన్ మిలార్డ్/ న్యూక్యాజిల్ యూనివర్సిటీ

చాలావరకు మందులను.. రెండు లేదా అంతకన్నా ఎక్కువ డ్రగ్ కాంబినేషన్లను కలిపి ఒకే డోస్‌గా (ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్-ఎఫ్‌డీసీ) రూపొందించి, వివిధ బ్రాండ్లపేరుతో అమ్ముతున్నారు. ట్యాబ్లెట్, క్యాప్సూల్ రూపంలో ఎక్కువగా ఉండే ఇవి ఆరోగ్యానికి హానికారకాలన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

మందుల కంపెనీల మధ్య తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ, అత్యవసర మందులు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

రిజిస్టర్డ్ మందులకు సంబంధించి తయారీ అనుమతి, పనిచేసే సామర్థ్యం, ధరల బేరీజు లాంటి వివరాలను సులువుగా తెలుసుకునేందుకు జాతీయ స్థాయి డేటా బేస్ ఏదీ ప్రజలకు అందుబాటులో లేదు.

కేసుల విచారణలో ఎలక్ట్రానిక్ రికార్డులను విశ్వసించొచ్చు


సుప్రీంకోర్టు వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కేసుల విచారణలో కోర్టులు ఎలక్ట్రానిక్ రికార్డులపై ఆధారపడవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. అందుకోసం ధ్రువీకరణ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సమర్పించాల్సిన అవసరం లేదని జస్టిస ఏకే గోయల్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నేరాల విచారణలో కాల్ రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ వీడియో రికార్డులు, సీడీల వంటి ఎలక్ట్రానిక్ ఆధారాలను న్యాయ విచారణలో అనుమతించవచ్చునని వివరణ ఇచ్చింది. నేరస్థలంలో వీడియో రికార్డింగ్ పరిశీలించాలంటే అది విశ్వసనీయంగా ఉండాలని పేర్కొన్నది. 'ఏదైనా కేసుతో సంబంధం ఉన్న అంశం అయినప్పుడు, ప్రామాణిక ఎలక్ట్రానిక్ ఆధారాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. సదరు వ్యక్తి సమర్పించే ఎలక్ట్రానిక్ ఆధారాలపై సంబంధిత కోర్టు జడ్జి సంతృప్తి చెందాలి' అని తెలిపింది. దీనిపై మరింత చర్చ జరుగాలని పేర్కొంది.

త్వరలో ముస్లింల తిరంగా యాత్ర

యూపీ సామాజిక కార్యకర్త షబానా ఖండేల్వాల్



లక్నో, ఫిబ్రవరి 4: ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో జాతీయ జెండాపై ముస్లింలకు గౌరవం లేదని ప్రచారం జరుగుతున్నదని సామాజిక కార్యకర్త షబానా ఖండేల్‌వాల్ తెలిపారు. ఇలా ముస్లింలపై అపవాదులు మోపడం సరైన పద్ధతి కాదని, త్వరలో ఆగ్రాకు చెందిన ముస్లింలతో కలిసి తిరంగా యాత్రను నిర్వహించనున్నామని చెప్పారు. ఈ యాత్రలో ఎలాంటి రాజకీయ నేపథ్యంలేని ముస్లింలు దాదాపు 500 మంది పాల్గొనే అవకాశముందని తెలిపారు. జాతీయ జెండాపై ముస్లింలకు కూడా గౌరవం ఉన్నదని, ఈ విషయాన్ని మరోసారి నిరూపించడానికి ఈ తిరంగా యాత్రను నిర్వహిస్తామని పేర్కొన్నారు. తద్వారా సమాజానికి ఒక శాంతి సందేశాన్ని అందించినవాళ్లమవుతామని వివరించారు.

పుణెలో రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ హత్య

■ ఫుట్‌పాత్‌పై జీవిస్తున్న ఆయనను కొట్టి చంపిన దుండగులు



పుణె, ఫిబ్రవరి 4: భారత సైన్యంలో కెప్టెన్ స్థాయి హోదాలో పనిచేసి పదవీవిరమణ పొందిన రవీంద్రకుమార్ బాలి (65) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతడిని సిమెంట్ ఇటుకలతో కొట్టి చంపారు. ఈ సంఘటన మహారాష్ట్రలోని పుణె కంటోన్మెంట్‌లో గురువారం అర్ధరాత్రి జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రవీంద్రకుమార్ పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో కెప్టెన్ స్థాయిలో పని చేశారు. కొంతకాలంగా ఆయన ఫుట్‌పాత్‌పైనే జీవిస్తున్నారు. గురువారం కూడా ఆయన ఫుట్‌పాత్‌పై నిద్రపోయారు. ఇదే అదునుగా భావించిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన వద్ద ఉన్న డబ్బును దోచుకోవడానికి ప్రయత్నించారు. దీంతో రవీంద్రకుమార్ తిరుగబడటంతో దుండగులు సిమెంట్ ఇటుకలతో కొట్టి చంపారు.

ఆయిల్ ట్యాంకర్‌తో కూడిన ఓడ అదృశ్యం

ఆచూకీ కోసం నైజీరియా, బెనిన్‌లతో సంప్రదింపులు: సుష్మాస్వరాజ్

న్యూఢిల్లీ/ ముంబై, ఫిబ్రవరి 4: ఒక ఆయిల్ ట్యాంకర్‌తోపాటు 22 మంది భారతీయులు ప్రయాణిస్తున్న ఓడ.. పశ్చిమ ఆఫ్రికాకు సమీపాన గల్ఫ్ ఆఫ్ గినియాలోని సముద్ర దొంగలకు నెలవైన బెనిన్ కోస్తా వద్ద అదృశ్యమైంది. దీని ఆచూకీ కోసం నైజీరియా, బెనిన్ ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదిస్తున్నట్లు విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆదివారం తెలిపారు. ఓడ సిబ్బందితోపాటు ప్రయాణికుల నుంచి ఎటువంటి స్పందన లేదని నౌకాయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) ఒకరు పీటీఐకి తెలిపారు. గత నెలలోనూ బెనిన్ కోస్తా ప్రాంత పరిధిలో 'ఎంటీ బార్రెట్' అనే భారత్ వాణిజ్య ఓడను సముద్ర దొంగలు తమ స్వాధీనం చేసుకుని, భారీగా డబ్బు ముట్టచెప్పిన తర్వాతే ఆ ఓడను, అందులో ఉన్నవారిని వదిలి పెట్టారని ఆ అధికారి చెప్పారు. సముద్ర దొంగలే ఈ ఓడను తమ ఆధీనంలోకి తీసుకుని ఉంటారని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ముంబై కేంద్రంగా సేవలందిస్తున్న ఆంగ్లో ఈస్టర్న్ షిప్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఓడ ఇది. ఓడ సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం ఆంగ్లో ఈస్టర్న్ షిప్ మేనేజ్‌మెంట్ యాజమాన్యం ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఏర్పాటు చేసింది.

ఎగ్జిట్ గేట్‌లో కాంగ్రెస్

కర్ణాటకలో ఆ పార్టీ అధికారాన్ని వీడడం ఖాయం.. బెంగళూరు పరివర్తనర్యాలీలో ప్రధాని మోదీ

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ నిష్క్రమణ దశలో ఉందని, ఈసారి అది అధికారాన్ని వీడటం ఖాయమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. బీజేపీ సీఎం అభ్యర్థి బీఎస్ యడ్యూరప్ప చేపట్టిన పరివర్తన యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం బెంగళూరులోని ప్యాలెస్‌గ్రౌండ్‌లో జరిగిన సభలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనకు తెరపడుతుందనేందుకు ర్యాలీకి హాజరైన ప్రజలే సంకేతమన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్రం కేటాయించిన నిధుల్ని కాంగ్రెస్ పార్టీ తన సంక్షేమానికి వాడుకుంటున్నదని మోదీ ఆరోపించారు. 2014 నుంచి కర్ణాటకకు కేంద్రం కేటాయించిన నిధుల వివరాలను ప్రధాని వివరించారు. కర్ణాటక అభివృద్ధి నిధుల్ని సీఎం సిద్ధరామయ్య దారి మళ్లించారని విమర్శించారు. వీటిపై ప్రజలు దృష్టి సారించాలని కోరారు. 'అంతకుముందు కర్ణాటక రాష్ట్రానికి రూ.73వేల కోట్లు కేటాయించారు. కానీ, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికిచ్చే నిధులను రూ.2లక్షల కోట్లకు పెంచింది. అంటే 180% పెంచాం' అని చెప్పారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో బెంగళూర్ మెట్రోకు రూ.17వేల కోట్లు కేటాయించామని, దీని ద్వారా 15లక్షలమంది నగర ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అరుణ్‌జైట్లీ బడ్జెట్ హవాయి చెప్పుల్లో తిరిగేవారిని హవాయిజహాజ్ (విమానం)లో తిప్పేలా ఉందని మోదీ వ్యాఖ్యానించారు. 'రైతుల ప్రయోజనాలకు టాప్ ప్రాధాన్యమిచ్చామని, ఇక్కడ టాప్ అంటే టొమాటో-అనియన్-పొటాటో. మార్కెట్ ధరల ఒడిదుడుకులకు లోనైయ్యే ఈ మూడింటినీ పండించే రైతుల కోసం 'ఆపరేషన్ గ్రీన్'ను చేపట్టాం' అని అన్నారు. డెయిరీ రైతులకు అమూల్ తరహాలో మెరుగైన ప్రయోజనాలు అందిస్తామని తెలిపారు. రైతుబిడ్డ యడ్యూరప్ప సీఎం అయితే, కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర నుంచి కర్ణాటక ఎక్కువ ప్రయోజనాలు పొందుతుందని చెప్పారు. రాష్ట్రంలో నేరచరితులే పాలన సాగిస్తున్నారని, కాంగ్రెస్‌ను కర్ణాటక నుంచే కాక ప్రజాజీవితం నుంచి పారదోలాలని మోదీ పిలుపునిచ్చారు. పెట్టుబడులు, ప్రగతికారక విధానాల్లో కర్ణాటక నెంబర్‌వన్‌గా ఉందని సీఎం సిద్దరామయ్య చెబుతున్నాడని, కానీ అది అవినీతిలో ప్రథమస్థానంలో ఉందని బీజేపీ నేత యడ్యూరప్ప విమర్శించారు.



మోదీకి మైసూర్ పెటా తొడుగుతున్న యడ్యూరప్ప

బడ్జెట్ సమావేశాల్లోనే బోఫోర్స్ తుది నివేదిక!

నివేదికకు తుది రూపునిస్తున్న పీఏసీ ■ 27 ఏళ్ల తర్వాత విచారణ ముగింపునకు నిర్ణయం

నివేదిక అంశాలపై కాంగ్రెస్ విభేదించే అవకాశం

న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాల్లోనే బోఫోర్స్ శతఘ్నుల ఒప్పందంపై తుది నివేదికను సమర్పించేందుకు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సిద్ధమైంది. 27 ఏండ్ల తర్వాత ఎట్టకేలకు ఈ కేసు విచారణను ముగించాలన్న నిర్ణయానికొచ్చింది. ఇటలీకి చెందిన బోఫోర్స్ కంపెనీతో కుదిరిన ఒప్పందంలో ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలను నిగ్గుతేల్చేందుకు పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ విచారణ జరుపుతున్నది. దీనిలో భాగంగా 1989 – 1990 కాగ్ నివేదికలో పొందుపర్చిన పలు అంశాలపై పీఏసీ సబ్ కమిటీ విచారించింది. సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి తీసుకున్న చర్యలు సరైన సమయంలో నివేదించనందున నివేదిక తయారీలో ఆలస్యమైనట్లు పీఏసీ సబ్ కమిటీ చైర్మన్ బీజేడీ ఎంపీ బర్తృహరి మహతాబ్ స్పష్టంచేశారు. బోఫోర్స్ శతఘ్నుల ఒప్పందంపై ఎలాంటి దురభిప్రాయాలకు తావులేకుండా సమగ్రమైన నివేదిక తయారుచేసినట్లు మరో సభ్యుడు వెల్లడించారు. సబ్ కమిటీ తమ నివేదిక సిద్ధం చేసి ఆమోదం కోసం పీఏసీ మెయిన్ కమిటీకి అప్పగిస్తుంది. అయితే పీఏసీ కమిటీకి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ సభ్యుడు మలికార్జున ఖర్గే ఈ నివేదికలోని పలు అంశాలపై విభేదించే అవకాశాలున్నాయి. దివంగత రాజీవ్ గాంధీ హయాంలో బోఫోర్స్ శతఘ్నుల ఒప్పందం జరుగగా, అనంతర కాలంలో ఈ ఒప్పందంలో రూ.64 కోట్ల మేర ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు కాంగ్రెస్‌ను చుట్టుముట్టాయి. కాగా, 12 ఏళ్ల తర్వాత ఇదే ముడుపుల కేసును తిరిగి విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీబీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పాకిస్థాన్‌లో పష్తూన్ ఉద్యమం

■ ఇస్లామాబాద్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళనలు




కరాచీలో పష్తూన్ ఉద్యమకారుల ప్రదర్శన

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో పష్తూన్ ఉద్యమకారుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. మూడు రోజులుగా ఇస్లామాబాద్ సహా పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో పష్తూన్ ఉద్యమకారుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆందోళనాకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వేచ్ఛనివ్వాలని నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు ఆందోళనలు కొనసాగుతాయని తేల్చిచెప్పారు. జనవరి 13న కరాచీలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా పస్తూన్ ఆందోళనాకారులు ఉద్యమిస్తున్నారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించడం వల్ల ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో శాంతి నెలకొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మందుపాతరలను తొలిగించాలని, కరాచీలో జరిగిన నకీబ్ మసూద్ నకిలీ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కశ్మీర్‌లో అల్లర్ల సృష్టికి రూ. 200 కోట్లు

■ పండిట్లను ఊచకోత కోసిన బిట్టాకు రూ.70 కోట్లు: ఎన్ఐఏ



న్యూఢిల్లీ: కశ్మీర్‌లో అశాంతి, ఉద్రిక్తత, అల్లర్లు సృష్టించడానికి సరిహద్దు ఆవల నుంచి రూ.200 కోట్లు వచ్చాయి. వాటిల్లో లష్కరే తాయిబా అధినేత హఫీజ్ సయీద్ ఒక్కరే రూ.12 కోట్లు ఖర్చు చేశారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పేర్కొన్నది. ఇందుకోసం జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ చైర్మన్ ఫరూఖ్ అహ్మద్ దర్ అలియాస్ బిట్టా కరాటేకు రూ.70 కోట్లు ముట్టాయని ఢిల్లీ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఎన్ఐఏ తెలిపింది. 1990ల్లో కశ్మీరీ పండిట్ల ఊచకోతకు పాల్పడిన వారిల్లో బిట్టా కరాటే ఒకరు. 2016 జూలై 8న భద్రతా సంస్థల ఎన్‌కౌంటర్‌లో బుర్హాన్ వనీ మృతికి ముందే కశ్మీరీలోయలో హింసాత్మక ఆందోళనలు చేపట్టాలని నిర్ణయానికి వచ్చిన లష్కరే తాయిబా, హురియత్ కాన్ఫరెన్స్ నేతలు అందుకు బిట్టా కరాటేను సంప్రదించారు. దీనికోసం రూ.70 కోట్లు కావాలని ఆయన డిమాండ్ చేశారని ఎన్ఐఏ పేర్కొన్నది.



స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఆదివారం హైదరాబాద్ మాదాపూర్ డివిజన్‌లోని సుభాష్‌చంద్రబోస్‌నగర్ నుంచి శంషాబాద్ సమీపంలోని జాహంగీర్‌పీర్ దర్గా వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీలో శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, మాదాపూర్ కార్పొరేటర్ వీ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛతలో ప్రథమ స్థానంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. - మాదాపూర్

జూన్‌లో మెట్రో రెండో దశకు ముహూర్తం!

- మొదటి దశలోని కారిడార్-1,3 పూర్తయ్యాక పనులు ప్రారంభం
- జూన్‌లోగా పూర్తికానున్న రెండు కారిడార్లు
- ఎల్బీనగర్, హైటెక్‌సిటీ వరకు వడివడిగా పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మెట్రోరైలు మొదటిదశ కారిడార్-1కు సంబంధించి అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ వరకు కారిడార్-3కు సంబంధించి అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ వరకు అందుబాటులోకి వచ్చిన తర్వాతే రెండోదశ పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు సంబంధించిన పనులు చకచకా జరుగుతున్నాయి. ఒక పక్క ఈ రెండు కారిడార్లకు సంబంధించిన పనులు వచ్చే జూన్‌లోగా పూర్తిచేసి మెట్రోను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధం చేస్తుండగా, మొదటిదశ పనులకు సమాంతరంగా రెండోదశకు సంబంధించిన సర్వే పూర్తిచేసి వచ్చే జూన్‌నాటికి డీపీఆర్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. జూన్‌లో రెండు కారిడార్లు అందుబాటులోకి రావడంతోపాటు రెండో దశ డీపీఆర్ సిద్ధం కానున్నది. మొదటి దశ కారిడార్-2కు సంబంధించి జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్(9 కి.మీ) మార్గాన్ని ఈ ఏడాది చివరినాటికి పూర్తిచేయనున్నారు.

ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్‌కు డీపీఆర్ బాధ్యతలు

మొదటిదశ ఏడాది చివరినాటికి పూర్తి కానుండటంతో రెండో దశను మొదలుపెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందడుగు వేసింది. రెండోదశకు సంబంధించిన డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను సాధ్యమైనంత త్వరగా సిద్ధం చేసి పనులకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తమవుతున్నది. అందులోభాగంగా డీపీఆర్ తయారుచేసే బాధ్యతను ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్(డీఎంఆర్‌సీ)కు అప్పగించారు. డీఎంఆర్‌సీ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చి రెండో దశ కారిడార్లకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నేతృత్వంలో హెచ్ఎంఆర్‌ఎల్‌కు చెందిన సీనియర్ ఇంజినీర్లతోపాటు డీఎంఆర్‌సీ బృందం పలు ప్రదేశాలను పరిశీలించింది.

నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు పొడిగింపు

మెట్రోరైలు రెండో దశలో భాగంగా మూడు మార్గాలకు సంబంధించిన కారిడార్ల విషయం చర్చకు వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. అందులో మొదటిదశలో భాగంగా ప్రస్తుతం నడుస్తున్న కారిడార్-3కు కొనసాగింపుగా నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మెట్రోరైలును పొడిగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీంతో కారిడార్-1, 3లు ఎల్బీనగర్ జంక్షన్ వద్ద కలుస్తాయి. అదేవిధంగా బీహెచ్ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు మరో మార్గం(కారిడార్)ను నిర్మించాలని అనుకున్నారు. కొండాపూర్, గచ్చిబౌలి మీదుగా దీన్ని తీసుకురావాలని చర్చించారు. ప్రస్తుతం కారిడార్-3 రాయదుర్గం వరకు పొడిగించగా దానికి కొనసాగింపుగా రాయదుర్గం నుంచి రాజేంద్రనగర్, పోలీసు అకాడమీ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు పొడిగించాలని సమావేశంలో చర్చించారు. మెట్రో రెండోదశ డిపోల కోసం మియాపూర్ లేదా బీహెచ్ఈఎల్‌లో 70 ఎకరాల స్థలం సేకరించాలని, మరో డిపో కోసం శంషాబాద్‌లో లేదా బుద్వేల్ వద్ద 60 ఎకరాలు సేకరించాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఒక్కో స్టేషన్, పార్కింగ్ స్థలం కోసం నాలుగు ఎకరాల వరకు సేకరించాలని, దీనికోసం ఖాళీ స్థలాలు పరిశీలించాలని అభిప్రాయానికి వచ్చారు.

బెంబేలెత్తిస్తున్న భారలోహాలు

హైదరాబాద్ వాయువుల్లో ఆర్సెనిక్, నికెల్ ● ఏడు కాలుష్య నమోదు కేంద్రాల్లో గుర్తింపు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరవాయువుల్లో నమోదవుతున్న భారలోహాలు బెంబేలెత్తిస్తున్నాయి. అత్యంత విషపూరితమైన ఆర్సెనిక్, నికెల్ మనం పీల్చే వాయువుల్లో చేరుతున్నాయి. నగరంలోని ఏడు వాయుకాలుష్య నమోదు కేంద్రాల్లోనూ భారలోహాలను కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. ముఖ్యంగా ఆర్సెనిక్, నికెల్, పాదరసం విపరీతంగా వాతావరణంలో చేరుతున్నాయి. ప్రాణవాయువుతోపాటు భూసారంలో కలిసిపోయి నీటిపొరల్లోకి చేరి పర్యావరణంలో కలుస్తున్నాయి. ఈ గాలిని పీల్చుకోవడం, ఈ నీటిని తాగడంతో నేరుగా శరీరంలోకి చేరుతున్నాయి. వీటితోపాటు పాలిక్లోరినేటెడ్ బైఫినైల్స్ వంటి హానికర రసాయనాలు సైతం పంజా విసురుతున్నాయి. తల్లి నుంచి జరాయువు ద్వారా గర్భంలోని శిశువు వరకు చేరుతున్నాయి. దీంతో పిల్లలు వివిధ లోపాలతో పుడుతున్నారు.

అత్యంత ప్రమాదకరం

ఆర్సెనిక్ అత్యంత విషపూరితమైనది. ఇది ఎక్కువ మొత్తంలో సల్ఫర్ మిశ్రమంతో కూడుకొని ఉంటుంది. కార్ల బ్యాటరీలను ఇష్టారీతిన ఓపెన్ చేయడం వల్ల ఎక్కువ మొత్తంలో వాతావరణంలో చేరుతుంది. దీనిని పీల్చుకుంటే రక్తంలో కలిసిపోయి నరాలపై తీవ్ర ప్రభావం చూపించడంతో పాటు చర్మవ్యాధులకు దారితీస్తుంది. ఇది క్యాన్సర్ వ్యాధి కారకంగా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా.. ఊపిరితిత్తుల క్యాన్సర్, గాల్ బ్లాడర్, కిడ్నీ, లివర్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. వాహనాలతో వెలువడే పొగతోపాటు బ్యాటరీల నుంచి సీసంతో పాటు ఆర్సెనిక్ వాతావరణంలోకి చేరుతున్నది. ముఖ్యంగా బ్యాటరీలను విచ్చలవిడిగా కాల్చివేస్తుండటంతో ఇవి వెలువడి హానికరమవుతున్నది. గాలిలో నమోదవుతున్న భారలోహాలకు ఎక్కువశాతం బ్యాటరీలే కారణమని గతంలోనే డబ్ల్యూహెచ్‌వో సైతం స్పష్టంచేసింది. కల్తీ ఇందనం కారణంగా పొగ ద్వారా, బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడానికి సురక్షితమైన పద్ధతులను అవలంభించకపోవడం, డంపింగ్ యార్డుల్లో, ఫర్నేసుల్లో ఇష్టారీతిన కాల్చేస్తుండటంతో ఇవి గాలిలో చేరుతున్నాయి. నికెల్ లంగ్స్ క్యాన్సర్‌కు దారితీస్తుందని 'ది న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రకటించింది. దీంతోపాటు గుండె సంబంధ వ్యాధులు, నరాల బలహీనత, హైబీపీ సహా శిశు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని గుర్తించింది.

మీటరు వ్యవధిలో నమోదైన భారలోహాలు మైక్రోగ్రాముల్లో		
స్టేషన్	ఆర్సెనిక్	నికెల్
బాలానగర్	2.3	1.6
ఉప్పల్	2.3	1.6
జూబ్లీహిల్స్	2.3	1.6
ప్యారడైజ్	2.3	1.6
చార్మినార్	2.3	1.6
జీడిమెట్ల	2.3	1.6
జూపార్క్	2.3	1.6

సీపీసీబీ మానిటరింగ్

హైదరాబాద్‌లోని వాయువుల్లో నమోదవుతున్న భారలోహాలను ముందే పసిగట్టిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వీటి స్థాయిని నమోదుచేయాలని ఆదేశించింది. ప్రతి నెలా ఈ వివరాలను పంపించాలని కోరింది. ఈ మేరకు తెలంగాణ పీసీబీ అధికారులు హైదరాబాద్‌లోని ఏడు స్టేషన్ల ద్వారా వీటి స్థాయిలను ఎప్పటికప్పుడు నమోదుచేస్తూ సీపీసీబీకి పంపిస్తున్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకసారి, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు మరోసారి, రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఇంకొకసారి భారలోహాల స్థాయిని లెక్కిస్తున్నారు.

వెల్‌నెస్.. ఫుల్ రష్

ఏడాదిలోనే లక్షకుపైగా శస్త్రచికిత్సలు ● ఐదు లక్షలు దాటిన ఔట్‌పేషెంట్ సేవలు

33 అవయవ మార్పిడులు ● అందుబాటులో 50 రకాల వైద్య పరీక్షలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పాలనలో కీలకమైన ఉద్యోగులు, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచే పాత్రికేయుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రారంభించిన వెల్‌నెస్ సెంటర్లకు విశేష ఆదరణ లభిస్తున్నది. వీటి పనితీరును మొదటిసారిగా గుజరాత్ ప్రభుత్వం ఆరాతీయగా.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు మార్గదర్శకంగా నిలిచింది. 2016 డిసెంబర్ 17న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో మొట్టమొదటి వెల్‌నెస్ సెంటర్‌ను, 2017 ఫిబ్రవరి 2న వనస్థలిపురంలో రెండో సెంటర్‌ను ఆ తర్వాత వరంగల్‌లో మూడో సెంటర్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లో వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం.

రోజూ ఓపీ సేవలు (దాదాపు)	
సెంటర్	ఓపీ
ఖైరతాబాద్	800-1000
వనస్థలిపురం	500-700
వరంగల్	400-500

అవయవ మార్పిడులు	
కిడ్నీ మార్పిడి	9
బోన్‌మ్యారో	06
కాలేయ మార్పిడి	(8క్యాడవర్)14
మొత్తం	33

నిరీక్షణ సమయం తప్పింది

ఏడాది ముందువరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం(ఈహెచ్ఎస్)కార్డుతో, జర్నలిస్టులు జేహెచ్ఎస్ కార్డులతో ప్రభుత్వ, కార్పొరేట్ దవాఖానల్లో వైద్యసేవలు పొందేవారు. అయితే వారికోసం ప్రత్యేక కౌంటర్లు లేకపోవడంతో ఇతర రోగులతోపాటే గంటల తరబడి నిరీక్షించేవారు. చాలా సందర్భాల్లో పథకాలు అందుబాటులో లేవని కార్పొరేట్ దవాఖానలు వైద్యానికి నిరాకరించేవి. వృత్తిరీత్యా సమయాభావం వల్ల పలువురు సొంత డబ్బులతో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించేవారు. మరికొందరు వైద్యానికి దూరంగా ఉండేవారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, విశ్రాంత ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం లభించింది. వారు ఈ కేంద్రాల్లో నగదు రహిత ఓపీ సేవలను, వైద్యపరీక్షలను పొందగలుగుతున్నారు. తదుపరి చికిత్స కోసం వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని తమకు ఇష్టమైన దవాఖానలో నేరుగా చేరి, నగదు రహిత చికిత్స పొందే వెసులుబాటు లభించింది. గత 13 నెలల్లో మూడు కేంద్రాలో కలిపి మొత్తం 5.13 లక్షల మంది ఓపీ సేవలను వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. మరోవైపు ఇతర దవాఖానలపై కూడా ఒత్తిడి తగ్గింది.

- ఈ కేంద్రాల ద్వారా వివిధరకాల శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి సంఖ్య 1.23 లక్షలు. ఇందులో ప్రధానంగా గుండె సంబంధ శస్త్రచికిత్సలు 10,050, కిడ్నీ సంబంధ-6,070, కంటి ఆపరేషన్లు-43,571, మెడికల్ అంకాలజీ-5,861, ఆర్థోపెడిక్-4,351 ఆపరేషన్లు జరిగినట్టు అధికారులు తెలిపారు.
- ముందుగా వెల్‌నెస్ సెంటర్లలో ఓపీ సేవలు పొందాల్సి ఉంటుంది. అక్కడ అందుబాటులో లేని పరీక్షలను ఇతర దవాఖానలకు రిఫర్ చేస్తూ వైద్యులు ప్రిస్కిప్షన్ ఇస్తారు. రోగులు వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని ఏదేని దవాఖానకు వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు.
- వెల్‌నెస్ సెంటర్ల పరిధిలో 300 ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖాలు ఉన్నాయి. ఇందులో నిమ్స్, ఉస్మానియా, గాంధీ తదితర సూపర్‌స్పెషాల్టీ దవాఖానలున్నాయి. శస్త్రచికిత్స కోసం రిఫర్ చేస్తూ రాసే ప్రిస్కిప్షన్‌లో ఎక్కడా దవాఖాన పేరు ఉండదు. రోగి నచ్చిన దవాఖానలో చేరవచ్చు.

అందుబాటులో 15 విభాగాలు

వెల్‌నెస్ సెంటర్లలో మొత్తం 15 విభాగాలు అందుబాటులో ఉన్నాయి. జనరల్ మెడిసిన్, డెంటల్, ఆప్తమాలజీ(కన్ను), గైనకాలజీ, ఆర్థోపెడిక్, అంకాలజీ, నెఫ్రాలజీ, పల్మానలజీ, ఈఎన్టీ, డయాబెటాలజీ, హోమియోపతి, ఆయుర్వేదిక్, యునాని, ఫిజియోథెరపి, యోగ విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాలన్నీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయి. ఓపీ, వైద్య పరీక్షలు అక్కడే నిర్వహిస్తారు. శస్త్రచికిత్సలు, తదుపరి వైద్యం కోసం ఇతర దవాఖానలకు రిఫర్ చేస్తారు. సెలవులతో నిమిత్తం లేకుండా వెల్‌నెస్ సెంటర్లు పనిచేస్తాయి.



హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్

అత్యాధునిక ల్యాబ్‌లో 50 రకాల పరీక్షలు

ఖైరతాబాద్, వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్లలో 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఈసీజీ, 2డీ-ఈకో, అల్ట్రాసౌండ్, థైరాయిడ్ ప్రొఫైల్, ఎక్స్-రే, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు, సీబీపీ, ఈఎస్ఆర్, కొలెస్ట్రాల్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, యూరిన్ కల్చర్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 30 వేల వైద్య పరీక్షలు జరిపినట్టు అధికారులు తెలిపారు. అందుబాటులో లేని పరీక్షల కోసం ఇతర దవాఖానలకు రిఫర్ చేస్తారు.

త్వరలో మరిన్ని కేంద్రాలు



వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ఉద్యోగులు, జర్నలిస్టులకు పైసా ఖర్చు లేకుండా అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం. త్వరలోనే కార్డియాలజీకి సంబంధించిన పూర్తి ఇన్విస్టిగేషన్ పరీక్షలు, ఎంఆర్ఐ తదితర సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం. గ్రేటర్‌కు నాలుగువైపులా ఒక్కొక్కటి చొప్పున మరో నాలుగు కేంద్రాలు ప్రారంభిస్తాం. ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. గతంలో హెల్త్‌కార్డులు ఉన్నా కుటుబ సభ్యులను అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే దవాఖానలకు తీసుకొచ్చేవారు. ఇప్పుడు చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెల్‌నెస్ సెంటర్‌కు తీసుకొస్తున్నారు.

– డాక్టర్ కే పద్మ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ సీఈవో

ఉప్పల్‌లో శిశువుది నరబలే?

- మూఢనమ్మకంతో ఒకరి ఆరోగ్యం కోసం మరొకరి హత్య!
- కొంత పురోగతి సాధించినా అధికారికంగా ధ్రువీకరించని పోలీసులు
- ఇంకా దొరుకని మొండెం.. ఆయుధం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంచలనం సృష్టించిన ఉప్పల్ చిలుకానగర్‌లో గుర్తు తెలియని శిశువు హత్య కేసులో రాచకొండ పోలీసులు పురోగతి సాధించారు. ఇది నరబలిగానే నిర్ధారణకు వస్తున్నప్పటికీ అధికారులు మాత్రం అధికారికంగా ధ్రువీకరించడం లేదు. శిశువును చంపిన వ్యక్తులను గుర్తించినప్పటికీ మొండంతో పాటు ఆ శిశువు శరీరాన్ని వేరు చేసేందుకు ఉపయోగించిన మారణాయుధం ఇంకా పోలీసులకు దొరుకలేదని తెలిసింది. ఇందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇంకా ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు. శిశువు తల భాగం దొరికిన ఇంటి యజమానే ప్రధాన అనుమానితుడిగా పోలీసులు దర్యాప్తును చేపడుతున్నప్పటికీ ఈ విషయాన్ని స్పష్టం చేయడం లేదు. దర్యాప్తు మరికొన్ని రోజులపాటు కొనసాగుతుందని జవాబు దాటవేస్తున్నారు. మృతి చెందిన శిశువును ఎవరి నుంచి కొనుగోలు చేశారు? ఎంతకీ కొనుగోలు చేశారు? ఆ నగదు లావాదేవిలు ఏలా జరిగాయి? ఎన్ని రోజుల నుంచి ఈ ఘాతుకానికి పథకం వేశారు? ఎంత మంది కుట్రపన్నారు? అనే విషయాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఈ హత్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి పాత్రపై పోలీసులు సాక్ష్యాలను సేకరిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

సలహా ఇచ్చిన వ్యక్తే ప్రధాన సూత్రధారి!

'మూఢనమ్మకంతో ఒకరి ఆరోగ్యం బాగు కోసం మరొకరి ప్రాణం తీస్తే ఫలితం ఉంటుందని' సలహా ఇచ్చిన వ్యక్తి కూడా ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా మారే అవకాశం ఉన్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. విచారణలో ఈ శిశువును ఎక్కడి నుంచి తీసుకొచ్చారనే అంశం కీలకంగా మారింది. ఆనాథ శిశువు, లేక ఎవరైనా దవాఖాన సిబ్బంది శిశువును విక్రయించారా లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారు అమ్ముకున్నారా ఇలా ప్రతి కోణంలో విచారణ జరిపారు. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లోని పసి పాపల మిస్సింగ్ కేసులు, శిశు విక్రయాల ముఠా చిట్టాను పోలీసులు తమ విచారణలో పరిశీలించారు. మొత్తానికి కేసు దర్యాప్తులో నిందితుల ఆసక్తికరమైన కోణాన్ని ఛేదించినప్పటికీ విచారణలో శిక్ష పడేలా అవసరమయ్యే మిగతా ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు దర్యాప్తు అంశాలను ధృవీకరించడం లేదు. ఈ విధంగా విశ్వసనీయంగా వెలుగులోకి వస్తున్న అంశాలు ఇది నరబలిగా తేలుతున్నప్పటికీ పోలీసులు అధికారిక ప్రకటన కోసం ఇప్పుడు అందరూ ఎదురుచూస్తున్నారు. నరబలి కోణమే కాకుండా ఇతర కారణాలు ఉండొచ్చనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

విగ్రహాలను దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్

- భక్తులుగా ఆలయంలో రెక్కీ.. రాత్రి పూట చోరీ
- కామారెడ్డి గోపాలస్వామి ఆలయానికి కన్నం
- రూ.3 కోట్ల విలువైన విగ్రహాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు. చిత్రంలో కామారెడ్డి ఎస్పీ శ్వేత, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు కూడా ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భక్తులుగా గుడికెళ్లి అతిపురాతన పంచలోహ విగ్రహాలను చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, కామారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. రూ.3 కోట్ల విలువైన గోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కామారెడ్డిలో గత నెల 27న 600 ఏండ్ల కిందటి పురాతన గోపాలస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు దర్యాప్తులో భాగంగా దొంగిలించిన విగ్రహాలను హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా కట్ట తుగావ్ గ్రామానికి చెందిన షేక్ హైదర్, షేక్ అజీజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి కామారెడ్డిలోని గోపాలస్వామి ఆలయంలో చోరీకి గురైన గోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విగ్రహాల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.3 కోట్ల వరకు ఉంటుందని సీపీ వెల్లడించారు.

భక్తులుగా వెళ్లి విగ్రహాల దొంగతనం

షేక్ హైదర్ పురాతన పంచలోహ విగ్రహాలను చోరీ చేయడంలో ఆరితేరాడు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ల్లో చోరీలకు పాల్పడ్డాడు. గతంలో కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి విడులైన తర్వాత తిరిగి విగ్రహాల దొంగత నం ప్రారంభించాడు. ఇందుకు షేక్ అజీజ్‌తో జత కట్టాడు. తమ స్వస్థలం బీదర్ నుంచి రైళ్లు, బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లి లడ్జీల్లో ఉంటూ ఉదయం వేళల్లో భక్తుల మాదిరిగా గుడికి వెళ్లి దేవుడికి దండం పెట్టి, ఆ విగ్రహాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఆయా ఆలయాల చరిత్రను ఆరా తీస్తారు. ఇలాభక్తుల మాదిరిగా వెళ్లి రెక్కీ నిర్వహించిన తర్వాత అవి పురాతన పంచలోహ విగ్రహాలని నిర్ధారణ అయితే తమ ప్లాన్‌ను ఖరారు చేసుకుంటారు. రాత్రి గుడిని మూసివేసిన తర్వాత తాళాలు పగులగొట్టి విగ్రహాలను దొంగిలిస్తారు. ఒకరు దొంగతనంలో ఉండ గా మరొకరు గుడి బయట ఉండి గమనిస్తుంటారు. ఎవరైనా అక్కడకు వస్తున్నట్లైతే వెంటనే ఫోన్ చేసి లోపలున్న వారికి సమాచారం ఇస్తుంటారు. దొంగతనం పూర్తయ్యా క అదే రాత్రి ఆ పట్టణం నుంచి బయటపడుతారు. ఇలా కామారెడ్డలో విగ్రహాలను చోరీ చేసిన షేక్ హైదర్, అజీజ్ అక్కడి నుం చి నిజామాబాద్‌కు వెళ్లిపోయారు. తర్వాత హైదరాబాద్‌కు అక్కడి నుంచి బల్కీ వెళ్లి, మరోసారి హైదరాబాద్‌కు చేరుకుని అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఆశ్రయం పొందారు. ఆ విగ్రహాలను విక్రయించేందుకు ఢిల్లీ, పుణె కు చెందిన బ్రోకర్లకు సమాచారం ఇచ్చారు. టెక్నాలజీ సహాయంతో టాస్క్‌ఫోర్స్, కామారెడ్డి పోలీసులు ఈ ముఠా ఆచూకీని గుర్తించి, అఫ్జల్‌గంజ్‌లో పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న మూడు విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ ముఠాపై కర్ణాటకలోనూ కేసులు..

ఈ ఇద్దరు దొంగలు గతంలో కర్ణాటకలోని బగల్‌కోట్ జిల్లాలో రెండు, బిజాపూర్‌లో ఒక గుడిలో దొంగతనం చేశారు. తాజాగా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్న తర్వాత మహారాష్ట్రలోని ఔరంగాబాద్ డివిజన్‌లోని హింగోలీ పీఎస్ పరిధిలో, లాతూర్ జిల్లాలోని కిలోరి పీఎస్ పరిధిలోనూ తామే దొంగతనాలకు పాల్పడ్డామని చెప్పారు. కామారెడ్డి దొంగతనం కేసులో విగ్రహాలను రికవరీ చేయగా మహారాష్ట్రకు కేసులో రికవరీ చే యాల్సి ఉన్నదని కమిషనర్ వెల్లడించారు. సమావేశంలో కామారెడ్డి ఎస్పీ శ్వేత, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు మణిశర్మ ఆఫీస్‌లో

రూ.4.50 లక్షలు మాయం



బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: సినీ సంగీత దర్శకుడు మణిశర్మ కార్యాలయంలో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ రోడ్ నంబర్-10లో సంగీత దర్శకుడు మణిశర్మ కార్యాలయం ఉన్నది. గత నెల 27న చెన్నై వెళ్లిన మణిశర్మ ఫిబ్రవరి 2న నగరానికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు ఆఫీసుకు వచ్చిన మణిశర్మ తన కార్యాలయంలోని బీరువాలో పెట్టిన రూ.4.50 లక్షలు తీసుకునేందుకు వెళ్లగా కనిపించలేదు. కార్యాలయంలో పనిచేసే వ్యక్తిగత సహాయకుడు వెంకటేశ్ కోసం వాకబు చేయగా, రెండు రోజుల కిందట ఊరెళ్తున్నానని చెప్పి వెళ్లాడని తేలింది. దాంతో నగదును వెంకటేశ్ తస్కరించి ఉంటాడని మణిశర్మ మేనేజర్ సుబ్బానాయుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చంచల్‌గూడ జైలులో ఖైదీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఖైదీల సత్ప్రవర్తన కోసం కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: క్షణికావేశంలో నేరాలు చేస్తూ జైలుకు వస్తున్నవారిలో మార్పుకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ అర్జున్‌రావు తెలిపారు. 'ఉన్నతి' కార్యక్రమంలో భాగంగా ఓయూ ప్రొఫెసర్ బీనా సారథ్యంలో ఆదివారం ఖైదీలు, వారి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. నేరాలు చేసి జైలుకు వస్తున్నవారిని, విడుదలైన తర్వాత వారి కుటుంబ సభ్యులు ఆదరించడం లేదని.. దీంతో వారు తిరిగి నేరాలబాట పడుతున్నారని తెలిపారు. ఇలాంటి ఖైదీలను గుర్తించి, వారు చేసిన నేరాలను పరిశీలిస్తున్నామన్నారు. ఖైదీలకు వారి కుటుంబసభ్యులతో ఉన్న సంబంధాల గురించి ములాఖత్ ద్వారా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఆదరణ లేని ఖైదీలను గుర్తించి.. వారి కుటుంబసభ్యులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పీ సాయిబాబా, జైలర్లు వీ శ్రీనివాస్‌రావు, వెంకటేశం, ఉన్నతి టీమ్ ప్రతినిధి స్రవంతి పాల్గొన్నారు.



హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన అఖిల భారత ఉద్యానవన, వ్యవసాయ ప్రదర్శన సోమవారంతో ముగియనున్నది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఇక్కడ కొలువుదీరిన రకరకాల మొక్కలను కొనుగోలు చేసేందుకు నగరవాసులు భారీగా తరలివచ్చారు.

ఉద్యోగి ఖాతా నుంచి 1.50 లక్షలు హాంఫట్

- ఒకేరోజు మూడు ఓటీపీలతో కాజేసిన సైబర్ క్రిమినల్స్
- పశ్చిమ బెంగాల్, బీహార్ ఖాతాలకు బదిలీ
- రాచకొండ సైబర్‌క్రైం పోలీసుల విచారణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బ్యాంకులు ఎన్ని సెక్యూరిటీ ఫీచర్లను ప్రవేశపెట్టినా, వినియోగదారుల అమాయకత్వం సైబర్‌నేరగాళ్ల పాలిట వరంగా మారుతున్నది. బ్యాంకులు పంపించే ఓటీపీ సంఖ్య ఎవరికీ చెప్పవద్దని పదేపదే సంక్షిప్త సందేశాలు వస్తున్నప్పటికీ, తాము బ్యాంకర్లమని చెప్పి వినియోగదారులను బురిడీ కొట్టించడంలో సైబర్‌నేరగాళ్లు ఆరితేరారు. హైదరాబాద్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌కు తన ఖాతా వివరాలు, ఓటీపీ సంఖ్య చెప్పి.. రూ.1.50 లక్షలు పోగొట్టుకున్నాడు. ఒక హోదాలో ఉండి ఆమాత్రం తెలుసుకోకుండా మోసపోయానన్న మనోవేదనతో ఫిర్యాదు చేయడానికి సంకోచిస్తుండగా, ఆయన భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై రాచకొండ సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు (పేరు చెప్పేందుకు నిరాకరించారు) వారం కిందట ఒక ఫోన్‌కాల్ అందుకొన్నారు. తాను బ్యాంక్ మేనేజర్‌నంటూ తనను తాను పరిచయం చేసుకొన్న వ్యక్తి మీ డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు అప్‌డేట్ చేస్తున్నామని చెప్పుకొచ్చాడు. సదరు వ్యక్తి చెప్పిన కొన్ని వివరాలు నమ్మశక్యంగా ఉండటంతో బాధిత ఉద్యోగి తన ఖాతా వివరాలన్నీ వెల్లడించాడు. వీటన్నింటి క్లియరెన్స్‌కోసం మీకు ఓటీపీ నంబర్ వస్తుందని, దాన్ని చెప్పాలంటూ అడుగడంతో ఓటీపీ నంబర్ వెల్లడించారు. రెండు గంటల తర్వాత మళ్లీ ఫోన్ వచ్చి మీ నంబర్ తప్పు చెప్పడంతో వివరాలు అప్‌డేట్ కాలేదని, మీ కార్డు సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. మరోసారి వచ్చే ఓటీపీని తెలియజేయాలని కోరడంతో బాధిత ఉద్యోగి మరోసారి నంబర్ చెప్పాడు. ఆ తర్వాత మీరు సరిగా చెప్పటంలేదు.. మళ్లీ ఓటీపీ వస్తుంది.. చెప్పండంటూ అడుగటంతో మూడోసారి కూడా ఓటీపీని బాధిత ఉద్యోగి ఫోన్ చేసిన వ్యక్తికి తెలియజేశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఉద్యోగి ఖాతాలో నుంచి రూ.1.50 లక్షలు చోరీ అయిపోయాయి. దీంతో మనోవేదనకు గురైన ఉద్యోగి ముందుగా ఫిర్యాదు చేయడానికి వెనుకాడటంతో ఆయన భార్య రాచకొండ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రాచకొండ సైబర్ క్రైం పోలీసులు ఇది పశ్చిమబెంగాల్ ముఠా పనిగా అనుమానిస్తున్నారు. ఉద్యోగి ఖాతా నుంచి డ్రా అయిన మొత్తం పశ్చిమ బెంగాల్‌లోని ఒక ఖాతాకు, బీహార్‌లోని మరో బ్యాంక్ ఖాతాకు బదిలీ అయినట్టు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు బదిలీ అయిన ఖాతాల బ్రాంచిల బ్యాంక్ ఉద్యోగుల సహకారంతో నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఎల్‌టీసీజీతో ఖజానాకు భారీగా ఆదాయం

■ 2019-20లో రూ.40,000 కోట్లుగా ఉండొచ్చన్న అధియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం రెండేండ్లలో రెండింతలు కాగలదన్న విశ్వాసాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తున్నది. పన్ను ఎగవేతలను అరికట్టడంలో భాగంగా పద్నాలుగేండ్ల తర్వాత బడ్జెట్‌లో మళ్లీ ఎల్‌టీసీజీని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ పరిచయం చేసిన విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్‌లోని పెట్టుబడులపై లాభాలు రూ.లక్ష దాటితే అందులో 10 శాతం ఎల్‌టీసీజీ పన్నుగా చెల్లించాలని ప్రతిపాదించారు. ఈక్విటీ నేపథ్యం కలిగిన మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చిన ఆదాయంపైనా 10 శాతం పన్ను చెల్లించాల్సిందే. ఈ క్రమంలోనే పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా.. 2018-19లో రూ.20,000 కోట్ల ఆదాయం రావచ్చనగా, 2019-20లో ఇది రూ.40,000 కోట్లకు పెరుగవచ్చన్నారు. 2017-18 మదింపు సంవత్సరం కోసం దాఖలైన ఐటీ రిటర్నుల ప్రకారం పన్ను మినహాయింపు ఆదాయం రూ.3.76 లక్షల కోట్లుగా ఉందన్న ఆయన ఇది చాలా ఎక్కువన్నారు. ఇదంతా కూడా స్టాక్ మార్కెట్ నుంచి పొందుతున్నదేనని, దీనికి ఎల్‌టీసీజీ కింద మినహాయింపు వస్తున్నదన్నారు. కొనుగోలు చేసిన షేర్లను ఏడాదిలోపే తిరిగి అమ్మేస్తే వచ్చే లాభాలపై ప్రస్తుతం 15 శాతం ఎల్‌టీసీజీ పన్ను పడుతున్నది. ఏడాది తర్వాత అమ్మితే మాత్రం పన్ను లేదు. కానీ తాజా నిర్ణయంతో ఎప్పుడు అమ్మినా.. లాభం రూ.లక్ష దాటితే పన్నుంటుంది.






వలస బాటలో మిలియనీర్లు

- స్వదేశానికి దూరమైపోతున్న సంపన్నులు
- గతేడాది పరాయి దేశాలకు పోయిన 7,000 మంది
- అమెరికానే అత్యధికుల గమ్యస్థానం
- ఆ తర్వాత యూఏఈ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:

దేశీయ మిలియనీర్లు.. విదేశీ బాట పడుతున్నారు. వ్యాపారం కోసం మాత్రం కాదు. కుటుంబసమేతంగా పర్యాటక యాత్ర అంతకన్నా కాదు. మరెందుకు అనుకుంటున్నారా?.. అక్కడే స్థిరనివాసం ఏర్పరుచుకోవడానికి. అవును.. పరాయి దేశానికి భారతీయ సంపన్నులు వలసపోతున్నారు. ఆందోళనకర విషయమేమిటంటే.. ఇలా వెళ్లిపోతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతుండటం. గతేడాది 7,000 మంది భారతీయ ధనవంతులు విదేశాలకు వెళ్లిపోగా, అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 6,000గా ఉన్నది. 2015లో 4,000 మందిగా ఉంటే, రెండేండ్లలో 3,000 మంది పెరుగడం గమనార్హం. నిరుడు విదేశాలకు వలసపోయిన సంపన్నుల జాబితాలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. 10,000 మందితో చైనా మొదటి స్థానంలో ఉన్నట్లు న్యూ వరల్డ్ వెల్త్ తాజా నివేదిక స్పష్టం చేసింది. ఈ జాబితాలో టర్కీ (6,000) మూడో స్థానంలో ఉండగా, ఆ తర్వాత బ్రిటన్ (4,000), ఫ్రాన్స్ (4,000), రష్యా (3,000) దేశాలు ఉన్నాయి. ఇకపోతే భారతీయ మిలియనీర్లు అత్యధికంగా వలస వెళ్తున్న దేశం అగ్రరాజ్యం అమెరికానే. ఆ తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో స్థిరపడుతున్నారు. చైనా కుబేరులు సైతం అమెరికానే ఎంచుకుంటుండగా, కెనడా, ఆస్ట్రేలియా దేశాలకు ఆ తర్వాతి ప్రాధాన్యం ఇస్తున్నారు. అయినప్పటికీ భయపడనక్కర్లేదంటున్నది న్యూ వరల్డ్ వెల్త్. భారత్, చైనాల నుంచి వెళ్లిపోతున్న మిలియనీర్ల కంటే కొత్తగా ఈ దేశాల్లో పుట్టుకొస్తున్న మిలియనీర్ల సంఖ్యే ఎక్కువగా ఉంటున్నదని, కాబట్టి ఇప్పటికిప్పుడు ఈ రెండు దేశాలకు మిలియనీర్ల వలసలతో వచ్చిన ముప్పేమీ లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నది. అంతేగాక స్వదేశాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడితే దూరమైన సంపన్నులు తిరిగి వస్తారన్న విశ్వాసాన్నీ వెలిబుచ్చింది. ఇదిలావుంటే వివిధ దేశాల నుంచి ఆస్ట్రేలియాకు అత్యధికంగా మిలియనీర్లు వలస పోతున్నారు. గతేడాది 10,000 మంది సంపన్నులు ఆయా దేశాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడినట్లు తేలింది. అంతకుముందు అమెరికాకే ఎక్కువగా వలసలుండేవి. అయితే 2015 నుంచి ఈ పరిస్థితి మారింది. కాగా, గడిచిన పదేండ్లకుపైగా కాలంలో ఆస్ట్రేలియాలోని మొత్తం సంపద 83 శాతం ఎగబాకింది. ఇదే సమయంలో అమెరికా సంపద 20 శాతమే పెరిగినట్లు కనిపిస్తున్నది. ఫలితంగా సగటు అమెరికా పౌరుడి కంటే.. ఇప్పుడు ఆస్ట్రేలియా పౌరుడే సంపన్నుడు. పదేండ్లకు ముందు ఇలా ఉండేది కాదంటున్నది న్యూ వరల్డ్ వెల్త్. ఇక 2017లో అమెరికాకు 9,000 మంది మిలియనీర్లు విదేశాల నుంచి రాగా, ఆ తర్వాత ఎక్కువగా కెనడా (5,000), యూఏఈ (5,000) దేశాలకు వెళ్లినట్లు రుజువైంది. కాగా, ప్రపంచవ్యాప్తంగా స్వదేశాలను వీడి విదేశాలకు వలసపోయిన మిలియనీర్ల సంఖ్య గతేడాది దాదాపు 95,000గా నమోదైంది. 2016లో 82,000గా, 2015లో 64,000గా ఉందని ఈ నివేదికలో న్యూ వరల్డ్ వెల్త్ తెలియజేసింది.



'న్యూ వరల్డ్ వెల్త్' నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

- సంపన్న దేశాల్లో రూ.**5,34,95,000** కోట్లతో భారత్‌కు **6**వ స్థానం
- భారత్‌లో రూ.**6.5** కోట్లు అంతకంటే ఎక్కువ నికర ఆస్తులున్న మిలియనీర్లు **3,30,400** మంది
- ఈ విషయంలో భారత్‌కు ప్రపంచ దేశాల్లో **9**వ స్థానం
- భారత్‌లో రూ.**13** కోట్లు అంతకంటే ఎక్కువ సంపద కలిగిన మల్టీ మిలియనీర్లు **20,730** మంది
- ఇందులో భారత్ ప్రపంచంలోనే **7**వ అతిపెద్ద దేశం
- రూ.**6,500** కోట్లు అంతకంటే ఎక్కువ కలిగిన బిలియనీర్లు భారత్‌లో **119** మంది
- అమెరికా, చైనా తర్వాత **అత్యధిక బిలియనీర్లు**న్నది భారత్‌లోనే

అన్నదాతల కోసం మార్కెట్ హామీ పథకం

- రూ.500 కోట్ల కార్పస్ ఫండ్‌తో ప్రారంభించనున్న కేంద్రం
- మద్దతు ధరలు పడిపోయినప్పుడు రైతును ఆదుకోవడమే ధ్యేయం
- అజమాయిషీ, అమలు బాధ్యతలు రాష్ర్టాలకే
- ప్రతిపాదన పత్రాన్ని ఖరారు చేసిన వ్యవసాయ శాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దేశంలోని రైతులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల కార్పస్ ఫండ్‌తో మార్కెట్ హామీ పథకాన్ని (ఎంఏఎస్) ప్రారంభించాలని యోచిస్తున్నది. వ్యవసాయ దిగుబడుల ధరలు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే తక్కువ స్థాయికి పడిపోయినప్పుడు రాష్ర్టాలు కనీస మద్దతు ధరతో దిగుబడులను కొనుగోలు చేసేందుకు ఈ పథకం వీలు కల్పిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. వ్యవసాయ దిగుబడుల కొనుగోలు వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మార్కెటింగ్ వ్యవస్థలో లోపాల వలన రైతులు నష్టాపోకుండా చూసేందుకు ఈ పథకం దోహదం చేస్తుంది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరిపి ఈ పథకానికి సంబంధించిన ప్రతిపాదన పత్రాన్ని ఖరారు చేసిందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన ప్రకారం మార్కెట్ హామీ పథకంపై రాష్ర్టాలే అజమాయిషీని కలిగి ఉంటాయని, మార్కెట్లో పంట దిగుబడుల ధరలు ఎంఎస్‌పీ కంటే తక్కువ స్థాయికి పడిపోయినప్పుడు వరి, గోధుమ మినహా ఇతర వ్యవసాయ దిగుబడులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించే అధికారాన్ని, ఆ నిర్ణయాన్ని అమలుచేసే బాధ్యతను కూడా రాష్ర్టాలకే అప్పగించడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ర్టాలతో పాటు ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీల వద్ద ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్ హామీ పథకం కోసం తొలుత రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్ర స్థాయిలో రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ కోసం రాష్ర్టాలకు వడ్డీ లేకుండా అడ్వాన్సులను అందజేసేందుకు ఈ కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తున్నది.

అదానీకి ఆస్ట్రేలియా షాక్

■ రైల్వే లైన్ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయబోమని ప్రకటన



మెల్‌బోర్న్, ఫిబ్రవరి 4: ఆస్ట్రేలియాలో అదానీ గ్రూప్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బొగ్గు గని అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. కార్‌మైఖేల్ బొగ్గు గనిని పోర్టుకు అనుసంధానిస్తూ నిర్మించే కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు ఎటువంటి ఆర్థిక సాయం చేయబోమని ఆదివారం అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. 16.5 బిలియన్ డాలర్ల విలువైన ఈ ప్రాజెక్టు కోసం నిర్మించే రైల్వే లైన్‌కు 900 మిలియన్ డాలర్ల రాయితీ రుణాన్ని అదానీ కోరుతున్నారు. అయితే ప్రైవేట్ రంగంలోని ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వపరంగా ఆర్థిక చేయూత ఇవ్వలేమని ఆసీస్ మంత్రి కరెన్ ఆండ్రూస్ చెప్పారు. దీంతో గని వ్యవహారం మళ్లీ మొదటికొచ్చినట్లైంది. ఇప్పటికే గనిలో తవ్వకాలకు సంబంధించిన అనుమతుల కోసం అదానీ గ్రూప్ నానా అగచాట్లు పడి సాధించుకున్న విషయం తెలిసిందే.

కొద్ది రోజుల్లో టెలికం విధాన ముసాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో జాతీయ టెలికం విధాన-2018 ముసాయిదా (ఎన్‌టీపీ-2018)ను విడుదల చేసి దానిపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోనున్నది. టెలికం విభాగం (డాట్) వచ్చే వారం రోజుల్లోగా ఎన్‌టీపీ-2018 ముసాయిదాను విడుదల చేసే అవకాశం ఉన్నదని ఈ ముసాయిదా రూపకల్పనతో సంబంధమున్న అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. దేశీయ టెలికం రంగం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలిసిందే. ఆపరేటర్ల మధ్య ధరల యుద్ధం, రుణ భారం పెరగడం, స్పెక్ట్రమ్ ధరలు సహేతుకంగా లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. ఈ ఇబ్బందుల నుంచి బయటపడి టెలికం రంగం మళ్లీ వృద్ధిబాట పట్టేందుకు రానున్న ఐదేండ్ల కాలంలో అమలు చేయాల్సిన ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీపీ-2018లో ప్రకటించే అవకాశం ఉన్నదని ఆ అధికారి తెలిపారు.

అసోంలో లక్ష కోట్ల పెట్టుబడులు

■ జీఐఎస్‌లో 200లకుపైగా ఎంవోయూలు

గౌహతి, ఫిబ్రవరి 4: తమ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు (జీఐఎస్) ద్వారా అసోం రూ.లక్ష కోట్ల పెట్టుబడులను సాధించుకున్నది. రెండు రోజుల ఈ సదస్సు ఆదివారంతో ముగియగా, ఇందులో మొత్తం 200లకుపైగా వ్యాపార ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా వచ్చే పెట్టుబడుల విలువ రూ.లక్ష కోట్లు దాటినట్లు అక్కడి ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పారు. శనివారం 176 ఎంవోయూలు జరుగగా, రూ.65,186 కోట్ల పెట్టుబడులతో ఆయా కంపెనీలు ముందుకు వచ్చాయని, ఆదివారం మరో 25 ఎంవోయూల ద్వారా రూ.35,000 కోట్ల పెట్టుబడులను పెట్టేందుకు మరికొన్ని సంస్థలు అంగీకరించాయని వివరించారు.

రెండంకెల వృద్ధి ఎండమావే

- అది వాస్తవిక అంచనా కాదు
- ఇప్పట్లో 8 శాతం వృద్ధిరేటే గ'ఘనం'
- సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులున్న ప్రస్తుత తరుణంలో భారత ఆర్థిక వ్యవస్థ రెండంకెల వృద్ధిరేటును సాధించడం చాలా కష్టమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నదని, కనుక 2020-21 నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 8 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధిండం ఖాయమని ఆ అధికారి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఏడదవదిగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 8 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధించే దిశగా ముందుకు సాగుతున్నదని, దీంతో భారత్ అతిత్వరలోనే ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఐదవ స్థానానికి చేరుకోవడం ఖాయమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఈ నెల 1వ తేదీన తన బడ్జెట్ ప్రసంగంలో విశ్వాసాన్ని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 2014 మే నెలలో అధికార పగ్గాలను చేపట్టిన తర్వాత తొలి మూడేళ్ల పాటు సగటున 7.5 శాతం వృద్ధిరేటును నమోదు చేసిన దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సవత్సర ద్వితీయార్థం (అక్టోబర్-మార్చి)లో 7 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7 శాతం నుంచి 7.5 శాతం వృద్ధిరేటును సాధిస్తుందని అంచనా వేస్తున్నట్లు జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. దీనిని చూస్తుంటే రానున్న కొన్ని త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధిరేటు 8 శాతం కంటే ఎక్కువగా ఉండవచ్చని స్పష్టమవుతోందని, కనుక వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లోనే ఏదో ఒక త్రైమాసికంలో వృద్ధిరేటు 8 శాతం దాటవచ్చని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ పేర్కొంటూ.. 2020-21 ఆర్థిక సంవత్సరంలో భారత్ 8 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును సాధించగలుగుతుందని పీటీఐ వార్తా సంస్థతో అన్నారు. రెండంకెల వృద్ధిరేటును భారత్ ఎప్పటికి అందుకుంటుందని ప్రశ్నించగా, సమీప భవిష్యత్తులో అది సాధ్యపడకపోవచ్చని, అంతర్జాతీయంగా తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని ఆయన చెబుతూ.. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 3.5 శాతం నుంచి 4 శాతానికిలోపే ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. 'రెండంకెల (10 శాతం) వృద్ధిరేటును అందుకోవాలంటే ఎగుమతులను గణనీయంగా పెంచుకోగలగాలి. దిగుమతులకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఎంతమేర అనుకూలంగా ఉంటుందన్న దానిని బట్టే ఎగుమతుల వృద్ధి ఆధారపడి ఉంటుంది. కనుక సమీప భవిష్యత్తులో 10 శాతం వృద్ధిరేటును అందుకోగలుతామనుకోవడం అత్యాశే అవుతుంది.



అది వాస్తవిక అంచనా కాదు. ప్రస్తుత తరుణంలో మన ఆర్థిక వ్యవస్థ 8 శాతం కంటే ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేయగలిగితే అదే చాలా గొప్ప విషయమని నేను అభిప్రాయపడుతున్నా' అని సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2017-18) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5.7 శాతానికి పతనమై మూడేండ్ల కనిష్ఠ స్థాయికి దిగజారిన దేశ వృద్ధిరేటు రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో పుంజుకుని 6.3 శాతానికి చేరుకున్న విషయం విదితమే. ఈ ఆర్థిక సంవత్సంలో మొత్తం మీద దేశం 6.5 శాతం వృద్ధిరేటును నమోదు చేస్తుందని కేంద్ర గణాంకాల సంస్థ (సీఎస్ఓ) అంచనా వేయగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7 శాతం నుంచి 7.5 శాతం మేరకు పెరిగే అవకాశం ఉందని గత నెలలో జైట్లీ పార్లమెంట్‌కు నివేదించిన ఆర్థిక సర్వే అంచనా వేసింది.

లాభం రూ.1,30,000 కోట్లు

కేవలం మూడు నెలల్లో ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్ నమోదు చేసిన లాభం ఇది. గతేడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 20 బిలియన్ డాలర్ల (రూ.1,30,000 కోట్లు) లాభం వచ్చినట్లు యాపిల్ తెలిపింది. మార్కెట్‌లోకి కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ ఎక్స్ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఊహించిన దాని కంటే ఎక్కువగా నమోదైయ్యాయని చెప్పిందీ అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం. ఈ నేపథ్యంలోనే ఈ మూడు నెలల్లో ఆదాయం గతంతో పోల్చితే 13 శాతం పెరిగి 88.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. భారత్‌లోనూ రికార్డుస్థాయి ఆదాయం నమోదైంది.

నష్టం రూ.20,000 కోట్లు

గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ త్రైమాసిక నష్టం ఇది. నిరుడు అక్టోబర్-డిసెంబర్‌లో 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.20,000 కోట్లు) నష్టం వాటిల్లినట్లు అల్ఫాబెట్ ప్రకటించింది. నిజానికి గతంతో పోల్చితే ఆదాయం 24 శాతం పెరిగి 32.3 బిలియన్ డాలర్లుగా నమోదైనప్పటికీ, విదేశీ లాభాలపై స్వదేశం అమెరికాలో 11 బిలియన్ డాలర్ల పన్నుల భారం పడటంతో సంస్థ లాభం కాస్తా ఆవిరైపోయింది. కాగా, మొత్తం ఆదాయంలో గూగుల్‌దే 31.9 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. నిర్వహణ లాభం కూడా 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

క్రిప్టో కరెన్సీలపై ఉక్కుపాదం

- ఇప్పటికే నియంత్రణ చర్యలు ఖరారు
- ఈ ఏడాది చివరి నుంచి అమలు: గార్గ్

క్రిప్టో కరెన్సీల వినియోగంపై ఉక్కుపాదం మోపడం ఖాయమని గార్గ్ స్పష్టం చేశారు. ఇందుకోసం చేపట్టాల్సిన నియంత్రణ చర్యలను ఈ ఏడాది చివరిలోగా అమలు చేస్తామని సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. 'క్రిప్టో కరెన్సీలను నిషేధించేందుకు ఏర్పాటైన కమిటీ త్వరలో నియంత్రణ చర్యలను ఖరారు చేయనున్నది. వీటిని అమలు చేయడంలో ఎదురయ్యే న్యాయపరమైన ఇబ్బందులను పరిశీలించి ఈ ఏడాది చివరిలోగా వీటిని కచ్చితంగా అమలు చేస్తాం' అని ఆయన అన్నారు. క్రిప్టో కరెన్సీల వ్యాపారం చట్టబద్ధమైన వ్యవస్థలో ఉంటే వాటిపై నేరుగా విచారణ జరుపవచ్చని, కానీ ప్రస్తుతం బిట్‌కాయిన్ ఎక్స్ఛేంజ్‌లకు ఎటువంటి అనుమతులు గానీ, చట్టబద్ధత గానీ లేవని, ఆ ఎక్స్ఛేంజ్‌లు కనీసం రికార్డులను కూడా నిర్వహించడం లేదని ఆయన తెలిపారు. బిట్‌కాయిన్ సహా ఇతర క్రిప్టో కరెన్సీలకు ఎటువంటి చట్టబద్ధత లేదని, కనుక వీటిలో ఎవరూ పెట్టుబడులు పెట్టవదని పదే పదే హెచ్చరిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. ఇటువంటి కరెన్సీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదని, వాటి వినియోగాన్ని పూర్తిగా నియంత్రిస్తామని ఈ నెల 1వ తేదీన పార్లమెంట్‌లో చేసిన సార్వత్రిక బడ్జెట్ ప్రసంగంలో మరోమారు స్పష్టం చేసిన విషయం విదితమే. క్రిప్టో కరెన్సీలను నిషేధిస్తే ఎదురయ్యే పరిణామాలను, దాని ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుభాష్ చంద్ర గార్గ్ నేతృత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) చైర్మన్ అజయ్ త్యాగి, రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ బీపీ కనుంగ్ సభ్యులుగా ఉన్నారు.



సిగరెట్ల స్మగ్లింగ్‌తో రూ.13 వేల కోట్ల చిల్లు

■ నివారణ చర్యలు చేపట్టాలని ఫైఫా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సిగరెట్ల స్మగ్లింగ్ నానాటికీ పెరుగుతుండటంతో దేశం సుమారు రూ.13 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య (ఫైఫా) ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని సిగరెట్ల అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. దేశంలోని సిగరెట్ల తయారీ పరిశ్రమలో అక్రమ వ్యాపారం వాటా 25 శాతం కంటే ఎక్కువగా ఉన్నదని, దీంతో సిగరెట్ల అక్రమ రవాణా వేగవంతంగా పెరుగుతున్న మార్కెట్ల జాబితాలో మన దేశం నాలుగో స్థానంలో నిలిచిందని ఫైఫా ఒక ప్రకటనలో పేర్కొంటూ.. దేశంలోని పొగాకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరింది. అంతర్జాతీయ సరిహద్దులు దాటి దేశంలోకి అక్రమంగా రవాణా అవుతున్న సిగరెట్లను స్వాధీనం చేసుకునేందుకు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు గత కొన్నేళ్ల నుంచి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ దాడుల్లో పట్టుబడిన విదేశీ సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల పరిమాణం, వాటి మొత్తం విలువ ఎంతన్న సమాచారం తమవద్ద లేదని డీఆర్ఐ అధికారులు చెబుతున్నారు. గత రెండేళ్లలో స్వాధీనం చేసుకున్న స్మగుల్డ్ సిగరెట్ల మొత్తం విలువ ఎంతో తెలియజేయాలని కోరుతూ పంపిన మెయిళ్లకు డీఆర్ఐ అధికారుల నుంచి ఇప్పటివరకూ సమాధానం రాలేదు. పొగాకు ఉత్పత్తులపై పన్నులను విపరీతంగా పెంచడం వల్లనే దేశంలోకి సిగరెట్ల అక్రమ రవాణా పెరుగుతున్నదని ఫైఫా పేర్కొన్నది. స్మగుల్డ్ సిగరెట్ల స్వాధీనాలు నానాటికీ పెరుగుతుండటమే సిగరెట్ల అక్రమ రవాణా పెరుగుదలకు నిదర్శనమని, 2014-15 ఆర్థిక సంవత్సరంలో 1,312గా ఉన్న ఈ స్వాధీనాల సంఖ్య 2016-17 ఆర్థిక సంవత్సరంలో 3,108కి పెరిగినట్లు స్వయంగా ఆర్థిక శాఖే పార్లమెంట్‌లో వెల్లడించిందని ఫైఫా పేర్కొన్నది.

ఆర్బీఐ ద్రవ్యసమీక్ష కీలకం



త్రైమాసిక ఆర్థిక ఫలితాలూ ముఖ్యమే ▪ ఎల్‌టీసీజీ పన్ను ప్రభావమూ కనిపించే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్యసమీక్ష, త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా నడుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత వారం దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను ప్రభావంతో సూచీలు భీకర నష్టాలపాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ వారం మదుపరుల దృష్టి ఆర్బీఐ పాలసీ, ప్రముఖ సంస్థల లాభనష్టాలపై ఉండొచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 7న ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష జరుగనుండటంతో ఈసారైన కీలక వడ్డీరేట్లు తగ్గుతాయా? అన్నదానిపై మదుపరులలో ఉత్కంఠ నెలకొన్నది. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా గత ద్రవ్యసమీక్షల్లో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ వెళ్లని విషయం తెలిసిందే. ఇకపోతే ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను వివిధ ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. ఇందులో టాటా మోటార్స్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిప్లా, హీరో మోటోకార్ప్, లుపిన్, ఆంధ్రా బ్యాంక్, బీహెచ్ఈఎల్, సెయిల్ తదితర అగ్రశ్రేణి సంస్థలున్నాయి. కాగా, బడ్జెట్‌లో ప్రకటించిన ఎల్‌టీసీజీ పన్ను కారణంగా గత వారం సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు పడిపోగా, శుక్రవారం ఒక్కరోజే 840 పాయింట్లు నష్టపోయింది. ఈ క్రమంలోనే కిందటి వారం మొత్తంగా సెన్సెక్స్ 983.69 పాయింట్లు పతనమవగా, నిఫ్టీ 309.05 పాయింట్లు క్షీణించింది. అంతకుముందు వారం రికార్డుస్థాయి లాభాలను అందుకున్న సంగతి విదితమే. స్టాక్ మార్కెట్‌లోని పెట్టుబడులపై లాభాలు రూ.లక్ష దాటితే అందులో 10 శాతం ఎల్‌టీసీజీ పన్నుగా చెల్లించాలని జైట్లీ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈక్విటీ నేపథ్యం కలిగిన మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చిన ఆదాయంపైనా 10 శాతం పన్ను చెల్లించాల్సి వస్తున్నది. దీంతోనే మదుపరులు అమ్మకాల ఒత్తిడిలోకి జారుకున్నారు. జీడీపీలో ద్రవ్యలోటు అదుపు లక్ష్యం పెరుగడం కూడా లాభాల స్వీకరణకు దోహదం చేసింది. ఈ ప్రభావం ఈ వారం కూడా కనిపించే అవకాశాలు లేకపోలేదన్న అంచనాలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు స్టాక్ మార్కెట్ల పోకడను ప్రభావితం చేయనున్నాయి.

రూ.లక్ష కోట్లు చేజార్చుకున్న ఏడు సంస్థలు

ఎల్‌టీసీజీ పన్ను నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు పీకల్లోతు నష్టాల్లోకి జారుకోవడంతో గత వారం టాప్-10 సంస్థల్లో ఏడింటి మార్కెట్ విలువ సుమారు రూ.లక్ష కోట్లు హరించుకుపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, మారుతి సుజుకీ, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్ సంస్థల మార్కెట్ విలువ రూ.98,530.44 కోట్లు పడిపోయింది. ఆర్ఐఎల్ విలువ అత్యధికంగా రూ.37,256.05 కోట్లు దిగజారగా, ఓఎన్‌జీసీ రూ.20,276.51 కోట్ల విలువను కోల్పోయింది. ఇక టీసీఎస్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ విలువలు సుమారు రూ.6,500 కోట్ల మేర పెరిగింది. ఇందులో టీసీఎస్ మార్కెట్ విలువే రూ.5,991.72 కోట్లు ఎగబాకింది.

జనవరిలో రూ.22,000 కోట్ల రాక

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) గత నెలలో దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి 3.5 బిలియన్ డాలర్ల (రూ.22,000 కోట్లకుపైగా) పెట్టుబడులు పట్టుకొచ్చారు. స్టాక్ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువ రూ.13,781 కోట్లుగా ఉంటే, రుణ మార్కెట్లలోకి వచ్చిన పెట్టుబడుల విలువ రూ.8,473 కోట్లుగా ఉన్నాయి. దీంతో అటు స్టాక్ మార్కెట్లు, ఇటు రుణ మార్కెట్లలోకి జనవరిలో వచ్చిన మొత్తం విదేశీ పెట్టుబడుల విలువ రూ.22,254 కోట్లుగా నమోదైంది. డిసెంబర్‌లో రూ.3,500 కోట్లకుపైగా పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఇక 2017 మొత్తంగా స్టాక్ మార్కెట్లు, రుణ మార్కెట్లలోకి రూ.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను ఎఫ్‌పీఐలు తీసుకొచ్చారు.

ఇకపై జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో బస్‌పాస్‌లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్టులు టీఎస్‌ఆర్టీసీ బస్‌పాస్‌ల కోసం ఇకనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నదని సర్క్యులర్‌లో టీఎస్‌ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు పేర్కొన్నారు. బస్‌పాస్‌ల కోసం జర్నలిస్టులు ఆర్టీసీ ప్రధాన కార్యాలయం, ఆర్‌ఎం కార్యాలయాలకు వెళ్లకుండా సమీపంలోని బస్‌పాస్ కౌంటర్ నుంచి పొందేలా వెసులుబాటును టీఎస్‌ఆర్టీసీ కల్పించనున్నది. ఈ విధానాన్ని జర్నలిస్టులకు వర్తింపజేయాలని ఆర్టీసీ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం జర్నలిస్టుల బస్‌పాస్‌ల గడువు మార్చి 31తో ముగియనున్నది. దీంతో ఏప్రిల్ 1 నుంచి ఈ విధానాన్ని ఆర్టీసీ అమలు చేయనున్నది. ఆన్‌లైన్‌లో బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు ఫోన్‌లో టీఎస్‌ఆర్టీసీ నుంచి మెసేజ్ వస్తుంది. ఆ తర్వాత జర్నలిస్టులు తమ సమీపంలోని బస్‌పాస్ కౌంటర్‌కు వెళ్లి మెసేజ్‌ను చూపిస్తే అక్కడ బస్‌పాస్ జారీ చేస్తారని టీఎస్‌ఆర్టీసీ పేర్కొన్నది.

అగ్గిపెట్టె తిరిగివ్వాలని ఉత్తరం

- **జూనియర్‌కు అసిస్టెంట్ ఇంజినీర్ లేఖ**
- **యూపీలో ఘటన.. సోషల్ మీడియాలో వైరల్**



బరేలి, ఫిబ్రవరి 4: అగ్గిపుల్ల, సబ్బుబిల్ల, కుక్కపిల్ల కాదేదీ కవితకు అనర్హం అన్నారు శ్రీశ్రీ.. కవితకేమో తెలియదు గానీ అగ్గిపెట్టె తిరిగివ్వాలని రాసిన ఓ అధికారిక లేఖ మాత్రం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తీసుకున్న అగ్గిపెట్టె తిరిగి ఇవ్వాలని ఓ అధికారి రాసిన ఉత్తరం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగింది. 'జనవరి 23న అప్పుగా తీసుకున్న అగ్గిపెట్టెను తిరిగివ్వలేదు' అంటూ మొరాదాబాద్‌లోని ఎలక్ట్రిసిటీ అర్బన్ టెస్ట్ డివిజన్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ (మీటర్) సుశీల్‌కుమార్ ఈ నెల 1వ తేదీన తమ జూనియర్ మోహిత్ పంత్‌కు అధికారికంగా లేఖ రాశారు. 'దోమల బత్తులను వెలిగించుకొనేందుకు ఉపయోగించే అగ్గిపెట్టెను జనవరి 23న రాత్రి 8.40 గంటలకు అప్పుగా తీసుకొని, తిరిగివ్వలేదు. అందులో 19 అగ్గిపుల్లలు ఉన్నాయి. అగ్గిపెట్టె లేనికారణంగా సాయంత్రం సమయాల్లో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు' అని సుశీల్ లేఖలో పేర్కొన్నారు. ఇది అందుకున్న మూడు రోజుల్లో అగ్గిపెట్టె తిరిగిస్తారని భావిస్తున్నానని చెప్పారు. 'ఈ వివాదం ఎలాంటి ఘర్షణకు దారితీయదు. సహోద్యోగులతో పరస్పర నమ్మకం కలిగి ఉండాలి. దీనిపై విరుద్ధంగా స్పందిస్తే.. భవిష్యత్‌లో అధికారికంగా చర్యలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని లేఖలో వివరించారు. ఇది నమూనా ఉత్తరం అని, దీన్ని ఇంకా పంపలేదని, అయితే ఆఫీస్‌లో ఎవరో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారని కుమార్ చెప్పారు. శుక్రవారం స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న పంత్.. సుశీల్‌తో మాట్లాడటంతో సమస్య పరిష్కారమైంది.

వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌కు..విశిష్ట అతిథిగా 'రోబో సోఫియా'



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న ఐటీ ఒలింపిక్స్‌గా పేరొందిన వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యూసీఐటీ) సదస్సుకు విశిష్ట అతిథిగా హ్యూమనాయిడ్ రోబో సోఫియా హాజరుకానున్నది. మూడురోజుల సదస్సుకు రోబోసోఫియా హాజరవుతున్నట్టు వరల్డ్ ఐటీ కాంగ్రెస్ హైదరాబాద్ బ్రాండ్ అంబాసిడర్, పెగా సిస్టమ్స్ ఎండీ సుమన్‌రెడ్డి తెలిపారు. బ్రిటన్‌కు చెందిన ఆండ్రూ హెప్‌బర్న్ డిజైన్ చేసిన ఈ హ్యూమనాయిడ్ రోబో హాంగ్‌కాంగ్‌లో రూపుదిద్దుకున్నది. డబ్ల్యూసీఐటీతోపాటు నాస్కాం ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్ జరుగనున్నట్టు సుమన్‌రెడ్డి ఒక ప్రకటనలో చెప్పారు. 'ఆంప్లిఫై డిజిటల్-డిస్‌రప్ట్ ద కోర్' అనే థీమ్‌తో ఈ సదస్సు జరుగనున్నది. దేశంలోనే తొలిసారిగా నిర్వహిస్తున్న డబ్ల్యూసీఐటీకి హైదరాబాద్ వేదిక అవుతుండటం గమనార్హం. డబ్ల్యూసీఐటీ అలయెన్స్ భారత్‌లోని ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల వేదిక అయిన నాస్కాం సమన్వయంతో నిర్వహించనున్న ఈ సమావేశానికి శ్రీలంక, అర్మేనియా ప్రధానమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నది. దాదాపు 80 ప్రధాన దేశాలకు చెందిన 2,500 మందికిపైగా విజనరీలు, దిగ్గజ సంస్థల పరిశ్రమల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు హాజరుకానున్నారు. డబ్ల్యూసీఐటీ సదస్సు 2016లో బ్రెజిల్‌లో, 2017లో తైవాన్‌లో జరిగింది.



ఆదివారం గోదావరిఖనిలో జిల్లా రచయితల సమాఖ్య సదస్సులో మాట్లాడుతున్న తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్ తిరుమల్‌రావు

తెలంగాణ భాషా, సాహిత్యాన్ని కాపాడాలి

తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్ తిరుమల్‌రావు

రాంమందిర్ ఏరియా: తెలంగాణ భాషా, సాహిత్యాన్ని, జానపదాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జయధీర్ తిరుమల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని స్నేహ సాహితీ గ్రంథాలయంలో జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో 'తెలంగాణ భాషా, సంస్కృతి'పై సదస్సును నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ సర్కారు 'ప్రపంచ తెలుగు మహాసభలు' నిర్వహించి తెలుగు భాషా గొప్పతనాన్ని చాటిందన్నారు. ఈ సందర్భంగా రచయిత అందెశ్రీ తెలంగాణ భాషా సాహిత్యం గొప్పతనాన్ని వివరించారు. రచయిత బొల్లంపల్లి రమాదేవి రాసిన 'హృదయ స్పందన' కవిత్వాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఎర్రజెండా పాట రచయిత అల్లం వీరయ్య, తెలంగాణ జల సాధన సమితి నాయకులు గోవర్ధన్, సామాజిక విశ్లేషకులు సారయ్య, కేయూ రిజిస్ట్రార్ వినాయక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్లే సాగులో దుష్పరిణామాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రకృతిని నిర్లక్ష్యం చేయడంవల్లే సాగులో దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆధ్యాత్మికవేత్త మాత రఘునానందమయి అభిప్రాయపడ్డారు. సేవ్, భారత్ బీజ్ సమాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రామకృష్ణమఠంలో నిర్వహించిన దేశీవిత్తనోత్సవంలో ఆమె పాల్గొన్నారు. భారతీయ సంస్కృతిని క్రమంగా పోగొట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు.

సంక్షేమ రాజ్యం.. ఇది సంపద రాష్ట్రం

- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమానికి భారీగా నిధులు
- దేశంలో ఎక్కువ నిధులిస్తున్న మొదటి రాష్ట్రంగా రికార్డు
- రాబడి ఎక్కువ ... అప్పులు తక్కువ
- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్న రాష్ట్రం
- పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సర్వేలో వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో సంక్షేమరంగానికి అధిక ప్రాధాన్యతలిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి ఎక్కువ నిధులను కేటాయిస్తున్నది. ఈ ఏడాది కేటాయింపులు పదిశాతం దాటవచ్చు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ ఎక్కు వ నిధులను వెచ్చిస్తున్నది. మరోవైపు దేశంలో సంపన్న రాష్ట్రాలలో ఒకటిగా ఆర్థికంగా బలపడుతున్నది. రెవెన్యూ మిగులును సాధిస్తూ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నది. తన జీఎస్డీపీ సంపదకు లోబడి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి కంటే తక్కువ అప్పులు తీసుకుని ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్న అతి కొద్ది రాష్ట్రాలలో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రాల బడ్జెట్ తీరుతెన్నులపై ఢిల్లీలోని పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ జరిపిన సర్వేలో ఈ విషయం వెల్లడయింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కేంద్రంగా ఈ పరిశోధన జరిగింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, జమ్ముకశ్మీర్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఇలా మొత్తం 19 రాష్ట్రాల 2017-18 వార్షిక బడ్జెట్ నివేదికల ఆధారంగా ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను విశ్లేషించింది. లోటు బడ్జెట్, మిగులు బడ్జెట్, అప్పులు, రాబడి, వ్యయం, బడ్జెట్‌లో ఏయే రంగాలకు ప్రాధాన్యమిస్తున్నారనే అంశాలపై విశ్లేషణ జరిపింది.

రెవెన్యూ మిగులు సాధించిన రాష్ట్రాల జాబితా

రాష్ట్రం	మిగులు శాతం
తెలంగాణ	0.2
కర్ణాటక	0.1
బీహార్	1.9
ఛత్తీస్‌గఢ్	0.8
గుజరాత్	0.5
జమ్ముకశ్మీర్	1.9
మధ్యప్రదేశ్	0.9
ఒడిశా	2.0
ఉత్తరప్రదేశ్	1.4

ఆయా రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వెచ్చించిన నిధుల శాతం

రాష్ట్రం	2014-15	2017-18
తెలంగాణ	5.6	9.7
ఆంధ్రప్రదేశ్	5.0	7.9
అసోం	1.3	1.8
బీహార్	2.5	1.9
ఛత్తీస్‌గఢ్	0.9	1.0
ఢిల్లీ	0.9	1.0
గుజరాత్	2.5	2.6
హర్యానా	0.5	0.8
జమ్ముకశ్మీర్	0.2	0.2
కర్ణాటక	5.1	6.8
కేరళ	2.4	2.8
మధ్యప్రదేశ్	2.4	3.0
మహారాష్ట్ర	4.5	5.1
ఒడిశా	3.0	2.8
పంజాబ్	1.9	1.6
రాజస్థాన్	1.0	1.0
తమిళనాడు	1.8	2.2
ఉత్తరప్రదేశ్	0.8	1.4
పశ్చిమ బెంగాల్	1.0	1.6

రెవెన్యూ మిగులు రాష్ట్రం

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం రెవెన్యూ మిగులును సాధించిన కొద్ది రాష్ట్రాలలో ఒకటిగా రికార్డులకెక్కింది. దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కువ మిగులు ఉన్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాదిలో ఒక్క కర్ణాటక మాత్రమే మిగులు రాష్ట్రంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం మొత్తం బడ్జెట్‌లో 0.2శాతం మిగులు సాధించగా, కర్ణాటక 0.1శాతం మిగులుతో రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు లోటు బడ్జెట్‌లో ఉన్నాయి.

వాస్తవానికి రాష్ట్రానికి వచ్చే రెవెన్యూ రాబడుల కంటే వ్యయం తక్కువగా ఉంటే మిగులు బడ్జెట్‌గా వ్యవహరిస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రెవెన్యూ రాబడులు దాదాపు 21 శాతం వరకు పెరిగి ఆర్థికవ్యవస్థ బలోపేతమయింది. 2017-18 వార్షిక బడ్జెట్‌లో మొత్తం రెవెన్యూ మిగులు సుమారు 4.571.31 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. మార్చి వరకు రాష్ట్రానికి రెవెన్యూ రాబడులు రూ. 1,13,083.04 గా అంచనా వేయగా, రెవెన్యూ వ్యయం రూ. 1,08,511.73 గా అంచనా వేశారు.

పేద, బడుగుల సంక్షేమానికి పెద్దపీట

తెలంగాణ రాష్ట్రం పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌లో ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ నిధులను కేటాయిస్తున్నదని సర్వే నివేదిక వెల్లడించింది. తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు రెండు, మూడు స్థానాలలో నిలిచాయి. 2017-18 బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమానికి వెచ్చించే నిధుల శాతం 10 శాతం వరకు ఉంటుందని సర్వేలో అంచనా వేశారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ తప్ప మిగతా ఏ రాష్ట్రాలు కూడా తెలంగాణకు దరిదాపుల్లో లేవు.

అప్పులు తక్కువ సంపద ఎక్కువ

ఆర్థిక క్రమశిక్షణలో తెలంగాణ టాప్

ఆర్థిక ప్రగతిలో స్థిరమైన వృద్ధిని సాధిస్తున్న తెలంగాణ రాష్ట్రం పరిమితికి లోబడి అప్పులు తీసుకుంటూ ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నట్లు సర్వే నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం జీఎస్డీపీలో ఆయా రాష్ట్రాలు తీసుకున్న అప్పులు 24 శాతం వరకు పేరుకుపోగా, తెలంగాణ కేవలం 17 శాతం లోపే రుణాలను తీసుకున్నట్లు పేర్కొన్నది. మిగతా రాష్ట్రాలు తీసుకున్న రుణాలు 17 శాతానికి మించి 36 శాతం వరకు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా జమ్ముకశ్మీర్ ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని దాటి తన జీఎస్డీపీలో ఇప్పటివరకు 49 శాతం అప్పులు తీసుకోవడం విశేషం. దేశంలో పెరిగిపోతున్న బడ్జెట్ లోటును, ఆర్థిక క్రమశిక్షణారాహిత్యాన్ని అదుపులో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం యాక్ట్‌ను తెరపైకి తెచ్చింది. దీని ప్రకారం లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రాలకు రిజర్వ్ బ్యాంకు రుణాలపై ఆంక్షలు విధించింది. కానీ ప్రస్తుతం దేశ సగటు కంటే రాష్ట్ర జీఎస్డీపీ ఎక్కువగా 11శాతం వరకు ఉండటంతోపాటు మిగులు బడ్జెట్ రుణ పరిమితిని 3 నుంచి 3.5 శాతానికి కేంద్రం పెంచింది. రాష్ట్రానికి ఉన్న ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని 3 నుంచి 3.5 శాతానికి కేంద్రం పెంచిన విషయం తెలిసిందే. రాష్ట్రం సాధిస్తున్న స్థిరమైన ఆర్థికవృద్ధిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో 25,019 కోట్ల వరకు బ్యాంకుల నుంచి నామమాత్రపు వడ్డీకి రుణం తీసుకునే వెసులుబాటు కలుగనుంది.

ఎంబీసీల ఆర్థిక ప్రగతికి ప్రణాళికలు

- కులవృత్తులకు సర్కారు ప్రాధాన్యం
- కులాలవారీగా ఆర్థికసహాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వెనుకబడిన కులాల ఆర్థికప్రగతికి బీసీ సంక్షేమ శాఖ, ఎంబీసీ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాల్లో ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ప్రభుత్వం కులవృత్తులకు ప్రాధాన్యం కల్పిస్తున్నది. ఇందుకోసం తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటుచేసి రూ.వెయ్యికోట్ల నిధులు కేటాయించిన విషయం విదితమే. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కులవృత్తులతోనే ఆధారపడి ఉందని భావించి ప్రభుత్వం కులవృత్తుల ప్రగతికి ప్రాధాన్యమిస్తున్నది. పాత పద్ధతులను ఆచరించడం మాని, ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తినైపుణ్యాన్ని పెంచుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంబీసీ కులసంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి.. కులవృత్తులను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సహకారం, పథకాల నిర్వహణకు ప్రతిపాదనలు సేకరించారు. ఎంబీసీ కులాలకు సంబంధించిన అవసరాలు, ఆర్థికసహాయం కోసం అమలుచేయాల్సిన పథకాలపై ఎంబీసీ కార్పొరేషన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా కులసంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. రజక, నాయీబ్రాహ్మణ, భట్రాజు, పూసల, కృష్ణ బలిజ, సగర ఉప్పర, గంగిరెద్దుల, కుమ్మరి (శాలివాహన), విశ్వబ్రాహ్మణ, గంగపుత్రులు, వాల్మీకి బోయ, మేరు, నకాశ, వంశరాజ్, కర్ని, దాసరి, దొమ్మర, జంగం, బైల్ కమ్మర (గిసాడి), మేదరి, వీరభద్రీయ (వీరముష్టి), మందుల, ఆరెకటిక, పార్థి, గోత్రాల, చాత్తాద శ్రీవైష్ణవ, జాంగ్ర, ఫకీర్, రాజన్నల, మంగళవాద్యాల, బుడబుక్కల, పెద్దమ్మ (దేవర), మొండి బండ కులం, ఇతర కులసంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ప్రభుత్వం అందిస్తున్న చేయూత ఇలా..

రాష్ట్రంలోని వెనుకబడిన కులాల ఆర్థికప్రగతికోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.వెయ్యికోట్లు, రజక, నాయీబ్రాహ్మణుల కోసం రూ.500కోట్లు కేటాయించింది. వ్యక్తిగత, బృందాలకు ఉపాధి రుణాలు అందించేందుకు ఎంబీసీ కార్పొరేషన్ ప్రతిపాదనలను సిద్ధంచేసింది. కొన్ని కులాల వారికి 80శాతం సబ్సిడీ, దుర్భర జీవనం సాగిస్తున్న కుటుంబాలకు వారి వంద శాతం సబ్సిడీతో ఉపాధి రుణాలు అందించాలని అధికారులు భావిస్తున్నారు.

క్షౌర వృత్తిదారులకు అధునాతన సెలూన్లు

రాష్ట్రంలో కులవృత్తుల వారికి ఉపాధి కల్పించి వారి ఆదాయాన్ని పెంచేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ప్రభుత్వం తాజాగా నాయీబ్రాహ్మణులు, రజకులకు ప్రత్యేక పథకాలను అమలుచేయనుంది. ఇందుకోసం నాయీబ్రాహ్మణులకు అధునాతన సెలూన్ల ఏర్పాటుకు ఆర్థికసహాయం అందిస్తున్నారు. లబ్ధిదారుడు చూపించిన స్థలం (దుకాణం)లోనే గ్లాస్ ఫిటింగ్, లోపల అధునాతన కుర్చీ, క్షవరం చేసేందుకు అధునాతన యంత్రపరికరాలను సమకూరుస్తారు. నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం కేటాయించిన రూ.250 కోట్లలో రూ.180కోట్లు యంత్ర పరికరాల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. నైపుణ్య అభివృద్ధి, శిక్షణ, ఇతర కార్యక్రమాలకు మిగిలిన మొత్తాన్ని వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో 17,250 నాయీబ్రాహ్మణుల సంఘాలు ఉండగా, వీటిలో 68వేల మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల మంది నాయీబ్రాహ్మణులున్నట్లు సమగ్రసర్వేలో తేలింది.

రజకుల కోసం..

రజకులకు ఒకేసారి 340 దుస్తులు ఉతికే సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషిన్, ఇస్త్రీ పెట్టె, బల్ల ఇవ్వాలని నిర్ణయించారు. బట్టలు ఉతికిన నీరు ఇంకేలా ఇంకుడుగుంతను ఏర్పాటుచేస్తారు. వాషింగ్ మెషిన్‌లోని నీరు బయటకు పంపడానికి చిన్న మోటరు కూడా ఇస్తారు. దీనికోసం ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.80వేలకు పైగా ఖర్చు చేయనున్నది.

ఎంబీసీల ఆర్థికప్రగతికి చర్యలు



తెలంగాణలోని అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ) ఆర్థికప్రగతికి ప్రభు త్వం చర్యలు చేపట్టింది. ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా ఆయా కులాలవారు తమ వృత్తిని గౌరవంగా కొనసాగించేందుకు తోడ్పాటు కల్పిస్తున్నాం. ఎంబీసీ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై వారినుంచి ప్రతిపాదనలు సేకరించాం. ఎంబీసీలకు రూ.వెయ్యికోట్లు కేటాయించడంతోపాటు రజక, నాయీబ్రాహ్మణుల ఆర్థికపథకాల నిర్వహణకు ప్రభుత్వం రూ.500కోట్లు మంజూరు చేసింది.

- తాడూరి శ్రీనివాస్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్


కార్పొరేషన్ ఏర్పాటు చారిత్రాత్మకం



తెలంగాణ రాష్ట్రంలో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయ డం చారిత్రాత్మకం. ఉమ్మడి రాష్ట్రంలో రజక, నాయీబ్రాహ్మణులు వివక్షకు గురయ్యారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం ఎంబీసీ కులాల ఆర్థిక ప్రగతికి భారీ మొత్తం కేటాయించింది. బంగారు తెలంగాణ సాధనలో భాగంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రగతికి పలు సంక్షేమ పథకాలను అమలుచేయడం హర్షణీయం.

- కొండూరు సత్యనారాయణ, రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు

ఎంబీసీల ప్రగతికి చర్యలు హర్షణీయం



ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా ఆయా కులాల ఆర్థికప్రగతికి భారీ మొత్తం కేటాయించారు. ముఖ్యమంత్రి కేచం ద్రశేఖర్‌రావు పలుసార్లు అసెంబ్లీలో నాయీబ్రాహ్మణుల ప్రస్తావన తీసుకువచ్చి మా ఆత్మగౌరవాన్ని పెంచారు. నాయీబ్రాహ్మణుల ఆర్థికప్రగతికి నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.250కోట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేల ఆధునిక హెయిర్ సెలూన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గొప్ప విషయం.

- రాసమల్ల బాల్‌కిషన్, తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం, రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్ర సాగునీటి బడ్జెట్ దేశంలోనే టాప్

మొదటిపేజీ తరువాయి...


రంగానికి చేస్తున్న కేటాయింపుల్లో దేశంలోని ఏ రాష్ట్రమూ తెలంగాణకు దరిదాపుల్లో కూడా లేదు. ఈ నేపథ్యంలో భారతదేశ సాగునీటిరంగంపై ప్రత్యేకంగా అధ్యయనం చేసిన అసోచామ్ (ది అసోసియేషన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా) తెలంగాణ సాగునీటి రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని 2016 ఏప్రిల్‌లో ప్రపంచానికి తెలియజేసింది. వివిధ రాష్ట్రాలు సాగునీటి రంగంపై పెట్టిన పెట్టుబడులను పరిగణనలోకి తీసుకొని అందులో ఏ రాష్ట్ర వాటా ఎంత ఉన్నదనే దానిని విశ్లేషించింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు సుమారు రూ.5.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెడితే అందులో 11.6 శాతం తెలంగాణ వాటా ఉండటం విశేషం. సాగునీటిరంగానికి అత్యధికంగా పెట్టుబడులు పెట్టిన మొదటి అయిదు రాష్ట్రాల్లో .. తెలంగాణ (11.6 శాతం), ఆంధ్రప్రదేశ్ (10.4 శాతం), మహారాష్ట్ర (9.4 శాతం), కర్ణాటక (9.4 శాతం), మధ్యప్రదేశ్ (5.8 శాతం) గా ఉన్నాయి.

అదే దూకుడు.. అదే వేగం..


ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచీ దూకుడు తగ్గించలేదు. పనుల వేగమూ తగ్గలేదు. తాజాగా 2017-18 బడ్జెట్ కేటాయింపులపై పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ (పీఆర్‌ఎస్) సర్వే ఆదివారం వెల్లడయింది. 2014-15, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోని 19 రాష్ట్రాలు ఆయా ఆర్థిక సంవత్సరాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లలో సాగునీటి రంగానికి ఎంతమేర ప్రాధాన్యం ఇచ్చాయనే దానిపై పీఆర్‌ఎస్ సర్వే నిర్వహించింది. రాష్ట్రాలవారిగా చేసిన సర్వేలోనూ తెలంగాణ ప్రథమస్థానంలో నిలిచింది. దేశంలోని 19 రాష్ట్రాల బడ్జెట్ కేటాయింపుల్ని ఆమూలాగ్రం పరిశీలించిన పీఆర్‌ఎస్.. సాగునీటిరంగానికి సంబంధించి అన్ని రాష్ట్రాలు సాధారణంగా ఐదు శాతం కేటాయింపుల్ని చేపట్టినట్లు పేర్కొన్నది. కానీ తెలంగాణ ఏకంగా 18 శాతంతో టాప్‌వన్‌లో నిలిచిందని వెల్లడించింది. సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వాలు చేసే కేటాయింపులు.. ఆయా రాష్ట్రాల భవిష్యత్ ఆర్థిక ప్రగతికి పెట్టుబడులుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. తెలంగాణలోని ప్రాజెక్టుల పూర్తితో రాష్ట్ర ప్రజల ఆర్థిక స్థితిగతులతో పాటు సామాజికంగానూ విప్లవాత్మక ప్రగతి కనిపిస్తుందని సీఎం కేసీఆర్ పదేపదే చెప్తున్నారు.

పీఆర్‌ఎస్ సర్వేలో 2017-18, 2014-15 లలో వివిధ రాష్ట్రాలు సాగునీటిరంగానికి చేసిన కేటాయింపులు (శాతాల్లో...)


రాష్ట్రం	2017-18	2014-15
తెలంగాణ	17.6	13.2
ఆంధ్రప్రదేశ్	8.9	7.3
ఒడిశా	8.8	6.8
కర్ణాటక	8.6	7.0
మధ్యప్రదేశ్	6.1	4.7
గుజరాత్	6.9	7.8
అసోం	5.0	5.1
మహారాష్ట్ర	4.2	4.8
ఛత్తీస్‌గఢ్	3.7	4.3
ఉత్తరప్రదేశ్	3.3	4.2
హర్యానా	3.0	4.0
బీహార్	2.8	2.7
పంజాబ్	2.7	3.8
రాజస్థాన్	2.7	2.7
జమ్ము కశ్మీర్	2.7	1.9
పశ్చిమ బెంగాల్	2.6	2.0
తమిళనాడు	2.1	1.7
కేరళ	1.1	0.9
ఢిల్లీ	0.7	0.8



అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన మోటర్ పంప్ సెట్లకు సంబంధించిన రవాణా బిల్లు



తక్కువ ధరలు కోట్ చేసి ఐజీఎస్టీ రూ.10,685గా వేసిన బిల్లు




అదే మోటర్ పంప్‌సెట్ల అసలైన ధరలను ఎస్టిమేట్ అంటూ చూపిన బిల్లు

బ్రాండెడ్ పేర్లతో నకిలీ మోటర్లు

మొదటిపేజీ తరువాయి...

చేసేవి కూడా 10 శాతమే. మిగతా 90 శాతం ఎలాంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నవేనని విశ్వసనీయ సమాచారం. అహ్మదాబాద్, రాజ్‌కోట్, కోయంబత్తూరు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు పెద్దఎత్తున దిగుమతి అవుతున్నాయి. జీఎస్టీ కింద ఎలాంటి పన్నులు చెల్లించకుండానే గోడౌన్లకు చేరుతున్నాయి. ఒకవేళ బిల్లు పరిధిలో రవాణా చేసినా ట్యాక్స్ ఇన్వాయిస్‌లో అండర్ ఎస్టిమేట్ (తక్కువ ధరలు వేస్తూ) పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారు. దీనిద్వారా తెలంగాణ ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతున్నట్టు రాణిగంజ్‌లోని ఓ బ్రాండెడ్ పంపుసెట్ల డీలర్ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ఉచిత విద్యుత్‌లో వృథాను అరికట్టాలంటే నకిలీ/అసెంబుల్డ్ పంపుసెట్లను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఉన్నదన్నారు.



అక్రమాలకు అడ్డాలు

హైదరాబాద్‌లోని రాణిగంజ్, నల్లగుట్ట, ఆదయ్యనగర్, బన్సీలాల్‌పేట, గాంధీనగర్, కవాడిగూడ ప్రాంతాల్లోని అక్రమ గోడౌన్లల్లో 85 శాతానికి పైగా అసెంబుల్డ్/నకిలీ పంపుసెట్లు, మోటర్లు నిల్వ ఉన్నాయని అంచనా. ఎలాంటి పన్నులు చెల్లించకుండా ఉత్పత్తిదారులు వీటిని నగరానికి దిగుమతి చేస్తున్నారన్న తెలుస్తున్నది. కాచిగూడ, లక్డీకాపూల్ ప్రాంతాల నుంచి ట్రావెల్స్ బస్సుల్లో ఆంధ్రా, రాయలసీమకు పంపుతున్నారు. ఆర్టీసీ బస్టాండు, అల్‌కరీం ట్రేడ్ సెంటర్ ప్రాంతం నుంచి ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారు. బస్సుల్లోనే కర్నాటక, మహారాష్ట్ర (లాతూరు, నాందేడ్)లకు ఎగుమతి చేస్తున్నారు. రాణిగంజ్, మహంకాళి, బేగంపేట, సుల్తాన్‌బజార్ వాణిజ్య సర్కిళ్ల పరిధిలో పన్ను ఎగవేతదారుల మోటర్ల దందా యథేచ్ఛగా కొనసాగుతున్నది.

నిబంధనలు హుష్ కాకి!

నాసిరకం మోటర్లను బ్రాండెడ్ పేర్లకు దగ్గరగా ఉండే పేర్లతో అమ్ముతున్నారు. ఐఎస్ఐ/బ్రాండెడ్ పంప్‌సెట్ 5 హెచ్‌పీ ధర రూ.15 వేల నుంచి 22 వేలకు, 6 హెచ్‌పీ రూ.17 వేల నుంచి రూ.24 వేల వరకు అమ్ముతున్నారు. అదే నకిలీ బ్రాండ్లయితే 5 హెచ్‌పీ ధర రూ.7200 నుంచి రూ.9 వేలకే లభిస్తున్నాయి. రెట్టింపు ధరలను వెచ్చించేందుకు రైతులు ఇష్టపడటం లేదని డీలర్లు చెప్తున్నారు. కొన్ని సబ్‌మర్సిబుల్ మోటర్లపై యాజ్ పర్ ఐఎస్ఐ (ఐఎస్ఐ ప్రమాణాల ప్రకారం) అని కూడా పేర్కొంటుండడం విశేషం. ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగిస్తున్న క్రమంలో నకిలీ మోటర్ల వినియోగాన్ని నియంత్రించకపోతే విద్యుత్తు దుర్వినియోగాన్ని అరికట్టడం కష్టమని నిపుణులు అంటున్నారు. అసెంబుల్డ్ మోటర్లలో నాసిరకం వైండింగ్ వల్ల రెట్టింపు విద్యుత్ వినియోగం అవుతుందని మోటర్ల వ్యాపారంలో 20 ఏండ్ల అనుభవం కలిగిన ఓ వ్యాపారి చెప్పారు. మోటర్లకు అవసరమైన కేబుల్ కూడా ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు లేకుండా బ్రాండెడ్ పేరిట ఢిల్లీ నుంచి నగరానికి దిగుమతి అవుతున్నది. అది కూడా పన్నులు చెల్లించకుండానే నగరానికి వస్తున్నట్టు సమాచారం. గడిచిన ఎనిమిది నెలలుగా జీఎస్టీ విధానం కూడా ఓ కొలిక్కి రాలేదు. హైదరాబాద్‌లోని రాణిగంజ్, ట్రూప్ బజార్, కవాడిగూడ, బన్సీలాల్‌పేట ప్రాంతాల్లోని పంప్‌సెట్ల వ్యాపారుల్లో ఎంతమంది జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో లెక్క తేలడం లేదు.

సమాచారం ఇస్తే పట్టుకుంటాం

నిబంధనలను ఉల్లంఘించి అమ్మే వస్తువులు, యంత్రాలపై సమాచారం ఇస్తే పట్టుకుంటామని తూనికలు-కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. కాగా అహ్మదాబాద్, రాజ్‌కోట్, కోయంబత్తూర్ల నుంచి వస్తున్న అసెంబుల్డ్ మోటర్లు, పంపుసెట్ల గురించి తమకు తెలియదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని రాణిగంజ్ సీటీఓ నవనీత పేర్కొన్నారు.

పాక్ కాల్పులకు బుల్లెట్లతోనే సమాధానం

- కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ

అగర్తల, ఫిబ్రవరి 4: పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న పాకిస్థాన్‌కు బుల్లెట్లతోనే సమాధానం చెబుతామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పొరుగుదేశాలతో భారత్ శాంతియుత సంబంధాలనే కోరుకుంటున్నదని త్రిపుర రాజధాని అగర్తల శివారుల్లోని బర్జాలలో శనివారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభలో చెప్పారు. కానీ దురదృష్టవశాత్తు జమ్ముకశ్మీర్‌ను పూర్తిగా ధ్వంసం చేసేందుకు సరిహద్దుల్లో భారత్ భూభాగంపై పాక్ కాల్పులు జరుపుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ సహజ వనరులకు నిలయమైన త్రిపురలో ఒకసారి తమకు అవకాశమిస్తే ఈశాన్య రాష్ట్రాల్లోనే మొదటి స్థానంలో నిలుపుతామని హామీ ఇచ్చారు.





దవాఖానలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీని పరామర్శిస్తున్న మంత్రులు టీ హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి

దవాఖాన నుంచి మహమూద్ అలీ డిశ్చార్జ్

పరామర్శించిన స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అనారోగ్యంతో జూబ్లీహిల్స్ అపోలో దవాఖానలో చేరిన ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీని ఆదివారం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. ఆరోగ్యం మెరుగుపడటంతో ఆయనను ఇంటికి పంపించారు. దవాఖాన నుంచి బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో గల తన నివాసానికి మహమూద్ అలీ చేరుకున్నారు. అంతకుముందు దవాఖానలో శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, భారీ నీటిపారుదల, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మైనారిటీ నేతలు, కార్యకర్తలు డిప్యూటీ సీఎంను పరామర్శించారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
మేడ్చల్	34.6	8.1
మహబూబ్‌నగర్	34.6	8.2
నాగర్‌కర్నూల్	34.6	9.3
రంగారెడ్డి	34.6	9.4
వికారాబాద్	34.6	9.8
నల్లగొండ	35.2	9.8
కామారెడ్డి	34.9	9.9
జోగుళాంబ గద్వాల	34.6	10.1
సంగారెడ్డి	35.5	10.1
యాదాద్రి భువనగిరి	34.6	10.4
సిద్దిపేట	34.7	10.4
జనగామ	35.4	10.6
భద్రాద్రి కొత్తగూడెం	35.9	10.6
కుమ్రంభీం ఆసిఫాబాద్	35.6	10.7
మెదక్	35.4	10.9
వరంగల్ రూరల్	34.6	11.2
నిర్మల్	34.9	11.2
రాజన్న సిరిసిల్ల	35.8	11.2
కరీంనగర్	35.4	11.4
నిజామాబాద్	35.5	11.4
జయశంకర్ భూపాలపల్లి	35.8	11.6
మంచిర్యాల	35.9	11.7
ఆదిలాబాద్	35.8	11.8
మహబూబాబాద్	35.8	11.9
ఖమ్మం	35.0	12.0
సూర్యాపేట	35.8	12.0
వరంగల్ అర్బన్	34.6	12.1
వనపర్తి	34.4	12.2
జగిత్యాల	35.8	12.8
పెద్దపల్లి	35.0	12.9
హైదరాబాద్	35.9	13.3

పెరిగిన కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే 2 డిగ్రీలు ఎక్కువ: టీఎస్‌డీపీఎస్ వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతల్లో సాధారణం కంటే 2 డిగ్రీల మేర పెరుగుదల చోటుచేసుకున్నది. రానున్న మూడు రోజుల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల నుంచి 17 డిగ్రీలకు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో కూడా 14 డిగ్రీల నుంచి 17 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు టీఎస్‌డీపీఎస్ (తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ) వెల్లడించింది. ఆకాశం నిర్మలంగా ఉంటుండటంతో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని టీఎస్‌డీపీఎస్ అధికారులు తెలిపారు. అదేవిధంగా ఉత్తరాది నుంచి చలిగాలుల తీవ్రత తగ్గడంతో రాత్రి ఉష్ణోగ్రతల్లోనూ స్వల్పంగా పెరుగుదల నమోదవుతున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో 8.1 డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో 8.2 డిగ్రీలు, మల్కాజిగిరిలో 9.1 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 9.3 డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లా దొనూర్‌లో 9.4 డిగ్రీలు, జడ్చర్లలో 9.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్‌లో 9.6 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరులో 9.6 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలను చూస్తే అత్యధికంగా హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెంల్లో 35.9 డిగ్రీల చొప్పున రికార్డయినట్టు టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది.

ఏపీ సర్కార్ కిరికిరి



గూడ్స్ వాహనాల సింగిల్ పర్మిట్‌పై కలిసిరాని చంద్రబాబు ప్రభుత్వం

టీఎస్ వాహనాల రవాణాపై బాదుడు.. పరస్పర ఒప్పందానికి టీ సర్కార్ ప్రతిపాదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి సోదరభావాన్ని కొనసాగించడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొండెత్తం వేస్తున్నది. తెలంగాణపై కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణ సరిహద్దు ప్రాంత గూడ్స్ వాహనాలపై రవాణా పన్ను పేరుతో అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నది. ప్రతి ట్రిప్పునకు తాత్కాలిక పర్మిట్ కింద లక్షల రూపాయలు వసూలు చేస్తున్నది. తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల గూడ్స్ వాహనాల యజమానులు ఎక్కువ శాతం వ్యాపార లావాదేవీల నిమిత్తం విజయవాడ, గుంటూరుకు వెళ్తుంటారు. ఇదేఅదనుగా భావించి ఆ వాహనాల నుంచి భారీగా పర్మిట్ పన్నులు వసూలు చేస్తున్నది. ఇలాంటి వసూళ్లు భావ్యంకావని గ్రహించి ఏపీ ప్రభుత్వానికి పరస్పర సింగిల్ పర్మిట్ ఒప్పందం చేసుకుంటే ఇరువురికి ప్రయోజనం ఉంటుందని తెలంగాణ సర్కార్ ఇటీవల ప్రతిపాదనలు పంపించింది. రాష్ట్రం విడిపోయిన నాటి నుంచి ఇప్పటివరకు అధికారికంగా మూడుసార్లు లేఖలు ఇచ్చింది. ఒకసారి నేరుగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చంద్రబాబుతో సంప్రదింపులు జరిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డితో ఆ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, అక్కడి రవాణాశాఖ ఉన్నతాధికారుతో కలిసి చర్చించారు. సింగిల్ పర్మిట్‌పై ఏపీ సర్కార్ మాత్రం మొండి వైఖరి వీడటంలేదు. తాజాగా చేసిన ప్రతిపాదనలకు ఎలా స్పందిస్తుందనే దానిపై తెలంగాణ ప్రభుత్వం వేచి చూస్తున్నది. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు చంద్రబాబును కలిసి విజ్ఞప్తిచేశారు.

తాత్కాలిక పర్మిట్ పేర వసూళ్లు

సింగిల్ పర్మిట్ లేకపోవడంతో తెలంగాణలోని ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దు ప్రాంత జిల్లాల గూడ్స్ వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, గద్వాల, వనపర్తి జిల్లాల గూడ్స్ వాహనదారులు ఏపీకి వెళ్లాలంటే తాత్కాలిక పర్మిట్ కింద పన్ను చెల్లించాల్సి వస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కంటే పక్కనే ఉన్న ఏపీ నుంచి సరుకు రవాణా వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన గూడ్స్ వాహనాలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలంటే తాత్కాలిక పర్మిట్ కింద వారంరోజుల గడువుకు రూ.1600 చెల్లించాల్సి ఉంటుంది. ఇది కేవలం వారానికి ఒక్కో వాహనం చెల్లించాల్సి వస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వాహనం వారం తర్వాత తిరిగి వస్తే మళ్లీ తాత్కాలిక పర్మిట్ రుసుం చెల్లించాల్సిందే. నెలకు రూ.4,600 చెల్లించాల్సి వస్తున్నది. పక్కనే ఉండి కూడా ఇలా డబ్బులు చెల్లించే పరిస్థితి రావడంతో తెలంగాణ ప్రభుత్వం స్పందించి సింగిల్ పర్మిట్ ఒప్పందాలు చేసుకునేందుకు పలు దఫా ప్రతిపాదనలు చేసింది.

ఏపీ సర్కార్‌తో చర్చిస్తున్నాం: జేటీసీ రమేశ్

తెలంగాణలోని సరిహద్దు జిల్లాల గూడ్స్ వాహనాల సింగిల్ పర్మిట్ విషయమై ఏపీ సర్కార్‌తో చర్చిస్తున్నామని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదనలు పంపించామని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేశ్ తెలిపారు. ఇటీవల ఖమ్మం, సూర్యాపేట, గద్వాల, వనపర్తి జిల్లాలో పర్యటించి గూడ్స్ వాహనదారుల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నామని అన్నారు.

సింగిల్ పర్మిట్ విధానం

పక్కపక్క రాష్ట్రాలు సాధారణంగా సింగిల్ పర్మిట్ ఒప్పందాలు చేసుకుని వాహనాలు రాకపోకలు సాగించుకునేందుకు వెసులుబాటు కల్పించుకుంటాయి. ఇందుకు ఒక్కోగూడ్స్ వాహనం (లారీ) ప్రతీ సంవత్సరం రూ.5 వేలు చెల్లించి పక్క రాష్ట్రానికి ఎన్నిసార్లయినా వెళ్లిరావచ్చు. ఉమ్మడి ఏపీతో పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలు సింగిల్ పర్మిట్‌పై ఒప్పందాలు చేసుకున్నాయి. ఉమ్మడి ఏపీ విడిపోయిన సందర్భంగా ఏపీ రవాణాశాఖ చట్టాన్ని అన్వయించుకోవడంతో అప్పట్లో చేసుకున్న ఒప్పందం ప్రకారంగా తెలంగాణ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల వాహనాలను, ఇక్కడి వాహనాలను ఆయా రాష్ట్రాలు సింగిల్ పర్మిట్ కింద అనుమతిస్తున్నారు. ఇలాంటి ఒప్పందాన్ని ఏపీ సర్కార్‌తో చేసుకుంటే ఇరు రాష్ట్రాల గూడ్స్ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది.

ఓడీఎఫ్ గ్రామాల్లో పర్యటించనున్న కేంద్రబృందం

త్వరలో రాష్ట్రానికి రాక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఆరుబయట మలవిసర్జనరహిత (ఓడీఎఫ్) గ్రామాల్లో కేంద్రబృందం పర్యటించనున్నది. ఇందుకోసం 23 జిల్లాలకు చెందిన 138 గ్రామాలను తాజాగా ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో కేంద్ర పరిశోధకులు పర్యటించి 51 ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి నివేదికలను కేంద్రానికి అందజేయనున్నారు. గ్రామంలో నూరుశాతం మరుగుదొడ్లు, వాటిలో నీటి సరఫరా తదితర సదుపాయాలు ఉంటేనే ఆ గ్రామాన్ని ఓడీఎఫ్‌గా రాష్ట్రం ప్రకటిస్తుంది. ఇలా ఇప్పటికి 3,608 పంచాయతీల్లోని 4,050 గ్రామాలను ఓడీఎఫ్‌గా వెల్లడించింది. తొమ్మిది జిల్లాల్లో నూరుశాతం గ్రామాలు ఓడీఎఫ్‌లుగా మారాయని కేంద్రానికి తెలిపింది. రాష్ట్రం ప్రకటించిన గ్రామాలు నిజంగా సంపూర్ణ ఆరుబయలురహితంగా మారిందీ లేనిదీ తెలుసుకొని తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కేంద్రం కొన్ని ప్రైవేటు సంస్థలను ఎంపిక చేసి రాష్ట్రాలకు పంపుతుంది. ఇప్పటికే తెలంగాణలోని కొన్ని గ్రామాల్లో ఇటువంటి పరిశీలన చేపట్టిన కేంద్రం , తాజాగా జిల్లాకు ఆరు గ్రామాల చొప్పున 23 జిల్లాల్లోని 138 గ్రామాలను ఎంపిక చేసింది. ఢిల్లీకి చెందిన మూడు సంస్థల ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి వారు కేంద్రానికి ఒక నివేదిక ఇవ్వనున్నారు. ఈ నివేదిక ఆధారంగానే కేంద్రం రాష్టానికి స్వచ్ఛభారత్ నిధులను విడుదల చేస్తుంది.



మఖ్దూం మొహియుద్దీన్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

కలం యోధుడు మఖ్దూం మొహియుద్దీన్

జయంతి సందర్భంగా నివాళులర్పించిన సురవరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తిన యోధుడు మఖ్దూం మొహియుద్దీన్ అని, ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మిక నాయకుడు, ప్రముఖ ఉర్దూకవి మఖ్దూం మొహియుద్దీన్ 110వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై జరిగిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు వీఎస్ బోస్, కందిమళ్ల ప్రతాపరెడ్డి, నగర కార్యదర్శి నరసింహ శ్రద్ధాంజలి ఘటించారు. సురవరం మాట్లాడుతూ మొహియుద్దీన్ సమసమాజ స్థాపన కోసం క్రియాశీల రాజకీయాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా అనేక ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు.

రేపు టీ సాట్‌లో పశుసంవర్ధకశాఖపై ప్రసారాలు

టీ సాట్ సాఫ్ట్‌నెట్ సీఈవో శైలేశ్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీ సాట్ వ్యవసాయ ప్రసారాల్లో భాగంగా ఫిబ్రవరి 6 మంగళవారం 'పశుసంవర్ధక పథకాలు– పశు వైద్య ఆరోగ్య సేవలు' అనే అంశంపై ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశం పశుసంవర్ధక పథకాలు, పశు వైద్యం, ఆరోగ్య సేవలపై సలహాలు ఇస్తారని టీ సాట్ సాఫ్ట్‌నెట్ సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రసారమయ్యే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మందకృష్ణది ఉద్యమ వ్యాపారం

ఎమ్మార్పీఎస్ ఒక మైక్రోఫైనాన్స్ సంస్థ.. వసూలు బ్యాచ్‌తో వర్గీకరణ అసాధ్యం

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ధ్వజం

ఖైరతాబాద్: 'ఎస్సీల వర్గీకరణ పేరుతో 23 ఏండ్లుగా మందకృష్ణ మాదిగ ఉద్యమ వ్యాపారం చేస్తున్నారు. దాని పేరుతో కోట్లు సంపాదించుకున్నారు' అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఆరోపించారు. ఏబీసీడీ వర్గీకరణకు మందకృష్ణ కొత్త అర్థం తీసుకొచ్చారని, ఏ అంటే అరెస్టులు, బీ అంటే బెయిల్, సీ అంటే కేసులు, డీ అంటే దాడులు అనే విధంగా ఆ అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పిడమర్తి రవి మందకృష్ణపై తీవ్రస్థాయిలో రుచుకుపడ్డారు.ఎమ్మార్పీఎస్ ఒక మైక్రో ఫైనాన్స్ సంస్థ అని, వసూలు చేసే బ్యాచ్‌తో ఎస్సీల వర్గీకరణ అసాధ్యమని, ఏ ఉద్యమకారుని వద్ద లేని డబ్బులు మందకృష్ణ వద్ద ఉన్నాయని అన్నారు. మాదిగ ఉద్యమం పుట్టింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అని, ప్రస్తుతం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో నేటి వరకు దీనిపై తీర్మానం ప్రవేశపెట్టలేదని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వర్గీకరణ అంశాన్ని ముందుకు తీసుకెళ్లారని, అసెంబ్లీలో తీర్మానం పెట్టి కేంద్రానికి నివేదించారని గుర్తుచేశారు. సీఎంపై మందకృష్ణ ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా మాదిగలు ఒకే గొడుగు కిందకు రావాలని, జేఏసీగా వర్గీకరణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల ఎనిమిదిన రాష్ట్రవ్యాప్తంగా శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని, 28న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, మాదిగలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో మాదిగ యూత్ జేఏసీ గ్రేటర్ అధ్యక్షుడు చిరుమర్తి రాజు మాదిగ, ధీరన్, వినాయక్ రావు, వేల్పు కొండ వెంకటేశ్, మంచర్ల శ్రీను, వడ్డె ఎల్లన్న, ఎర్రవెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

ముమ్మరంగా కల్వకుర్తి 'పొడిగింపు' పనులు

డీ-82 కింద నాగిళ్ల వరకు అదనంగా 35 వేల ఎకరాలకు నీరు

59 కి.మీ.గాను ఇప్పటికే 10 కిలోమీటర్ల మేర పూర్తయిన పనులు

చంద్రసాగర్‌నూ కృష్ణాజలాలతో నింపేందుకు ప్రతిపాదనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో గందరగోళంగా తయారైన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులు గాడిన పడుతున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలో నాగిళ్ల వరకు 35 వేల ఎకరాలకు సాగునీరు అందించే కాల్వల పొడిగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ ద్వారా చంద్రసాగర్‌ను కృష్ణాజలాలతో నింపేందుకుగాను చేపట్టాల్సిన పనులపై నివేదిక రూపకల్పన కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఈ వర్షాకాలానికి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఆయకట్టుకు సంబంధం లేకుండా జరిగిన నీటి కేటాయింపులను సరిదిద్ది 25 టీఎంసీల నుంచి 40 టీఎంసీలకు పెంచింది. గతంలో ఈ ప్రాజెక్టు పనులను ఈపీసీ కింద కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో 35 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన పనులకు అవకాశం లేకుండాపోయింది. దీనిని గుర్తించిన ప్రభుత్వం రూ.178 కోట్లతో పనులను చేపట్టేందుకు గతంలోనే ఉత్తర్వులు ఇవ్వగా ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి. గుడిపల్లి గట్టు (ప్రాజెక్టు మూడో దశ లిఫ్టు) నుంచి కల్వకుర్తి దిశగా 160 కిలోమీటర్ల కాల్వ పనులు పూర్తయ్యాయి. చివర డిస్ట్రిబ్యూటరీ–82ను నాగిళ్ల వరకు 59 కిలోమీటర్ల మేర పొడిగించేందుకు కొత్తగా పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే 10 కిలోమీటర్ల మేర పనులు పూర్తయినట్టు చీఫ్ ఇంజినీర్ ఖగేందర్ తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గుడిపల్లి గట్టు నుంచి అచ్చంపేట వైపు అచ్చంపేట బ్రాంచి కెనాల్‌ను 90 కిలోమీటర్ల మేర నిర్మించారు. దీనిని పెనిమెళ్ల వరకు పొడిగించి సమీపంలోని చంద్రసాగర్ చెరువును నింపడం ద్వారా 15 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందనున్నది. అధికారులు ప్రాజెక్టు నివేదిక రూపొందించేందుకు ప్రతిపాదనలు పంపారు.



బియ్యం అక్రమ వ్యాపారిపై పీడీ కేసు

- త్వరలో మరికొందరిపై కూడా..
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన రావిరాల రామలింగం (42)పై ఆదివారం జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ పీడీ కేసు నమోదుచేశారు. మిర్యాలగూడ కేంద్రంగా కొన్నేండ్లుగా పీడీఎస్ బియ్యాన్ని సేకరించి రామలింగం అక్రమంగా రవాణా చేస్తున్నాడు. 2016, ఫిబ్రవరి 10న రామలింగంపై తొలిసారి కేసు నమోదైంది. అప్పటి నుంచి బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి రామలింగంపై 6ఏ కేసులు 9, క్రిమినల్ కేసులు 6 నమోదయ్యాయి. అయినా తీరు మార్చుకోకపోవడంతో కలెక్టర్ పీడీ కేసు నమోదుచేశారు. హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై నిఘా పెట్టామని, మరికొందరిపై త్వరలో పీడీ కేసులు నమోదుచేస్తామని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు.

సమన్వయంతో సత్ఫలితాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం జాతరలో వివిధశాఖలతో సమన్వయం చేసుకొని ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించినట్టు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు తెలిపారు. జాతరకు వచ్చిన భక్తుల కోసం ఆర్టీసీ 34,500 బస్సు ట్రిప్పుల ద్వారా 11 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిందని పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా 1,200 మంది సంస్థ అధికారులు, సిబ్బంది సేవలు అందించారని ఆయన మీడియాతో చెప్పారు. జాతర సమయంలో కండిషన్‌లో ఉన్న బస్సులను నడిపినట్టు వెల్లడించారు. విశేషసేవలు అందించిన సిబ్బంది, అధికారులను అభినందించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. జాతరలో రవాణా ఏర్పాట్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం సమీక్షించగా, వరంగల్ రీజినల్ మేనేజర్ సూర్యకిరణ్ సిబ్బందిని మానిటరింగ్ చేశారని ఆయన తెలిపారు.

రైల్వేలో విద్యుదీకరణకు ప్రాధాన్యం: రైల్వే జీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వేలో విద్యుదీకరణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రైల్వేలో విద్యుదీకరణకు కేటాయింపులు చేసిందని తెలిపారు. ఆదివారం లాలాగూడలోని రైల్వే లోకో షెడ్‌లో ఏడో రైల్వే ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ డే ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. విద్యుదీకరణ, హైస్పీడ్ రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ ఆదాలో రైల్వే ముందంజలో ఉన్నదన్నారు. అనంతరం లోకో షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇండియన్ రైల్వే ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ ప్రిన్సిపాల్ ఏపీ ఫాడ్కే, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ పద్మిణీ రాధాకృష్ణన్, ఫైనాన్షియల్ అడ్వయిజర్ ప్రిన్సిపల్ అర్జున్ ముండియా తదితరులు ఉన్నారు.

ముల్కీ స్ఫూర్తితో జోనల్ వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి...

విషయాలపై అధ్యయనం జరుగుతున్నది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి ముందు జరిగిన పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, మన స్థానికతకు లభించిన రాజ్యాంగ రక్షణ చర్చనీయాంశం కావాలని ఉద్యోగ సంఘాల నేతలు వాదిస్తున్నారు. తెలంగాణ విద్యావంతులకు, ఉద్యోగాలు దక్కాలంటే ముల్కీ నిబంధనలకు రక్షణ కల్పించాలని నాడు తెలంగాణ నేతలు చేసిన వాదనలను పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్‌మెన్ అగ్రిమెంట్)లో చేర్చారు.. ఏడో రాజ్యాంగ సవరణ ద్వారా రూపొందించిన చట్టాన్ని పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ లోకల్ రిజర్వేషన్ యాక్ట్ అని కూడా వ్యవహరించారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని అధ్యయనం చేసిన అనంతరం రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలకు ప్రతిపాదలను పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.


రాష్ట్రం ఏర్పడ్డాకా ఇదే గొడవ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తేదీ నుంచి స్థానికత గురించే కొట్లాట జరుగుతున్నది. విద్యుత్‌శాఖలోని 1200 మంది ఉద్యోగుల విషయంలో వచ్చిన కోర్టు తీర్పులు ఇందుకు ఉదాహరణ. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–2013 లోని నిబంధనల్లో.. ఉద్యోగుల విభజనలో, పబ్లిక్‌సెక్టార్ విభజనలో స్పష్టంగా మార్గదర్శకాలు లేకపోవడం.. నిబంధనల్లో లోపాల వల్ల వివాదాలకు ఆస్కారం ఏర్పడుతున్నది. ఉద్యోగుల విభజనకోసం ఏర్పాటుచేసిన కమలనాథన్ కమిటీకి కేవలం స్థానికత ప్రకారమే విభజన జరుగాలన్న వాదనలను బలంగా వినిపిచేందుకు వేల ఫిర్యాదులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ వరుసలోనే రాష్ట్రపతి ఉత్వర్వులకు చేయాల్సిన సవరణలకు ప్రతిపాదనలను రూపొందించే క్రమంలో తెలంగాణ ఉద్యోగులకు జరిగిన అన్యాయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని తెలంగాణ స్థానికత ప్రామాణికంగా ఉండే విధంగా ప్రతిపాదనలు ఉండాలని ఉద్యోగసంఘాల జేఏసీ నాయకులు అంటున్నారు. విభజన చట్టంలోని లోపాలన్నింటికీ సమాధానాలు లభించేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణలు ఉండాలనే ఉద్యోగసంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేసిన నియామకాలన్నింటిలో 371–డీ, రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా లభించిన స్థానికత నిబంధనలను పాటించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలో కూడా రాష్ట్ర స్థాయి పోస్టులలో తెలంగాణవారికే మొదటి అవకాశం లభించేవిధంగా స్థానికతను ప్రామాణికంగా తీసుకున్నారు.

ముల్కీ నిబంధనల ప్రకారమే సవరణలుండాలి..

ముల్కీ నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు పదిహేనేండ్లపాటు నివాసమున్న జిల్లాలో లేదా గ్రామంలో ఆస్తులు ఉండాలనే నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని, తద్వారా రాజ్యాంగ హక్కులకు గౌరవం కల్పించేవిధంగా సవరణలు ఉండాలని ఉద్యోగసంఘాల నేతలు కోరుతున్నారు. జిల్లాల ఏర్పాటు సందర్భంలో ఉద్యోగసంఘాలు చెప్పిన అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలంటున్నారు. రాష్ట్రస్థాయి పోస్టుల నుంచి జూనియర్ అసిస్టెంట్ పోస్టు వరకు స్థానికులకే అవకాశాలు ఉండాలని చెప్తున్నారు. తెలంగాణ ఉద్యోగసంఘాల అభిప్రాయాలకు, రాజ్యాంగం ప్రకారం తెలంగాణ స్థానికత పరిరక్షణకు లభించిన అవకాశాలన్నింటికీ ప్రాధాన్యం లభించేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ ప్రతిపాదనలు రూపొందించేందుకు ఉన్నతస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి.


ఇప్పుడే బలమైన పునాదులు పడాలి



తెలంగాణ భవిష్యత్ తెలంగాణ భూమిపుత్రుల ఆలోచన ప్రకారం జరుగాలి. అందుకు ఇప్పుడు పునాదులు పడాలి. రాష్ట్ర సీఎం కేసీఆర్ సంకల్పం కూడా ఇదే. రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణల ప్రతిపాదనలలో తెలంగాణలో స్థానికతకోసం జరిగిన ఉద్యమాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. జీవోఎం ముందు తెలంగాణ జేఏసీ ఇచ్చిన ప్రతిపాదనలన్నీ చర్చించాలి. రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ స్థానికత ఇరుసుగా ఉన్నదన్న కీలకాంశాన్ని విస్మరించవద్దు. మంత్రుల బృందానికి ఇచ్చిన విజ్ఞాపనలో స్పష్టంగా స్థానికతను పరిరక్షించాల్సిన అంశాలను సోదాహరణంగా వివరించాం. రాజ్యాంగపరంగా తెలంగాణకు హక్కులు లభించినప్పటికీ, ఉమ్మడి పాలకులు హక్కులను ఉల్లంఘించిన చాలా విషయాలను చర్చించాం.

- విఠల్, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు


అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకోవాలి



కేంద్రం.. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం రూపొందించే క్రమంలో తెలంగాణ ఉద్యమంలోని సున్నితమైన అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు. కాలక్రమంలో ఈ లోపాలే వివాదాస్పదాలయ్యాయి. కమలనాథన్ కమిటీ ముందు వివాదాలు భగ్గుమన్నాయి. కొన్ని వివాదాలను కమిటీ పరిష్కరించినప్పటికీ చాలా అన్యాయాలను కమలనాథన్ కమిటీ, డీవోపీటీ పరిష్కరించనే లేదు. ఈ కారణాలన్నింటినీ ఎంపీ కవిత సారథ్యంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి చర్చించాం. తెలంగాణ స్థానికతకు రాజ్యాంగరక్షణ ఉన్నదని స్పష్టంచేశాం. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రతిపాదనలలో ఈ అంశాలన్నింటినీ చర్చించాలి. తెలంగాణ స్థానికతే ప్రామాణికం కావాలి.

- గుండవరపు దేవీప్రసాద్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్

తల్లిదండ్రుల స్థానికత ప్రామాణికం కావాలి



స్థానికత విషయంలో తల్లిదండ్రుల స్థానికతను ప్రామాణికంగా తీసుకోవాలని ఉన్నతస్థాయి కమిటీకి వివరించాం. స్థానికతను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో కూడా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. అందుకని రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణల్లో, జోనల్ వ్యవస్థ నిర్మాణంలో చాలా జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. ఉద్యోగసంఘాలతో విస్తృతంగా చర్చలు జరుపాలి.

- కారం రవీందర్‌రెడ్డి, ఉద్యోగసంఘాల జేఏసీ నాయకుడు

కేఆర్టీఏ అధ్యక్షుడిగా సందీప్‌కుమార్



సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కర్ణాటక రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ (కేఆర్టీఏ) నూతన అధ్యక్షుడిగా సందీప్ కుమార్ మక్తాల మరోసారి ఎంపికయ్యారు. ఆయన 2018 నుంచి 2021 వరకు నాలుగు సంవత్సరాల పాటు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. బెంగళూరులోని కబ్బన్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయనను కేఆర్టీఏ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 2012లో ప్రారంభమైన కమిటీ తెలంగాణ ఉద్యమానికి బలంగా మద్దతిచ్చింది. తెలంగాణ రాష్ట్ర పండుగలు, సంస్కృతి సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. బెంగళూరులో బోనాలు, బతుకమ్మ సంబురాలను అట్టహాసంగా నిర్వహిస్తున్నది. బెంగళూరులో తెలంగాణభవన్‌ను ఏర్పాటు చేసేందుకు కేఆర్టీఏ కృషిచేస్తున్నది. దీనికోసం కర్ణాటక ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు ప్రకటించింది.

పశువైద్య పోస్టులు డీఎస్సీ ద్వారా నింపాలి

తెలంగాణ పశువైద్య పట్టభద్రుల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వైద్యుల (మెడికల్) మాదిరిగానే పశువైద్య పోస్టులను కూడా డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా భర్తీచేయాలని తెలంగాణ పశువైద్య పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో 1,456 మంది వైద్యుల నియామకాలను డీఎస్సీ ద్వారా చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష, ఇంటర్వ్యూలు అవసరం లేదని పేర్కొన్నారు.

ఎంఎల్ఆర్ రాయల్స్ జట్టు శుభారంభం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జీ వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ20లీగ్ రెండోదశలో భాగంగా కాకతీయ కింగ్స్ జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఎంఎల్ఆర్ రాయల్స్ మహబూబ్ నగర్ జట్టు ఘన విజయం సాధించింది. ఆదివారం దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి క్రికెట్ మైదానం(ఎంఎల్ఆర్)లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కాకతీయ కింగ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 159 పరుగులు చేసి ఆలౌటైంది. కాకతీయ కింగ్స్ జట్టులో ప్రజ్ఞారెడ్డి 67 పరుగులతో రాణించాడు. రాయల్స్ జట్టు బౌలర్ అజయ్‌దేవ్ గౌడ్ 25 పరుగులకే 3 వికెట్లు పడగొట్టాడు.అనంతరం 16.5 ఓవర్లలోనే రాయల్స్ మహబూబ్‌నగర్ జట్టు 2 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి సునాయాస విజయం సాధించింది. రాయల్స్ జట్టులో తిలక్‌వర్మ 60, చంద్రశేఖర్ 46 పరుగులు సాధించారు. తొలిమ్యాచ్‌లో విజయంతో శుభారంభం చేసిన రాయల్స్ జట్టు సభ్యులను ఆ జట్టు ఓనర్ మర్రి రాజశేఖరరెడ్డి జట్టు అభినందించారు.

లంచ్‌బ్రేక్ తమాషా!



బ్యాటుకూ బంతికి మధ్య సమరం క్రికెట్‌లో మజాను అందిస్తుంది..అందుకే మన దేశంలో క్రికెట్ అంటే అంత అభిమానం.. గల్లీ క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నా కళ్లప్పగించి చూస్తారంటే అతిశయోక్తి కాదు.. ఆటగాళ్ల మధ్య సమరం లేదంటే మాటల యుద్ధం ఇవన్నీ ఆసక్తినిరేపేవే.. ఇవేవీ లేకుండా ఐసీసీ 'లంచ్‌బ్రేక్'ని బంధనఅభిమానులతోపాటు క్రికెటర్లకు, కామెంటేటర్లకూ తమాషాను పంచింది. తాజాగా దక్షిణాఫ్రికాతో టీమ్ ఇండియా వన్డే సిరీస్‌లో తలపడుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ విజయానికి 2 పరుగుల దూరంలో ఉండగా..అంపైర్లు నిబంధనల ప్రకారం లంచ్‌బ్రేక్ ప్రకటించి మైదానం వీడారు. దీంతో కెప్టెన్ కోహ్లీ, క్రీజులో ఉన్న ధవన్‌తోపాటు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు షాక్ తిన్నారు. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు.. ఐసీసీ నిబంధన ప్రకారం టెస్టు మ్యాచ్‌కైతే అరగంట, వన్డే మ్యాచ్‌కైతే 15 నిమిషాలు మాత్రమే అదనంగా అంపైర్లు కొనసాగించగలరు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలుత బ్యాటింగ్ చేసి 32 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. భారత్ లక్ష్యఛేదనలో 19 ఓవర్లకే 117 పరుగులతో విజయానికి చేరువైంది. అప్పటికే అంపైర్లు నిబంధనల ప్రకారం 15 నిమిషాలు అదనంగా భారత ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. ఐసీసీ నిబంధన ప్రకారం ఒక్క నిమిషం కూడా ఆడించేందుకు నిబంధనలు అంగీకరించకపోవడంతో ఆటగాళ్లు 45 నిమిషాలపాటు లంచ్‌బ్రేక్‌కు వెళ్లారు. దీంతో ఐసీసీ నిబంధనపై సామాజిక మాధ్యమాల్లో జోకులు పేలాయి. 'ఇప్పుడు మళ్లీ దక్షిణాఫ్రికా మైదానంలోకి వచ్చి 31 ఓవర్లు మెయిడెన్స్ వేస్తారా!అని కొందరు ..నిబంధనలు అంగీకరించకపోతే 45 నిమిషాల బ్రేక్ కాకుండా 10 నిమిషాలపాటు బ్రేక్ ఇవ్వొచ్చుగా అని మరికొందరు.. ఇప్పుడు వర్షమొస్తే ఏం చేస్తారో అంటూ ..అంపైర్లకు మరీ అధికారం లేకుండా పోయిందంటూ తమాషా వ్యాఖ్యలు చేశారు.

కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న వన్డే సిరీస్ విజయానికి భారత్ మరింత చేరువైంది. టెస్ట్ సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా కోహ్లీసేన వన్డేల్లో ఇరుగదీస్తున్నది. చాహల్, కుల్దీప్ మణికట్టు మాయాజాలంతో విజృంభించిన వేళ..దక్షిణాఫ్రికా స్వల్పస్కోరుకే చాపచుట్టేసింది. డివిలీయర్స్, డుప్లెసిస్ గైర్హాజరీలో సఫారీలు..కోహ్లీసేన ముందు మోకరిల్లారు. స్పిన్ ఉచ్చులో పడి విలవిలలాడిపోయారు. ధవన్, కోహ్లీ ఆడుతూపాడుతూ లక్ష్యాన్ని ఛేదించగా భారత్..ఆరు వన్డేల సిరీస్‌లో 2-0తో ముందంజ వేసింది.

మణికట్టు.. సూపర్ హిట్టు

- చాహల్, కుల్దీప్ స్పిన్ మ్యాజిక్
- దక్షిణాఫ్రికా 118 ఆలౌట్
- 9 వికెట్లతో భారత్ ఘనవిజయం
- సిరీస్‌లో 2-0తో ముందంజ



చాహల్ (8.2-1-22-5)

సెంచూరియన్: శత్రువును అదును చూసి దెబ్బకొట్టాలంటారు. సొంతగడ్డపై తమకు ఎదురేలేదన్నట్లు విర్రవీగిన దక్షిణాఫ్రికాను మనోళ్లు నేలకు దించారు. తాము మనస్సు పెట్టి ఆడితే ప్రత్యర్థి ఎంత పటిష్ఠంగా ఉన్నా..పడుగొడుతామని భారత్ మరోమారు నిరూపించింది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో తమదైన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటూ కోహ్లీసేన గెలుపు బావుట ఎగురవేసింది. ఆదివారం దాదాపు ఏకపక్ష రీతిలో సాగిన రెండో వన్డేలో టీమ్‌ఇండియా 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. సఫారీలు నిర్దేశించిన 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కోహ్లీసేన..20.3 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది. ధవన్(56 బంతుల్లో 51 నాటౌట్, 9ఫోర్లు), కోహ్లీ(50 బంతుల్లో 46, 4 ఫోర్లు, సిక్స్) రాణించారు. రబాడ (1/24)కు ఏకైక వికెట్ దక్కింది. తొలుత చాహల్(8.2-1-22-5), కుల్దీప్ యాదవ్(6-0-20-3) స్పిన్ ధాటికి దక్షిణాఫ్రికా 32.2 ఓవర్లలో 118 పరుగులకు కుప్పకూలింది. కాయా జొండో(25), డుమిని(25) ఫర్వాలేదనిపించారు. మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ ఎనిమిది వికెట్లు పడగొట్టి కేవలం 42 పరుగులు ఇచ్చుకున్నారు. ఐదు వికెట్లతో అదురగొట్టిన చాహల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే ఈనెల 7న కేప్‌టౌన్‌లో జరుగుతుంది.



ధవన్ 51 నాటౌట్

51/4: టాస్ గెలిచిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ..దక్షిణాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఓపెనర్లు ఆమ్లా(23), డికాక్(20) దక్షిణాఫ్రికాకు మెరుగైన శుభారంభాన్నే అందించారు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ 9వ ఓవర్లో వరుస బంతుల్లో డికాక్ వరుస బంతుల్లో బౌండరీలతో జోరు కనబరిచాడు. అయితే ఆ మరుసటి ఓవర్లో ఆమ్లాను భువీ ఔట్ చేశాడు. ఔట్‌పై డీఆర్ఎస్‌కు వెళ్లినా ఆమ్లాకు నిరాశే ఎదురైంది. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన మర్క్రామ్(8) ఆదిలో తడబడ్డాడు. ఇదే అదునుగా కోహ్లీ..స్పిన్ అస్ర్తాన్ని ప్రయోగించడం లాభించింది. ఆరు బంతుల తేడాతో డికాక్, మర్క్రామ్, మిల్లర్(0) వెంటవెంటనే నిష్క్రమించారు. దీంతో దక్షిణాఫ్రికా 51 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది.

చా'హల్'చల్: 50 పరుగులకే దాదాపు సగం వికెట్లు చేజార్చుకున్న దక్షిణాఫ్రికాను..కుల్దీప్‌తో కలిసి చాహల్ ఘోరంగా దెబ్బకొట్టాడు. పిచ్ పరిస్థితులను అనుకూలంగా మలుచుకుంటూ సఫారీ బ్యాట్స్‌మెన్‌ను కట్టడిచేశాడు. చాహల్, కుల్దీప్ స్పిన్ తంత్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోని సఫారీలు వరుస విరామాల్లో వికెట్లు సమర్పించుకున్నారు. డుమిని(25), అరంగేట్రం ఆటగాడు కాయ జొండో(25) ఓ దశలో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరు కలిసి ఐదో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కుదురుకున్న ఈ జోడీని చాహల్ విడగొట్టాడు. వరస ఓవర్లలో ఔట్ చేసి దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బకొట్టాడు. జొండో..పాండ్యా క్యాచ్ ద్వారా ఔటైతే..డుమిని వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు. మరోవైపు కుల్దీప్..రబాడ(1)ను పెవిలియన్ పంపాడు. ఇదే అదునుగా మరింత జోరు పెంచిన చాహల్..ఆఖరి వరుస బ్యాట్స్‌మెన్ మోర్కెల్(1), మోరిస్(14)ను ఔట్ చేసి చాహల్ తన వన్డే కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసుకున్నాడు. చాహల్, కుల్దీప్ స్పిన్ దెబ్బకు దక్షిణాఫ్రికా 19 పరుగుల తేడాతో ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయి సొంతగడ్డపై అత్యల్ప స్కోరును మూటగట్టుకుంది.

ఆడుతూ పాడుతూ: దక్షిణాఫ్రికా నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. హిట్‌మన్ రోహిత్(15) ఓ భారీ సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. తానేం తక్కువ కాదన్నట్లు ధవన్(51 నాటౌట్) చెలరేగాడు. రబాడ బౌన్సర్ ఆడే క్రమంలో మోర్కెల్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కెప్టెన్ కోహ్లీ(46 నాటౌట్) ధవన్‌కు జతకలిశాడు. ఓవైపు లక్ష్యం చిన్నది కావడంతో సఫారీలు చేష్టలుడిగిపోయారు. ఫామ్‌మీదున్న కోహ్లీకి ధవన్ అండగా నిలిచాడు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ అర్ధసెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్ విరామం తర్వాత తాహిర్ బౌలింగ్‌లో కోహ్లీ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు.



కుల్దీప్ యాదవ్ (6-0-20-3)

"పరుగుల నియంత్రణ గురించి ఎప్పుడు పట్టించుకోను. వికెట్లు తీయడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతాను. బ్యాట్స్‌మెన్ గురించి బాగా ఆలోచిస్తే సామర్థ్యం మేరకు రాణించలేకపోతాం. ఐపీఎల్‌లో బెంగళూరు తరపున చిన్నస్వామి స్టేడియంలో ఫ్లాట్‌వికెట్‌పై వికెట్లు పడగొట్టిన అనుభవం ఇప్పుడు పనికొస్తున్నది.

1 — ఆసియా బయట భారత స్పిన్నర్ల అత్యుత్తమ ప్రదర్శన ఇది. దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో చాహల్, కుల్దీప్ ఎనిమిది వికెట్లు పడగొట్టారు.

118 — సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు. గతం(2009)లో ఇంగ్లండ్‌పై 119 పరుగులకు ఆలౌటైంది. ఓవరాల్‌గా వన్డేల్లో సఫారీలకు ఇది ఎనిమిదో స్వల్ప స్కోరు.

5/22 — దక్షిణాఫ్రికా గడ్డపై స్పిన్నర్‌గా చాహల్ రెండో అత్యుత్తమ(5/22) ప్రదర్శన నమోదు చేశాడు. కేప్‌టౌన్(2002)లో నికీ బోయే(5/21) ఇప్పటివరకు అత్యుత్తమం.

2009 — డివిలీయర్స్, డుప్లెసిస్ లేకుండా దక్షిణాఫ్రికా వన్డేల్లో బరిలోకి దిగడం 2009 తర్వాత ఇదే తొలిసారి.

స్కోరుబోర్డు:

దక్షిణాఫ్రికా: ఆమ్లా(సి)ధోనీ(బి)భువనేశ్వర్ 23, డికాక్(సి)హార్దిక్(బి)చాహల్ 20, మర్క్రామ్(సి)భువనేశ్వర్(బి)కుల్దీప్ 8, డుమిని(ఎల్బీ)చాహల్ 25, మిల్లర్(సి)రహానే(బి)కుల్దీప్ 0, జొండో(సి)హార్దిక్(బి)చాహల్ 25, మోరిస్(సి)భువనేశ్వర్(బి)చాహల్ 14, రబాడ(ఎల్బీ)కుల్దీప్ 1, మోర్కెల్(ఎల్బీ)చాహల్ 1, తాహీర్(బి)బుమ్రా 0, శంసీ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 1; **మొత్తం:** 32.2 ఓవర్లలో 118 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-39, 2-51, 3-51, 4-51, 5-99, 6-107, 7-110, 8-117, 9-118, 10-118; **బౌలింగ్:** భువనేశ్వర్ 5-1-19-1, బుమ్రా 5-1-12-1, హార్దిక్ 5-0-34-0, చాహల్ 8.2-1-22-5, కుల్దీప్ 6-0-20-3, జాదవ్ 3-0-11-0.

భారత్: రోహిత్‌శర్మ(సి)మోర్కెల్(బి)రబాడ 15, ధవన్ 51 నాటౌట్, కోహ్లీ 46 నాటౌట్; ఎక్స్‌ట్రాలు: 7; **మొత్తం:** 20.3 ఓవర్లలో 119/1; **వికెట్లపతనం:** 1-26; **బౌలింగ్:** మోర్కెల్ 4-0-30-0, రబాడ 5-0-24-1, మోరిస్ 3-0-16-0, తాహిర్ 5.3-0-30-0, శంసీ 3-1-18-0.

నేటి నుంచి మహిళల పోరు

- భారత్-దక్షిణాఫ్రికా తొలి వన్డే
- ప్రపంచకప్ అర్హతకు కీలకం



కింబర్లీ: ఆరునెలల విరామం తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు మళ్లీ బరిలోకి దిగుతున్నది. మిథాలీ రాజ్ నాయకత్వంలోని జట్టు, వాన్ నీకెర్క్ సారథ్యంలోని సఫారీలతో తలపడేందుకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా సోమవారం నుంచి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ (ఫిబ్రవరి 5, 7, 10) మొదలవుతున్నది. ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత్..ఆ తర్వాత మరే అంతర్జాతీయ టోర్నీలోనూ ఆడలేదు. ఇక ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2021కి అర్హత సాధించేందుకు ఈ మూడు వన్డేల సిరీస్ ఇరుజట్లకూ ఒక చక్కటి అవకాశం కానున్నది. దక్షిణాఫ్రికాతో ఆడటం పెద్ద సవాల్ లాంటిదని, జట్టులోని ఆటగాళ్లు తిరిగి పుంజుకోవడానికి ఇదొక మంచి అవకాశమని భారత కెప్టెన్ మిథాలీ తెలిపింది. "మహిళల క్రికెట్‌కు ఇప్పుడు ఆదరణ పెరుగుతున్నది. మేము ఆడే ప్రతి మ్యాచ్‌ను అభిమానులు, విమర్శకులు, దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్నారు. ఇది మాపై మరింత బాధ్యతను పెంచింది. దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్టుతో ఆడటం వల్ల మా సామర్థ్యాలను పరీక్షించుకోవచ్చు. బౌలర్లు కూడా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లో సత్తాచాటాలి." అని మిథాలీ పేర్కొన్నది.

జెమీమాపైనే అందరి కండ్లు:
జెమీమా రోడ్రిగ్యుజ్..పదిహేడేండ్ల ముంబై విద్యార్థిని. అండర్-19 మహిళల దేశవాళీ టోర్నీలో డబుల్ సెంచరీ సాధించి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. కెరీర్ ఆరంభంలో ఫుట్‌బాల్, హాకీలోనూ సత్తా చాటింది. మహారాష్ట్ర అండర్-17 మహిళల హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత పూర్తిగా క్రికెట్‌పైనే దృష్టి పెట్టి రికార్డులు కొల్లగొడుతున్నది. ఓపెనింగ్ బ్యాట్స్‌వుమన్‌గా, ఆఫ్ బ్రేక్ బౌలర్‌గా సత్తా చాటుతున్న జెమీమా ప్రస్తుత భారత జట్టులో అత్యంత పిన్న వయస్కురాలు.

భారత జట్టు: మిథాలీ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్, తనియా, ఏక్తా, రాజేశ్వరి, గోస్వామి, వేద, మందన, మోనా, శిఖా, పూనమ్, జెమీమా, దీప్తి, పూజ, సుష్మా, యాదవ్

ఐసీసీ అండర్ -19 జట్టులో ఐదుగురు భారత కుర్రాళ్లు



పృథ్వీషా

దుబాయ్: అండర్-19 ప్రపంచకప్‌ను రికార్డు స్థాయిలో నాలుగో సారి దక్కించుకున్న యువ భారత్ జట్టు ఐసీసీ వరల్డ్ ఎలెవన్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. తాజాగా ముగిసిన జూనియర్ ప్రపంచకప్‌లో సత్తాచాటిన క్రికెటర్లతో కూడిన జట్టును ఐసీసీ ఆదివారం ప్రకటించింది. ఇందులో చాంపియన్‌గా నిలిచిన భారత్ నుంచి ఏకంగా ఐదుగురు క్రికెటర్లు కెప్టెన్ పృథ్వీషా, మన్‌జ్యోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, అనుకూల్ రాయ్, కమలేశ్ నాగర్‌కోటి ఐసీసీ ఎలెవన్‌లో చోటు దక్కించుకున్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన రేనార్డ్ వాన్‌డర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి క్వాయిస్ అహ్మద్ ఏకైక క్రికెటర్‌గా ఫైనల్ ఎలెవన్‌లో నిలిచాడు.

ఐసీసీ అండర్-19 వరల్డ్ టీమ్: పృథ్వీషా, మన్‌జ్యోత్ కల్రా, శుభ్‌మన్ గిల్, ఫిన్ అలెన్(న్యూజిలాండ్), రేనార్డ్ వాన్‌డర్(కెప్టెన్), వాండైల్ మక్వెటు, గెరాల్డ్ కొట్జె(దక్షిణాఫ్రికా), అనుకూల్ రాయ్, కమలేశ్ నాగర్‌కోటి, క్వాయిస్ అహ్మద్(ఆఫ్ఘనిస్థాన్), షాహీన్ అఫ్రిదీ(పాకిస్థాన్), అలిక్(వెస్టిండీస్, 12వ ఆటగాడు).

ఇంకా కోలుకోని సానియా..



గ్రేటర్ నోయిడా: భారత టెన్నిస్ క్వీన్ సానియా మీర్జాను గాయాలు వేధిస్తూనే ఉన్నాయి. గత అక్టోబర్ నుంచి మోకాలి గాయంతో బాధపడుతున్న సానియా..పూర్తిగా కోలుకుని కోర్టులో అడుగుపెట్టడానికి మరో రెండు నెలల సమయం పట్టే అవకాశమున్నది. గాయం కారణంగా ఈ యేడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సానియా దూరమైన సంగతి తెలిసిందే. ఆదివారం సూపర్ టెక్ స్పోర్ట్స్ విలేజ్‌లో సందడి చేసిన సానియా మీడియాతో మాట్లాడింది. 'గాయం నుంచి కోలుకునేందుకు మరికొంత సమయం పట్టే అవకాశముంది. శస్త్రచికిత్స అవసరమైనా ఆ తర్వాత పూర్తిగా నయమవుతుందన్న నమ్మకం లేదు. గాయపడటం నాకు ఇది కొత్తేం కాదు. ఇప్పటికే మూడు సార్లు శస్త్రచికిత్సలు జరిగాయి. ఒక అథ్లెట్‌గా పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో బరిలోకి దిగేందుకు శారీరకంగా కంటే మానసికంగా ధృడంగా ఉండాలి' అని సానియా అంది.

దేశవాళీ ధమాకా మొదలు..

- నేటి నుంచి విజయ్‌హజారే వన్డే టోర్నీ
- బరిలో 28 జట్లు, 91 మ్యాచ్‌లు, ఫిబ్రవరి 26న ఫైనల్



హైదరాబాద్: రంజీ వన్డే ట్రోఫీగా ప్రసిద్ధికెక్కిన విజయ్ హజారే టోర్నీ నేటి నుంచి ప్రారంభమవుతుంది. మొత్తం నాలుగు గ్రూపుల్లోని 28 జట్లు మొదట రౌండ్ రాబిన్‌లీగ్ మ్యాచుల్లో పాల్గొంటాయి. ఆ తర్వాత నాకౌట్ పద్ధతిన క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ జరుగుతాయి. తమిళనాడు జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా..వరుసగా రంజీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలు గెలిచిన విదర్భ మరో సంచలనానికి సిద్ధమైంది. బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ జట్లు కూడా ఫేవరెట్స్‌గా కనిపిస్తున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, నడున్, ధర్మశాల(హిమాచల్‌ప్రదేశ్), బిలాస్‌పూర్(ఛత్తీస్‌ఘఢ్), అలూరు, బెంగళూరు (కర్ణాటక), చెన్నై వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.

హైదరాబాద్‌లో నేటి మ్యాచ్‌ల వివరాలు: ఫిబ్రవరి 5: ఛత్తీస్‌ఘఢ్ వర్సెస్ సౌరాష్ట్ర (జింఖానా గ్రౌండ్), హైదరాబాద్ వర్సెస్ సర్వీసెస్ (ఉప్పల్ స్టేడియం), జార్ఖండ్ వర్సెస్ విదర్భ (సికింద్రాబాద్).

సింధు మరో'సారీ'..

- ఫైనల్లో బీవెన్ చేతిలో పరాజయం
- గతేడాది నుంచి నాలుగో ఫైనల్ ఓటమి
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఇండియా ఓపెన్ ఫైనల్లో పరాజయం పాలైంది. ఉత్కంఠపోరులో అమెరికన్ షట్లర్ బీవెన్ జంగ్ చేతిలో ఓటమి చవిచూడటంతో రన్నరప్‌గా నిలిచి రజతంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన తుదిపోరులో సింధు 18-21, 21-11, 20-22తో పోరాడి ఓడింది.

ఫైనల్ ఫోబియా : సింధు ఫైనల్ పరాజయాల పరంపర కొనసాగుతున్నది. గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్, హాంకాంగ్ ఓపెన్, దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో ఓడిన ఈ భారత స్టార్ షట్లర్ నాలుగోసారి తుదిపోరులో తడబడింది. తొలి గేమ్‌లో ఆరంభం నుంచి ఆధిక్యం ప్రదర్శించిన బీవెన్‌కు సింధు గట్టిపోటీ ఇచ్చినా, పాయింట్స్ కోసం వీడియో రెఫరల్స్‌కు వెళ్లినా, ప్రత్యర్థిని అడ్డుకోలేకపోయింది. రెండో గేమ్‌లో తిరిగి పుంజుకున్న సింధు తొలుత 8-2 ఆధిక్యాన్ని ప్రదర్శించి అదే దూకుడుతో గేమ్‌ను గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఇద్దరూ పదునైన స్మాష్‌లతో పోటీ పడగా బీవెన్ ఆధిక్యంలో కొనసాగింది.

మీడియాకు దూరంగా..మ్యాచ్ ఓటమి అనంతరం సింధు మీడియా సమావేశంలో పాల్గొనాల్సి ఉండగా, అందుకు ఆమె హాజరుకాలేదు. అంతకు ముందు రోజు క్వార్టర్ ఫైనల్ ఓటమి అనంతరం సైనా నెహ్వాల్ కూడా మీడియాకు దూరంగా ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



కోల్‌కతా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ ఈవెంట్‌లో పాల్గొన్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.

ఆదివారం జరిగిన బిగ్ బాష్ ప్రీమియర్ లీగ్(బీబీఎల్) ఫైనల్లో అడిలైడ్ స్ట్రైకర్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో హోబర్ట్ హరికేన్స్‌పై అడిలైడ్ జట్టు 25 పరుగుల తేడాతో విజయం సాధించింది.





యాదాద్రిలో కిక్కిరిసిన భక్తజనం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. మేడారం జాతరకు వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో శ్రీవారిని దర్శించుకోవడానికి రాగా, యాదాద్రి ఆదివారం సందడిగా మారింది. ఉదయం నుంచే భక్తులు విష్ణుపుష్కరిణిలో స్నానాలుచేసి, స్వామి వారి దర్శనం కోసం క్యూకట్టారు. తలనీలాలు సమర్పించారు. ఆదివారం ఒక్క రోజే రూ.23.86 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

- యాదాద్రిభువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ



కొమురవెల్లిలో భక్తుల సందడి

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆదివారం జాతర కావడంతో దాదాపు 40వేల మంది మల్లన్నను దర్శించుకున్నారు. కోనేటిలో స్నానాలు చేసి, స్వామివారిని దర్శించుకోవడంతోపాటు బోనాలు సమర్పించారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, కేశ ఖండన తదితర మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు.

– చేర్యాల, నమస్తే తెలంగాణ

పేదలను ఆదుకునేందుకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు

మంత్రి ఈటల రాజేందర్



పరకాల-హుజూరాబాద్ నాలుగు వరుసల రహదారిలో శనిగరం, నడికుడ వాగులపై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల రాజేందర్

కమలాపూర్ (వరంగల్)/హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: పేద ప్రజలను ఆదుకునేందుకే డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా మండలం మర్రిపెల్లిగూడెంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, పరకాల-హుజూరాబాద్ నాలుగు లైన్ల రహదారిపై శనిగరం, నడికుడ వాగులపై హైలెవల్ వంతెనల నిర్మాణం చేపట్టేందుకు ఆదివారం మంత్రి శంకుస్థాపనలు చేశారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.83 లక్షలతో నిర్మించనున్న గోదాం, ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఈటల మాట్లాడుతూ.. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేయడం చరిత్రపుటల్లో లిఖించవచ్చని తెలిపారు. కల్యాణలక్ష్మి, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్షం కురిసి వరదలు వస్తే వాగులు దాటకుండా రవాణా సౌకర్యం నిలిచిపోయేదని గుర్తుచేశారు. మన సొమ్ముతో వాళ్లు సోకులు చేసుకునేవారన్నారు.



వికారాబాద్ జిల్లా పరిగిలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి

వైశ్యుల సంక్షేమానికి తోడ్పాటు

అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి

పరిగి, నమస్తే తెలంగాణ : వైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందేలా కృషి చేస్తానని అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా పరిగిలో జరిగిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 4వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య మాట్లాడుతూ వైశ్యులలోనూ పేదవారు ఉన్నారని, వారందరికీ బాసటగా నిలువాలని సూచించారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు.



ఆవంచలో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

ఆయూష్ దేశీయ వైద్యమే

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

తిమ్మాజిపేట: ఆయూష్ దేశీయ వైద్యమనీ, భారతీయ వైద్యం వైపు ప్రపంచం చూస్తున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణను ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో ఆయుష్ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు చేయూతనిచ్చేందుకు త్వరలో నాన్ కమ్యూనికబుల్ డీసీస్(ఎన్సీడీ) కిట్లను ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కిట్టు ప్రవేశపెట్టిన తరువాత ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరిగాయన్నారు.



ఎస్సారెస్పీ కాల్వలో శ్రమదానం చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్

ప్రాజెక్టులు లేకనే ఇంతకాలం నీటి కష్టాలు

ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం సమీపంలోని ఎస్సారెస్పీ డి-76, 77 కాల్వకు రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆదివారం కొప్పుల ఈశ్వర్ శ్రమదానం నిర్వహించారు. రెండు కిలో మీటర్ల మేర కాల్వలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ప్రాజెక్టులు చేపట్టకపోవడంతో ఇంతకాలం సాగునీటి కష్టాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న మంత్రి జోగు రామన్న



కామారెడ్డి జిల్లా దుర్కి గ్రామంలో మంత్రి పోచారం సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



ఖమ్మం జిల్లా చింతకాని మండలం అనంతసాగర్‌లో టీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గులాబీ పార్టీలో చేరికల జోష్

- ప్రధాన పార్టీల నుంచి వలసలు
- మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల సమక్షంలో చేరిక

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

టీఆర్ఎస్‌లో రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. సీఎం కేసీఆర్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులైన ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు ఆదివారం పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరారు కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో 40మంది ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు అటవీ శాఖ మంత్రి జోగు రామన్న సమక్షంలో గులాబీ గూటికి చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో సుమారు 20 మంది కాంగ్రెస్, టీడీపీ సీనియర్ కార్యకర్తలు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో, బాదేపల్లి పట్టణం రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన మసీద్ కమిటీ సభ్యులు సుమారు 100 మంది మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు బాద్మి శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలో సుమారు 2 వేల మంది కాంగ్రెస్ నాయకులు, బాన్సువాడలో నిజామాబాద్ జిల్లా వర్ని మండలానికి చెందిన 80మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లోకి చేరగా వీరికి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం జిల్లా చింతకాని, రఘునాథపాలెం మండలాలకు చెందిన సుమారు 250 కుటుంబాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నాయి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ సమక్షంలో ఎంసీపీఐకి చెందిన పలువురు ముఖ్యనాయకులు, వనపర్తి జిల్లా కొత్తకోట మండలానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ గీతావాణి బాలస్వామితో పాటు 100 మంది టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం అన్నసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

జాతర ముగిసినా తగ్గని రద్దీ



ఆదివారం మేడారం సమ్మక్క-సారక్క గద్దెల ప్రాంగణం వద్ద భక్తుల సందడి

ములుగు, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క-సారక్క మహాజాతర శనివారం ముగిసినప్పటికీ ఆదివారం కూడా దాదాపు రెండు లక్షలమంది భక్తులు గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన పూజారులను జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కర్ణన్ ఆదివారం గద్దెల ప్రాంగణంలో శాలువాలతో సన్మానించారు. జాతరలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెకు ఆఫీసర్ చక్రధర్‌రావు ప్రశంసించారు.

అంతా తల్లుల మహిమే

మేడారం మహాజాతర సక్సెస్: మంత్రి అల్లోల

మాక్లూర్ / ఆర్మూరుటౌన్: తల్లుల మహిమ వల్లే మేడారం మహాజాతర విజయవంతమైందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. దాదాపు 1.25 కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాతర ప్రశాంతంగా ముగిసిందన్నారు. జాతర విజయవంతానికి కృషిచేసిన అందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మాక్లూర్, ఆర్మూరులో విలేకరులతో మాట్లాడారు. మేడారం జాతరకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రావడంతో అమ్మల ప్రాముఖ్యత దేశానికంతటికి తెలిసిందన్నారు. జాతరకు జాతీయ హోదా కల్పించడానికి సీఎం కేసీఆర్ త్వరలోనే ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేస్తారని తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఉన్నారు.



నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

జ్ఞాన సమాజాన్ని నిర్మిద్దాం

స్వేరోస్ జ్ఞానమహాయజ్ఞం సదస్సులో వక్తల పిలుపు



సదస్సులో జాతీయ నాయకులకు నివాళులర్పిస్తున్న గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ కమిషన్ సభ్యులు ఆంజనేయులుగౌడ్


అలంపూర్, నమస్తే తెలంగాణ: అక్షరాలే లక్ష వరాలని, చదువుతోనే జ్ఞానం వస్తుందని, జ్ఞాన సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని జ్ఞానమహా యజ్ఞం సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఆదివారం రాత్రి సదస్సు నిర్వహించారు. గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆట, పాటలతో సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సదస్సులో గురుకులాల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ కమిషన్ సభ్యులు ఆంజనేయులుగౌడ్, పగిడిపాటి దేవయ్య, మాజీ డీజీపీ ప్రసాదరావు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు పాల్గొన్నారు.

మార్చి 11న ఓరుగల్లులో కాకతీయ లలిత కళావైభవం



వరంగల్ కోటలోని చారిత్రక ప్రాంతాలను పరిశీలిస్తున్న టీ సుబ్బరామిరెడ్డి, ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీపీ సుధీర్‌బాబు

ఖిలావరంగల్ (వరంగల్): చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలో మార్చి 11న టీఎస్ఆర్ కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో కాకతీయ లలిత కళా వైభవ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సినీ నిర్మాత టీ సుబ్బరామిరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ పోలీసు కమిషనర్ జీ సుధీర్‌బాబు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఈగ మల్లేశం ఆదివారం ఖిలావరంగల్ కోటలో స్థల పరిశీలన జరిపి కీర్తి తోరణాల సమీపంలోని ఖుష్‌మహల్ ప్రాంగణాన్ని ఎంపిక చేశారు.



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

గౌరవెల్లి నిర్వాసితుల చొరువ భేష్

హుస్నాబాద్, నమస్తే తెలంగాణ/అక్కన్నపేట: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెల్లి రిజర్వాయర్ భూనిర్వాసితులు తిరిగి ఒకేచోట నివాసం ఉండాలని భావించారు. ముంపునకు గురయ్యే గుడాటిపల్లి, తెనుగుపల్లికి చెందిన 300 కుటుంబాల వారు సొంతంగా కాలనీ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వం అందించిన పరిహారంతో గౌరవెల్లి శివారులో 17 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇక్కడ కాలనీ నిర్మాణానికి ఆదివారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చేతుల మీదుగా భూమి పూజ చేయించారు.

సౌర విద్యుత్‌పై నజర్

సింగరేణి ఆధ్వర్యంలో విరివిరిగా ప్లాంట్లు.. 500 మెగావాట్ల ఉత్పత్తికి ప్రణాళికలు

శ్రీరాంపూర్, జైపూర్ పవర్‌ప్లాంట్లలో ఇప్పటికే ఏర్పాటు





శ్రీరాంపూర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోలార్ పవర్‌ప్లాంటుకు భూమిపూజ చేస్తున్న అధికారులు (ఫైల్).. సోలార్ పవర్ ప్యానెల్స్

మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడానికి సింగరేణి మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటివరకు బొగ్గు ఆధారిత విద్యుత్ తయారు చేసున్న ఈ సంస్థ తాజాగా సౌర విద్యుత్‌పైనా ఆసక్తి చూపుతున్నది. థర్మల్ విద్యుత్ కేంద్రాలు విజయవంతం కావడంతో సౌర విద్యుత్ ప్రాజెక్టులపైనా దృష్టి సారించింది. దీని ద్వారా ఖర్చు తక్కువ కావడం, వచ్చిన విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో ప్లాంట్లను నెలకొల్పి 500 మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు.

అన్ని ఏరియాల్లో ప్లాంట్ల ఏర్పాటు

సింగరేణిలోని అన్ని ఏరియాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు నెలకొల్పేందుకు రంగం సిద్ధం చేశారు. పదకొండు ఏరియాల్లో అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే రామగుండం, మందమర్రి ప్రాంతాల్లో మొదటి విడుత కింద 50 మెగావాట్ల చొప్పున కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నది. రామగుండం ప్రాంతంలోని రామగిరి కాలనీలో సోలార్ ప్లేట్లను బిగించనున్నారు. మందమర్రిలోనూ 50 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. జైపూర్ విద్యుత్ కేంద్రం ఆవరణలోనూ ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. బొగ్గు ఉత్పత్తి రంగంలో అపార అనుభవం ఉన్న సింగరేణి సంస్థ విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ అడుగుపెట్టిన విషయం తెలిసిందే. 2010లో జైపూర్ వద్ద 600 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్ల నిర్మాణం చేపట్టి 2016 ఆగస్టు 7న ఉత్పత్తిని మొదలుపెట్టింది. ఇటీవల సౌర విద్యుత్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించింది.

సింగరేణికి కోట్లాది రూపాయలు ఆదా..

సింగరేణి వ్యాప్తంగా ఏర్పాటు కానున్న సోలార్‌పవర్ ప్లాంట్ల ద్వారా సంస్థకు కోట్లాది రూపాయలు ఆదా కానున్నది. ఇప్పటివరకు సింగరేణి కేవలం విద్యుత్ మీదే ఏటా రూ.వందల కోట్లు వెచ్చించింది. జైపూర్ పవర్ ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సింగరేణికి రూ.వందల కోట్ల ఆదాయం వస్తున్నది. బొగ్గు ఆధారిత వినియోగం వల్ల ఖర్చు పెరుగుతుంది. కానీ, సోలార్ పవర్ వల్ల ప్రకృతిపరంగా సూర్యరశ్మితో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు తక్కువ రేటు, పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని సింగరేణి అధికారులు స్పష్టం చేస్తున్నారు. సహజ వనరులను వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని భావిస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది చివరికల్లా అన్ని ఏరియాల్లో సోలార్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో పైలట్ ప్రాజెక్టు..

శ్రీరాంపూర్ ఏరియాలో సోలార్‌పవర్ ప్రాజెక్టు ఏర్పాటుచేయాలని యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో 100 కిలోవాట్ల ప్లాంట్ నెలకొల్పుతున్న కంపెనీ దీన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. ఈ వంద కిలోవాట్ల విద్యుత్ ప్రాజెక్టు కోసం రూ.70 లక్షలు వెచ్చించనుంది. ఇందులో ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌లో 80శాతం సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల అవసరాలకు, హాస్టల్‌కు, మిగితా 20శాతం సింగరేణి ఉన్నత పాఠశాల, ఇతర విభాగాల అవసరాలకు వినియోగించనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే డివిజన్‌లో మరో మూడు చోట్ల ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. అన్ని కాలనీల్లో విద్యుత్ లైట్లు, జీఎం కార్యాలయం, ఓసీపీ, సీహెచ్‌పీ, ఇతర విభాగాల అవసరాలను సోలార్ పవర్‌తో తీర్చాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే మరో మూడు సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభించనున్నారు.



సిరియాలో రష్యా జెట్ కూల్చివేత

■ పైలట్‌ను సజీవ దహనం చేసిన ముష్కరులు
■ ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో రెచ్చిపోయిన హెచ్‌టీఎస్ ఉగ్రవాదులు

డమస్కస్, ఫిబ్రవరి 4: రష్యాకు చెందిన యుద్ధ విమానాన్ని సిరియా తిరుగుబాటుదారులు కుప్పకూల్చారు. అందులోని పైలట్‌ను సజీవంగా దహనం చేశారు. ఈ ఘటన సిరియాలోని ఉత్తర ఇడ్లిబ్ ప్రావిన్స్‌లో చోటు చేసుకుంది. భుజం పైనుంచి ప్రయోగించే క్షిపణుల ద్వారా రష్యా జెట్‌ను నేలకూల్చారు. కూలిపోయే ముందు ప్యారాచూట్ సాయంతో కిందికి దిగిన పైలట్‌ను ఉగ్రవాదులు సజీవదహనం చేశారు. ఈ ఘటనను రష్యా రక్షణ శాఖ కూడా ధ్రువీకరించింది. ఇడ్లిబ్ ప్రాంతంలో తమ జెట్‌ను పోర్టబుల్ యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ మిసైల్‌తో కూల్చివేసినట్లు తెలుస్తున్నదని రష్యన్ ఏజెన్సీలు వెల్లడించాయి. ఈ ఘటనపై అమెరికా కూడా విచారం వ్యక్తం చేసింది. ఉగ్రవాదులు అలాంటి ఆయుధాలు ఉపయోగించడం ఆందోళన కలిగిస్తున్నదని అమెరికా పేర్కొంది. మరోవైపు, ఇడ్లిబ్ ప్రాంతంలో రష్యా జెట్ కూల్చివేత తమ పనేనని హయత్ తెహ్రీర్ అల్-ష్యామ (హెచ్‌టీఎస్) అనే ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. రష్యా దాడులకు వ్యతిరేకంగానే వారి యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు హెచ్‌టీఎస్ పేర్కొంది.

ట్రంప్‌కు మద్దతుగా భారతీయ అమెరికన్ల ర్యాలీ

ప్రతిభ ఆధారిత వలస విధానంపై హర్షం

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్ విధానాన్ని తీసుకురావాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి మద్దతుగా అమెరికాలోని భారతీయులు ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్‌లోని శ్వేతసౌధం ముందు శనివారం నిర్వహించిన ఈ ర్యాలీలో భారతీయ అమెరికన్లు ప్లకార్డులతో ట్రంప్‌నకు మద్దతు తెలిపారు. ర్యాలీలో పాల్గొన్నవారిలో ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉన్నారు. తమ దేశాన్ని ప్రేమించేవారు, గౌరవించేవారు, తమ సమాజం కోసం పాటు పడేవారు, ప్రతిభావంతుల కోసం ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్ విధానాన్ని తీసుకురానున్నట్లు, లాటరీ వీసా వ్యవస్థకు తాను ముగింపు పలుకబోతున్నట్లు గతవారం కాంగ్రెస్ ఉభయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న భారతీయులు హర్షం వ్యక్తంచేశారు. గ్రీన్ కార్డు కోసం వేచిచూస్తున్న అమెరికాలోని అనేక మంది భారతీయ కుటుంబాలు శ్వేతసౌధం ముందు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నాయి. వీసా పరిమితి ఎత్తివేయాలని, ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్‌కు తాము మద్దతు తెలుపుతున్నామని ప్లకార్డులను ప్రదర్శించారు. 'ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్ అమలు కోసం మేం ఎదురుచూస్తున్నాం. ఎంతోమంది గ్రీన్‌కార్డు కోసం వేచిచూస్తున్న ప్రతిభావంతులైన భారతీయ అమెరికన్లకు ఇది తోడ్పడుతుంది. ఈ విధానం అమెరికా శ్రేయస్సుకు, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది' అని రిపబ్లికన్ హిందూ అలయెన్స్ పొలిటికల్ డైరెక్టర్ కృష్ణా బన్సాల్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ తాజాగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల అమెరికాలో శాశ్వతం నివాసం ఏర్పరచుకునేందుకు వేచిచూస్తున్న అనేక మంది ప్రతిభావంతులైన భారతీయులకు మార్గం సుగమం కానుందని పలువురు భావిస్తున్నారు.



వైట్‌హౌస్ ఎదుట జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న భారతీయ అమెరికన్లు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరిని హతమార్చిన మావోయిస్టులు

■ దండకారణ్యం కేంద్రంగా విధ్వంసం
■ నేడు బంద్.. రాష్ట్ర పోలీసులు అప్రమత్తం



దంతెవాడలో మావోయిస్టులు దహనం చేసిన రోడ్డు నిర్మాణ వాహనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ దండకారణ్య పరిధిలో సోమవారం బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. బంద్ విజయవంతానికి ఒక రోజు ముందే మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లా కట్టేకళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఆదివారం తెల్లవారుజామున ప్రయాణికుల బస్సును తగులబెట్టారు. అయితే ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ట్యాక్సీ డ్రైవర్ మనోజ్ ముడియామీని కాల్చి చంపారు. వారం క్రితం జవాన్ సీతారామ్‌ను కిడ్నాప్ చేసి, అదే ప్రాంతంలో హత్య చేసి మృతదేహాన్ని రోడ్డుపై పడేశారు. వివిధ అభివృద్ధి పనుల కోసం దంతెవాడ జిల్లాలో జరుగుతున్న నిర్మాణ పనులకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలను తగులబెట్టారు. సోమవారం మావోయిస్టుల బంద్ నేపథ్యంలో భద్రాద్రి– కొత్తగూడెం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం పోలీస్ స్టేషన్లతోపాటు, మన రాష్ట్ర సరిహద్దులోని అడవుల్లో భారీగా పోలీసు బలగాలను మోహరింపజేశారు. మావోయిస్టులు రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశించకుండా ప్రత్యేక నిఘాతో గాలింపు ముమ్మరం చేసినట్లు భద్రాచలం ఏఎస్పీ సునీల్‌దత్ చెప్పారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లాలో ఆదివారం ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. జిల్లా ఎస్పీ అభిషేక్ పల్లవ్, ఇతర అధికారుల సమక్షంలో బస్తర్ జిల్లా తూర్పు డివిజన్ పరిధిలో చురుగ్గా వ్యవహరిస్తున్న సుధాకర్ అలియాస్ ఉమేశ్ కుమేటి (18), బయానర్ స్థానిక కమిటీ సభ్యుడు (17)తోపాటు కిందిస్థాయి సభ్యుడు పాండ్రు రామ్ సోరి (25) లొంగిపోయారు. సుధాకర్ అలియాస్ ఉమేశ్ కుమేటిపై రూ.8 లక్షల నగదు రివార్డు, మరో సభ్యుడిపై రూ.3 లక్షల రివార్డు ఉంది. వీరు ముగ్గురికి తేతాం, ఇర్పానర్, తుస్వాల్ గ్రామాల పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్లతో సంబంధం ఉన్నదని ఎస్పీ తెలిపారు. ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం వారికి వసతులు కల్పిస్తామన్నారు.

తైవాన్‌లో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదు

తైపీ: తైవాన్ తూర్పు తీర ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.1గా నమోదైంది. హువలీన్ నగరానికి 15 కిమీ దూరంలో.. ఎనిమిది కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతమైందని చెప్పారు. నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.



గూడ్స్ రైలును ఢీకొని పక్కకు ఒరిగిన ప్రయాణికుల రైలు

అమెరికాలో ఢీకొన్న రైళ్లు

ఇద్దరు మృతి

వాషింగ్టన్: అమెరికాలోని కొలంబియా సమీపంలో రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, సుమారు 70 మంది గాయపడ్డారు.ఎదురుగా వస్తున్న గూడ్స్ రైలును ప్రయాణికుల రైలు ఢీకొని పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో రైలు వెనక బోగీలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో రైలులో 8 మంది సిబ్బందితో పాటు 139 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఇస్రోలో 106 సైంటిస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' పోస్టుల భర్తీకి ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఐసీఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

- బీఈ/బీటెక్ అభ్యర్థులకు అవకాశం
- రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- ప్రారంభ వేతనం నెలకు రూ. 56,100/-



వివరాలు:

ఇస్రో కేంద్రప్రభుత్వ పరిధిలోని సంస్థ. అంతరిక్షానికి సంబంధించిన పరిశోధనలు, అభివృద్ధి తదితర కార్యకలాపాలను ఇస్రో చేపడుతుంది.

పోస్టులు – ఖాళీలు:
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (ఎలక్ట్రానిక్స్) – 32 ఖాళీలు. వీటిలో ఓహెచ్ –4 (బ్యాక్‌లాగ్), హెచ్‌హెచ్ – 5 కేటగిరీకి కేటాయించారు.
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (మెకానికల్) – 45 ఖాళీలు. వీటిలో ఓహెచ్ –4 (బ్యాక్‌లాగ్), హెచ్‌హెచ్ – 1 కేటగిరీకి కేటాయించారు.
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (కంప్యూటర్ సైన్స్) – 29 ఖాళీలు. వీటిలో పీహెచ్‌సీలోని ఓహెచ్ –1 (బ్యాక్‌లాగ్), హెచ్‌హెచ్ – 1, వీహెచ్ – 2 కేటాయించారు.
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా తత్సమాన కోర్సులో ఫస్ట్‌క్లాస్‌లో (65 శాతం/తత్సమాన సీజీపీఏ) ఉత్తీర్ణత. 2017-18 విద్యాసంవత్సరంలో పై కోర్సులు పూర్తవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయస్సు:** ఫిబ్రవరి 20 నాటికి 35 ఏండ్లు మించరాదు. రిజర్వ్‌డ్ కేటగిరీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- **ఎంపిక:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మొదట స్క్రీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ తయారుచేస్తారు. ఆ తర్వాత వీరు రాతపరీక్ష రాయాలి.
- **రాతపరీక్ష:** ఏప్రిల్ 22న దేశవ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తారు.
- రాతపరీక్షలో 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు సమాన మార్కులు కేటాయిస్తారు.
- రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్వ్యూకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు.
- ఇంటర్వ్యూలో కనీసం 60 శాతం మార్కులు సాధించినవారిని ఫైనల్ సెలక్షన్ ప్యానెల్‌కు ఎంపిక చేస్తారు. ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు చేపడుతారు.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చండీగఢ్, చెన్నై, గువాహటి, కోల్‌కతా, లక్నో, ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
- **పే, అలవెన్స్‌లు:** సైంటిస్ట్/ఇంజినీరింగ్ పోస్టులకు పే మ్యాట్రిక్స్ లెవల్10 కింద జీతభత్యాలు ఇస్తారు.
- ప్రారంభ వేతనం (బేసిక్ పే) రూ. 56,100/- దీనికి అదనంగా హెచ్‌ఆర్‌ఏ, టీఏ ఇస్తారు.
- ఎంపికైన అభ్యర్థికి, కుటుంబ సభ్యులకు సబ్సిడీ పై క్యాంటీన్ సౌకర్యం, టీఏ, వైద్య సౌకర్యాలు, ఎల్‌టీసీ, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితరాలు కల్పిస్తారు.
- ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు సెకండ్ క్లాస్ రైలు ప్రయాణ చార్జీలను ఇస్రో ఇస్తుంది.
- మొదట ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తారు. తర్వాత వీటిని పర్మినెంట్ చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **రాతపరీక్ష తేదీ:** ఏప్రిల్ 22
- **వెబ్‌సైట్:** https://www.isro.gov.in

సౌత్ ఇండియన్ బ్యాంక్‌లో ఖాళీలు

సౌత్ ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్, జనరల్, సీనియర్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కేరళలోని త్రిసూర్‌లో ఉంది.
- అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (స్కేల్ V): ఈ పోస్టులను మూడేండ్ల కాలపరిమితికి కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.
- **అర్హతలు:** డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత. సీఏఐఐబీ, ఇతర స్పెషలైజేషన్స్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. ఏదైనా కమర్షియల్ బ్యాంక్‌లో కనీసం 10 ఏండ్ల సర్వీస్ ఉండాలి. ఐదేండ్లు ఫీల్డ్ అనుభవం, ఐదేండ్లు స్కేల్ II లేదా అంతకన్నా పై పోస్టుల్లో పనిచేసిన అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 45 ఏండ్లు మించరాదు.
- చీఫ్ మేనేజర్ (స్కేల్ IV)
- ఈ పోస్టుల్లో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ గ్రూప్, లయబిలిటీ అక్విటేషన్, క్రెడిట్ కార్డ్ ఆపరేషన్స్, ప్రాడక్ట్ మేనేజర్ రిటైల్ అసెట్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** డిగ్రీ/పీజీ ఉత్తీర్ణత. సీఏఐఐబీ, ఇతర స్పెషలైజేషన్స్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. కమర్షియల్ బ్యాంకుల్లో కనీసం 8 ఏండ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 40 ఏండ్లు మించరాదు.
- సీనియర్ మేనేజర్ (స్కేల్ III)
- **అర్హతలు:** కనీసం ఆరేండ్ల అనుభవం ఉండాలి. బీఎఫ్ఎస్ఐ/లార్జ్ కార్పొరేట్‌లో మిడిల్/సీనియర్ లెవల్‌లో కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి.
- ఈ పోస్టుల్లో మార్కెటింగ్, ప్రాడక్ట్ మేనేజర్స్ లయబిలిటీస్, ప్రాడక్ట్ సేల్స్ మేనేజర్, రీజినల్ సేల్స్ మేనేజర్/క్లస్టర్ సేల్స్ మేనేజర్ పోస్టులు ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 800/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 9
- **వెబ్‌సైట్:** www.southindianbank.com

ఎంఎస్‌టీసీలో

భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీలో మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:
- అడిషనల్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) – 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీ అండ్ ఏ) – 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (సిస్టమ్స్) – 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) – 1, డిప్యూటీ జనరల్ మేనేజర్ (హిందీ) –2 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.mstcindia.co.in

ఢిల్లీ మెట్రోరైల్‌లో ఖాళీలు

ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ స్పెషల్ డ్రైవ్ రిక్రూట్‌మెంట్ (ఎస్సీ, ఎస్టీ)లో భాగంగా కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఢిల్లీ మెట్రోరైల్ ప్రాజెక్టు కేంద్రప్రభుత్వం, ఎన్‌సీటీ ఆఫ్ ఢిల్లీ సంయుక్తంగా చేపడుతున్నాయి.

ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో (రెగ్యులర్)..
- అసిస్టెంట్ మేనేజర్/ ఫైనాన్స్ – 2 పోస్టులు
- అసిస్టెంట్ మేనేజర్/లీగల్ – 1
- అసిస్టెంట్ మేనేజర్/ కార్పొరేట్ కమ్యూనికేషన్ – 1



- అసిస్టెంట్ మేనేజర్/సేఫ్టీ – 1

నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో (రెగ్యులర్)...
- స్టేషన్ కంట్రోలర్ – 50 పోస్టులు
- మెయింటెనెన్స్ – ఎలక్ట్రానిక్ మెకానిక్ – 29

నాన్ ఎగ్జిక్యూటివ్ (కాంట్రాక్టు ప్రాతిపదికన)
- ఈ పోస్టులను నాలుగేండ్ల కాలపరిమితికి భర్తీ చేస్తారు.
- స్టెనోగ్రాఫర్ – 2, అకౌంట్ అసిస్టెంట్ – 1, ఆఫీస్ అసిస్టెంట్ – 1 ఖాళీ ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** www.delhimetrorail.com

ఎన్‌ఎండీసీలో అసిస్టెంట్లు

ఎన్‌ఎండీసీ లిమిటెడ్‌లోని వివిధ యూనిట్లు/ ప్రాజెక్టుల్లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది

పోస్టులు – వివరాలు:
- గ్రేడ్ –II మేల్ వార్డ్ అటెండెంట్ – 3
- గ్రేడ్ –II ఫిమేల్ వార్డ్ అటెండెంట్ – 2
- గ్రేడ్–III ఎండబ్ల్యూ/ఎఫ్‌డబ్ల్యూఏ కమ్ డ్రెస్సర్ – 1
- గ్రేడ్ – III అసిస్టెంట్ రేడియోగ్రాఫర్ – 1
- గ్రేడ్ – III అసిస్టెంట్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ – 2
- గ్రేడ్ – III నర్స్ – 8
- మెయింటెనెన్స్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్) – 13
- గ్రేడ్ – III ఎలక్ట్రీషియన్ – 6
- గ్రేడ్ – II బ్లాస్టర్ – 1

నోట్: పైవన్నీ ట్రెయినీ పోస్టులు.
- అడ్వైజర్స్– 5
- **విభాగాలు:** మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, కాంట్రాక్టు మేనేజ్‌మెంట్, పర్సనల్.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.nmdc.co.in

మిశ్రధాతులో

హైదరాబాద్‌లోని మిశ్రధాతు నిగం లిమిటెడ్ (మిధాని)లో కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.
- జూనియర్ మేనేజర్ (క్యాడ్) – 1 (ఎస్సీ)
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- క్యాడ్ ఆపరేటర్ – 1 (ఎస్టీ)
- **వయస్సు:** 35 ఏండ్లు మించరాదు.
- జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ (హిందీ విభాగ్) – 1 (ఎస్సీ)
- **వయస్సు:** 35 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 14
- **వెబ్‌సైట్:** www.midhani.com

ఐఐపీఈలో ఫ్యాకల్టీలు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

మొత్తం పోస్టులు:10

విభాగాల వారీగా ఖాళీలు...
- కెమికల్ ఇంజినీరింగ్ – 1, పెట్రోలియం ఇంజినీరింగ్ – 2, కెమిస్ట్రీ – 1, మ్యాథమెటిక్స్ – 2, సీఎస్ఈ – 1, ఈఈఈ – 1, బయాలజీ – 1, మెకానికల్ ఇంజినీరింగ్ – 1 ఖాళీ ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

ఎన్ఐ-ఎంఎస్ఎంఈలో అకౌంట్స్ ఆఫీసర్

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ni-msme) ఖాళీగా ఉన్న అకౌంట్స్ ఆఫీసర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.
- **పోస్టు పేరు:** అకౌంట్స్ ఆఫీసర్–1 ఖాళీ
- **అర్హత:** రెండేండ్ల మాస్టర్ డిగ్రీ (కామర్స్/ఫైనాన్స్) లేదా చార్టెడ్ అకౌంటెంట్/కాస్ట్ అకౌంటెంట్ విద్యార్హతను కలిగి ఉండాలి. ఎల్‌ఎల్‌బీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 67,700–2,08,700
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.nimsme.org

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 5 ఫిబ్రవరి 2018

WWW.NTNEWS.COM

జూనియర్ మిషెల్లీ!



మీ అభిమాన లీడర్ ఎవరు? హీరో ఎవరు? అనే ప్రశ్నలు పాఠశాల విద్యార్థులకు ఎవరో ఒకరి నుంచి ఎదురవుతూనే ఉంటాయి. అప్పటికే మనసులో స్థానమేర్పరుచుకున్న లీడర్ పేరో.. హీరో పేరో అప్పటికప్పుడు చెప్పేసి ఉత్సాహపడుతుంటారు పిల్లలు. కానీ అమెరికాకు చెందిన ఓ తొమ్మిదేళ్ల బాలిక ఏం చేసిందో తెలుసా?

ఆ అమ్మాయి మూడో తరగతి చదువుతున్నది. స్కూళ్లో ప్రాజెక్ట్ వర్క్. పిల్లల క్రియేటివిటీని.. వివిధ అంశాల పట్ల పరిణతిని పెంపొందించేందుకు ఎలాంటి షరతులు లేకుండా నచ్చిన వాటినే ప్రాజెక్ట్‌లో పొందు పర్చాలని ఉపాధ్యాయులు సూచనలు చేశారు. ఎవరికి నచ్చిన సబ్జెక్ట్‌లో వాళ్లు తమైదన క్రియేటివిటీతో ప్రాజెక్ట్‌వర్క్ చేశారు. ప్రదర్శనకు కూడా పెట్టారు. కానీ కాలిఫోర్నియాకు చెందిన ఆడ్రీ డౌ అనే మహిళ తొమ్మిదేళ్ల కూతురు మిషెల్లీ ఒబామానే తన ప్రాజెక్ట్‌కు సబ్జెక్ట్‌గా ఎంచుకున్నది. మిషెల్లీలాగే డ్రెస్ వేసుకుంది. జుట్టు ఆమెలాగే సిద్ధం చేసుకున్నది. మిషెల్లీ ఒబామాకు చెందిన ప్రతీ అంశాన్ని ప్రాజెక్ట్‌గా రూపొందించి ప్రదర్శనకు పెట్టింది ఈ అమ్మాయి. ఆమె ప్రాజెక్ట్‌ను చూసిన ఉపాధ్యాయులు.. సహ విద్యార్థులు ఆశ్చర్యపోయారట. తన సొంత క్రియేటివిటీ ఆధారంగా వీటిని రూపొందించానని అమ్మాయి చెప్పడంతో ఈ సమాచారం విస్తరించింది. తన బిడ్డ వినూత్న ప్రదర్శనకు మెచ్చిన ఆడ్రీ డౌ.. తన కూతురు ప్రాజెక్ట్ వివరాలన్నింటినీ మిషెల్లీ ఒబామాకు ట్విట్టర్ ద్వారా తెలియజేయడంతో.. మిషెల్లీ అవాక్కయ్యారట. అమ్మాయిని మెచ్చుకున్నారట. ఈ ట్వీట్లు ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఎవ్వరు చూసినా ఈ అమ్మాయిని జూనియర్ మిషెల్లీ అని పిలుస్తున్నారు.

పెంచుతున్నందుకు అద్దె!



ఐదేండ్ల వయసు పిల్లలకు ఆర్థిక విషయాల గురించి ఏం తెలుసనుకుంటాం. కానీ ఆ తల్లి తెలియచేయాలనుకుంది. అందుకే కూతురు దగ్గర నుంచి అద్దె వసూలు చేస్తున్నది. షాక్ అయ్యారా? కానీ నిజం.

ముద్దు మాటలతో, అల్లరి చేష్టలతో ఐదేండ్ల వయసులో పిల్లలు ఆనందంగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటారు. ఆ వయసులో మనం ఏం చెప్పినా అది జీవితాంతం గుర్తుండిపోతుంది. అందుకే ఎస్సెన్స్ ఇవాన్స్ అనే అమ్మ తన కూతురికి ఆర్థిక పాఠాలు నేర్పిస్తున్నది. జీవితంలో సమస్యలు ఎలా ఉంటాయో పరిచయం చేసినప్పుడే పిల్లలకు జీవితం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తారంటున్నది ఈమె. తన కూతుర్ని పెంచుతున్నదందుకు ఆ పాప దగ్గర నుంచి ఈమె వారానికి ఐదు డాలర్లు వసూలు చేస్తున్నది. అది కూడా రెంట్, నీటికి, కరెంట్, కేబులు, ఫుడ్‌కి అని ఒక్కొక్క డాలర్ వసూలు చేస్తున్నట్లు చెబుతున్నది. మరి ఆ పాపకి ఈ డబ్బు ఎక్కడి నుంచి వస్తుందనే కదా మీ సందేహం? ఎస్సెన్సే వారానికి ఏడు డాలర్ల చొప్పున కూతురికి ఇస్తుంది. దాంట్లో నుంచి ఐదు డాలర్లు అద్దె కింద తీసుకుంటుంది. మిగతా రెండు డాలర్లను తాను దాచుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నది. దీనివల్ల కూతురికి చిన్నప్పటి నుంచే పొదుపు పాఠాలు నేర్పిస్తున్నది. ఈ పని మొత్తాన్ని ఎస్సెన్సే ఒక వీడియో రూపంలో చేసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇది చూసిన వాళ్లలో పొగుడుతున్న వాళ్లే ఎక్కువున్నారు.

సేవలోనూ కోటీశ్వరురాలు

నీతా అంబానీ



కోటీశ్వరుల కుటుంబం అనగానే ఆడవాళ్లు ఇంటికి పరిమితమయ్యేవారే ఎక్కువ. కానీ ఆమె కోట్లకంటే ఎక్కువగా తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు. పెద్దింటి కోడలైనా అహంకారాన్ని దరిచేరనివ్వలేదు. తనేం సాధించినా, ఎంత కీర్తిని ఆర్జిస్తున్నా... పెళ్లికి ముందునాటి అమ్మాయిగానే ఉన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన తను ఎదిగి వచ్చిన నడిచివచ్చిన దారినీ మరిచిపోలేదు. ఉన్నదాంట్లో సంతృప్తి చెందడమే కాకుండా నలుగురికి సాయం చేయాలనే మానవత్వాన్ని తనలో ఇముడ్చుకున్నారు. భర్తతో పాటు పలు వ్యాపారాల్లో భాగస్వామిగా ఉంటూనే సామాజికసేవలోనూ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పారిశ్రామిక రంగంలో రాణిస్తూ మహిళా వ్యాపారవేత్తగా ఫోర్బ్స్ జాబితాలో స్థానం సంపాదించారు. ధీరుభాయ్ అంబానీ ఫౌండేషన్‌తో సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్న భారతదేశ ధనవంతులలో ఒకరైన ముఖేష్ అంబానీ భార్య నీతా అంబానీ సక్సెస్‌మంత్ర.

సక్సెస్ మంత్ర

నీతా అంబానీ! ముఖేశ్ అంబానీ భార్య. రిలయన్స్ సహ సారథి. ఇప్పుడు లేటెస్ట్‌గా మోస్ట్ పవర్‌ఫుల్ ఏషియన్ బిజినెస్ ఉమన్. 'ఫోర్బ్స్ ప్రతిసారి విడుదల చేసే ఈ లిస్ట్‌లో తొలిసారి నీతా పేరు కనిపించింది. లిస్ట్‌లో అందరికన్న పైన నీతా కనిపించారు. లిస్టులో నీతా చాలా దేశాలను బీట్ చేశారు. ఆయా దేశాలలోని మహిళా పారిశ్రామికవేత్తలందర్నీ వెనక్కి తోసి ఫోర్బ్స్ పరుగుల పందెంలో ముందుకు దూసుకువచ్చారు. నీతా గురించి ఫోర్బ్స్‌వ్యాఖ్యానిస్తూ 'కోటీశ్వరుల భార్యలు.. వాళ్లెంత సమర్థులైనా.. భర్తల నీడగానే మిగిలిపోతారు. నీతా అలా కాదు. ఆమె సాధించిన విజయాలన్నీ వెరీ ఇంప్రెసివ్' అంది.

వ్యక్తిగత జీవితం

నీతా అంబానీ నవంబర్ 1, 1963లో ముంబాయిలో జన్మించారు. రవీంద్రబాయి దలాల్, పూర్ణిమా దలాల్ ఆమె తల్లిదండ్రులు. ఆమె నార్సీ మోంజీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకానమిక్స్‌లో తన బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. అలాగే భరతనాట్యం నేర్చుకోవడంతో పాటు పలు ప్రదర్శనలు ఇచ్చారు. నీతా గుజరాతీ అమ్మాయి. ఆమె తల్లి జానపద నృత్యకళాకారిణి. నీతాకు ఎనిమిదేళ్ల వయసులో తల్లి దగ్గరే నృత్యప్రాశన జరిగింది. భరతనాట్య నర్తకిగా ఎదిగింది. దేశమంతా ప్రదర్శనలు ఇచ్చారు. ఓ రోజు ధీరూభాయ్ ముంబైలోని 'బిర్లా మాతోశ్రీ' ఆడిటోరియంలో ఆమె డాన్స్ చూశారు. డాన్స్ బాగుంది. అమ్మాయి బాగుంది. ఎంత బాగుందీ అంటే.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకే అందం తెస్తోంది! 'ఆ అమ్మాయి ఎవరు?' అని నిర్వాహకుడిని అడిగారు ధీరూభాయ్. ఆ కుటుంబం గురించి అందుబాటులో ఉన్న వివరాలన్నీ రాబట్టారు. ఆఖరికి ఫోన్ నెంబరు కూడా. ఆ తర్వాత వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి తన కుమారుడు ముఖేష్ అంబానీకి ఇచ్చి 1985 మార్చి 8న పెళ్లి చేశారు. అలా ఆమెను ధీరుబాయి తన ఇంటి కోడలుగా చేసుకున్నారు. నీతాముఖేష్‌లకు ముగ్గురు పిల్లలు ఈషా, ఆకాశ్, అనంత్ ఉన్నారు.



రిలయన్స్ ఫౌండేషన్

నీతా రిలయన్స్ ఫౌండేషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలు, దాతృత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం దీన్ని 2010లో నీతా ప్రారంభించారు. ఈ పౌండేషన్ విద్య, క్రీడలు, ఆరోగ్యం, గ్రామీణ పరివర్తన, పట్టణ పునరుద్ధరణ, విపత్తు ప్రతిస్పందన, మహిళల సాధికారత, ప్రమోషన్ , భారతీయ సంస్కృతి పరిరక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. గతంలో గుజరాత్, చెన్నై, కశ్మీర్, కేథార్‌నాథ్, మారత్‌వాడ తదితర ప్రాంతాల్లో వచ్చిన ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఫౌండేషన్ సేవలందించింది.

వ్యాపారంలోకి అడుగు

ధీరుబాయి అంబానీ ఉన్నన్ని రోజులు వ్యాపారం ఆయనతో పాటు ఆయన కుమారులు అనిల్, ముఖేష్ చూసుకునేవారు. అయితే ఆయన మరణం తర్వాత అన్నదమ్ములిద్దరూ వ్యాపారాన్ని పంచుకోవడంతో భర్తకు చేదోడువాదోడుగా ఉండడం కోసం నీతా వ్యాపారంలోకి అడుగుపెట్టక తప్పలేదు. మామ మరణం తర్వాత ధీరుభాయ్ అంబానీ ఫౌండేషన్‌ను ప్రారంభించి దానికి అధ్యక్షురాలిగా ఉండడంతో పాటు పలు సేవాకార్యక్రమాల్లో భాగమవుతున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్యనందించే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ధీరుభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు అధ్యక్షురాలిగా, ముంబై ఇండియన్స్ సహాధ్యక్షురాలు, ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అదనపు డైరెక్టర్‌గా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి సహభాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారంలో రాణిస్తున్న వారిలో 'మోస్ట్ పవర్‌ఫుల్ ఏషియన్ బిజినెస్ ఉమన్'గా పోర్బ్స్ గుర్తించింది. అలాగే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి తొలి భారతీయ మహిళా సభ్యురాలుగా ఉన్నారు.

ఉద్యోగులకు కాలనీ

కోటీశ్వరుడి భార్యగా ఉన్నప్పటికీ నీతాలో ఆ గర్వం కనపడదు. పైగా తన సేవానిరతితో అందరి అభిమానం అందుకుంటున్నారు.1997లో రిలయన్స్ మెగా-రిఫనరీలో పనిచేసే ఉద్యోగులకోసం జామ్‌నగర్‌లో కంపెనీ టౌన్‌షిప్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను ఒక పద్ధతిలో మూడు లైన్లతో ఏకోఫ్రెండ్లీ కాలనీగా తీర్చిద్దారు. ఈ కాలనీలో 17000 ఇండ్లు నిర్మించారు. ప్రస్తుతం ఈ కాలనీ ఒక పండ్ల తోటగా రూపొందింది. ప్రస్తుతం ఇక్కడ లక్ష వరకు మామిడి పండ్ల మొక్కలు, పలు రకాల పక్షులు ఉన్నాయి.

ముంబై ఇండియన్..

నీతా అంబానీకి క్రీడలంటే అమితమైన ఆసక్తి. 2008లో రిలయన్స్ సంస్థ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టును కొనడానికి ప్రధాన కారణం కూడా ఆమే. ఐపీఎల్ తొలి సీజన్ నుంచి ప్రస్తుతం జరుగుతున్న సీజన్ వరకు దాదాపు జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌కూ ఆమె హాజరవుతూనే ఉన్నారు. ఐపీఎల్‌లో ప్రతి ఏడాదీ ముంబైలో జరిగే ఒక మ్యాచ్‌కు కచ్చితంగా అనాథపిల్లలను తీసుకొచ్చి మ్యాచ్ చూపిస్తుంటారు నీతా. వారికి రవాణా, ఆహారం అన్నీ ఉచితంగా అందిస్తారు. భారతదేశంలో క్రీడలంటే కేవలం క్రికెట్ మాత్రమే కాదని, ఇతర క్రీడలను కూడా ప్రోత్సహిస్తుండాలని నీతా తరచుగా చెబుతుంటారు. ఇందులో భాగంగా పుట్టిందే ఇండియన్ సూపర్ లీగ్. ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్ భారతదేశంలో జరగడానికి ప్రధాన కారణం నీతా. కేవలం రెండేళ్లలోనే ఐఎస్ఎల్ ప్రపంచంలో మూడో పాపులర్ ఫుట్‌బాల్ లీగ్‌గా ఎదగడానికి ఆమె ప్రణాళికలే కారణం. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా యంగ్ చాంపియన్స్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి దేశవ్యాప్తంగా టాలెంట్ సెర్చ్ చేస్తున్నారు.



ఐఓసీ సభ్యురాలు

జూన్3, 2016న నీతాతో పాటు మరో ఎనిమిది మంది అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ కమిటీలో స్థానం సంపాదించిన తొలి భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు.

అలాగే 2013 నుంచి జూనియర్ ఎన్‌బీఏ ప్రోగ్రామ్ పేరుతో దేశవ్యాప్తంగా పాఠశాలల్లో బాస్కెట్‌బాల్‌లో నైపుణ్యం ఉన్న పిల్లలను వెలికి తీస్తున్నారు. ఈ సంస్థ ద్వారా 'ఎడ్యుకేషన్ ఫర్ ఆల్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ సుమారు 70 వేల మంది విద్యార్థుల్లో విద్య పట్ల అవగాహన కల్పించి స్కూల్‌కు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నది. క్రీడల్లో చేసిన సేవలకుగాను 'రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ అవార్డు-2017 అందుకున్నారు.

ధీరుబాయి అంబానీ ఇంటర్‌నేషనల్ స్కూల్

ధీరుబాయి ఇంటనేషనల్ స్కూల్‌కు నీతా వ్యవస్థాపకులరాలిగా, చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈ స్కూల్ దేశంలోనే అత్యుత్తమ పాఠశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇక్కడ విద్యను అందిస్తున్నారు. ఎన్‌డీటీవీ, హిందూస్తాన్ టైమ్స్ వంటి మీడియా సంస్థలు ఈ పాఠశాలను ఐదేళ్లుగా నాలుగు సార్లు ముంబాయిలోనే నంబర్‌వన్ స్కూల్‌గా అభివర్ణించాయి.

నూనె పెట్టుకొని రికార్డు సృష్టించారు!



అమ్మ బిడ్డకు నూనె పెట్టడం మామూలే! గ్రామాల్లో అయితే ఒకచోట కూర్చొని ఒకరికొకరు నూనె పెట్టుకోవడం మామూలుగా చూస్తుంటాం. కానీ ఇక్కడ ఒక నూనె కంపెనీ ఏకంగా 578మంది చేత నూనె పెట్టించి రికార్డు సృష్టించింది.

కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి గ్రామాల్లో కనిపిస్తుంటుంది. అందుకే ఏదో ఒక ముచ్చట చెబుతూ తలకు నూనె రాసుకోవడం, పేలు చూడడం, జుట్టు వేయడం లాంటివి చేస్తుంటారు. వారి మధ్య అనుబంధాలు, ఆప్యాయతలకు ఇలాంటి సన్నివేశాలు కనిపిస్తుంటాయి. తాజాగా ముంబైలో జరిగిన ఈ సన్నివేశం చూస్తే మనకు వెనుకటి రోజులు గుర్తుకు వస్తాయి. బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ అనే హెయిర్ ఆయిల్ తెలుసు కదా! ఆ కంపెనీ వారు ముంబైలో ఒక ఈవెంట్ చేశారు. 578మంది మహిళలు ఒక చెయిన్‌లా కూర్చొబెట్టి వారికి ఆయిల్ ఇచ్చారు. అనంతరం వారిని ఒకరికొకరు తలకు నూనెతో మసాజ్ చేసుకోమని చెప్పారు. ఇలా అత్యంత పొడవైన మానవహారంగా వారు గిన్నిస్ రికార్డుకు ఎక్కారు. ఈ ఘనత ఇప్పుడు ఆ ఆయిల్ కంపెనీకే దక్కుతుంది మరి!

నాన్న కూతురు!

నాన్నంటే ఇష్టమా? అమ్మంటే ఇష్టమా? కూతురంటే ఇష్టమా? కొడుకంటే ఇష్టమా? ఇష్టం గురించి ఇలా ఎందర్ని ఎన్నిసార్లు అడిగినా అందరూ ఇష్టమే అని చెప్తుంటారు కానీ.. పర్టిక్యులర్‌గా ఫలానా వాళ్లంటేనే ఇష్టం అని చెప్పలేరు. కుటుంబ బంధాలు అలాంటివి. బయటకు చెప్పినా.. చెప్పకపోయినా తండ్రులకు కూతుర్లంటేనే ఇష్టమట.



అమ్మ ఇష్టం ఉన్నా.. నాన్నంటే ఇంకా ఇష్టమని చెప్పే కూతుర్లే ఎక్కువనీ.. నాన్నలకు కూడా కొడుకుపై కంటే కూతురుపైనే ఎక్కువ ప్రేమ ఉంటుందని అమెరికా అధ్యయనకారులు చెప్తున్నారు. అమెరికన్ సైకలాజికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో తాజాగా ఓ అధ్యయనం జరిగింది. పిల్లల గురించి పేరెంట్స్ స్పందన.. పేరెంట్స్ పట్ల పిల్లల స్పందనను ఈ అధ్యయనంలో భాగంగా పరిశీలించారు. దాదాపు 60 మంది నాన్నలపై కొన్ని మానసిక పరీక్షలు కూడా చేశారు. కూతుర్లు.. తల్లులతో మాత్రమే అన్నీ షేర్ చేసుకుంటారు అనే విషయంలో స్పష్టత లేదనీ.. తల్లులతో చెప్పుకోలేని అనేక విషయాలు తండ్రితో షేర్ చేసుకుంటారని నిపుణులు అభిప్రాయపడ్డారు. యాక్టివిటీస్.. వర్క్.. కెరీర్ వంటి విషయాల్లోని అన్ని ఎమోషన్స్‌ను ఒక్క తండ్రితో మాత్రమే చెప్పుకునే ధోరణి చాలామంది అమ్మాయిల్లో కనిపిస్తుందని చెప్పారు. నాన్న అయితేనే అన్ని రకాలుగా తమను అర్థం చేసుకుంటారనే ఆలోచనా ధోరణి కూతుళ్లలో ఉంటుందని తేటతెల్లం చేశారు. చాలామంది అనుకున్నట్లుగా నాన్న బయటకు కఠోరంగా కనిపించినా పిల్లల విషయంలో చాలా సున్నితంగా ఉంటారనీ.. అదే కోణంలో ఆలోచిస్తారని అన్నారు. ఆనందమొచ్చినా.. ఆపదొచ్చినా నాన్నతో చెప్పుకుంటేనే నిమ్మలంగా ఉండొచ్చనే భావన తాము పరిశీలించిన అమ్మాయిల్లో కనిపించిందని పేర్కొన్నారు. అందుకే అమ్మాయిలెప్పుడూ నాన్న కూతురుగానే ఉండాలని చూస్తారట!

నా బిడ్డపై ప్రభావం ఉంటుందా?



అడుగండి చెబుతా

నాకు 34 ఏళ్లు. నాలుగు నెలల గర్భవతిని. నాకు హైపోథైరాయిడిజం ఉంది. గుండెదడగా ఉంటుంది. చర్మం ఎప్పుడూ పొడిబారుతుంది. హైపోథైరాయిడిజానికి సంబంధించి మందులు వాడుతున్నాను. దీని వల్ల నా బిడ్డ మీద దుష్ప్రభావం ఉండదనే అనుకుంటున్నాను. నేను ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

- సి. పద్మజ, సిరిసిల్ల



నేహా తస్నీమ్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

హైపోథైరాయిడిజం లక్షణాలు, గర్భధారణ లక్షణాలు దాదాపుగా ఒకేరకంగా ఉంటాయి. అవి - గుండె వేగంగా కొట్టుకోవడం (టాకీకార్డియా), వేడిని తట్టుకోలేకపోవడం, చెమటలు పట్టడం, బరువు తగ్గడం లేక పెరుగడం, ఆకలి ఎక్కువగా ఉండడం జరుగుతుంది. దీనికి మొదటగా డాక్టర్‌ని సంప్రదించి క్రమం తప్పకుండా మందులు వాడాలి. హైపోథైరాయిడిజాన్ని కంట్రోల్‌లో పెట్టుకోకపోతే బిడ్డ పెరుగుదల తగ్గడం, గుండె అధికంగా కొట్టుకోవడం మీద ప్రభావం చూపుతుంది. మీ ఆహారంలో తగిన మార్పులు చేసుకోవడం వల్ల హైపోథైరాయిడిజమ్‌ని నియంత్రించవచ్చు. దీనితో పాటు మీ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. హైపోథైరాయిడిజం రావడానికి ముఖ్య కారణం మన ఆహారంలో సోడియం నిల్వలు తగ్గిపోవడమే. అందువల్ల సోడియం ఎక్కువగా ఉండేలా ఆహారాన్ని అడ్జస్ట్ చేసుకోవాలి. అందుకోసం సముద్రపు చేప, ఉప్పునీటి చేపల వంటివి ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మరో ముఖ్య ఖనిజం సెలీనియం. ఇది అధికంగా ఉండే ఆహారం థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి పెరగడానికి దోహపడుతుంది. ఇది ఎక్కువగా సముద్రపు ఆహారం, కొవ్వు లేని మాంసం, పప్పుధాన్యాల్లో, దంపుడు బియ్యంలో అధికంగా ఉంటుంది. కొబ్బరి నూనె కూడా అద్భుతంగా పనిచేస్తుంది. దీన్ని ఏ మేరకు తీసుకోవాలనే మన వయసు, శరీరతత్వాన్ని బట్టి ఉంటుంది. బరువు పెరగడం హైపోథైరాయిడిజమ్ లక్షణం. అందువల్ల మీ ఆహారంలో ఎక్కువ పీచుపదార్థాలు ఉన్న పండ్లు, కూరగాయలు, గోధుమ పిండి తీసుకోవాలి. రోజుకు కనీసం 8 గ్లాసుల నీరు తాగడం వల్ల బరువు పెరుగకుండా కాపాడుకోవచ్చు. ఇవన్నీ క్రమం తప్పకుండా పాటిస్తే హైపోథైరాయిడ్ లక్షణాలను తగ్గించవచ్చు.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 5 ఫిబ్రవరి 2018

14 మంది ఐఐటీయన్లకు Y-E-S అవార్డు

యంగ్ ఇంజినీర్ అండ్ సైంటిస్ట్స్ అవార్డు 2017-18కు 14 మంది ఐఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ అవార్డును హోండా మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎంఐ) అందిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు 3000 యూఎస్ డాలర్లు ఇస్తారు. దీంతోపాటు ఉన్నత చదువులకు జపాన్‌కు పంపిస్తారు. ఎంపికైన వారిలో ఐఐటీ ఢిల్లీ, బాంబే, మద్రాస్, ఖరగ్‌పూర్, కాన్పూర్, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.

- విద్యార్థుల సీజీపీఏ సగటు, రాసిన వ్యాసాలు, రెండు రౌండ్ల వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేసినట్లు హెచ్ఎంఐ వెల్లడించింది.
- దేశంలోని ఐఐటీల్లో చదువుతున్న ప్రతిభావంతులను ఈ అవార్డులకు ఎంపికచేస్తారు. విద్యార్థులకు ఈ అవార్డులు ఒక ప్రేరక శక్తిగా నిలుస్తాయని భారత్‌లోని జపాన్ రాయబారి కెంజి హిరమస్తు అన్నారు.



ఐఐఎస్సీలో పీజీ ప్రవేశాలు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)లో ఎంటెక్, ఎం.డిజైన్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాల కోసం ముఖ్యతేదీలను ప్రకటించింది. ఆన్‌లైన్‌లో మార్చి 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు గేట్/క్యాట్/జీమ్యాట్ స్కోర్, ఆప్టిట్యూడ్ టెస్ట్/గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. వివరాల కోసం http://www.iisc.ac.in చూడవచ్చు.

నెట్‌లో ఇక రెండు పేపర్లే!

దేశవ్యాప్తంగా అత్యంత ఆదరణ కలిగిన పరీక్షల్లో నెట్ ఒకటి. సుమారు 10 లక్షల మంది రాసే ఈ పరీక్ష ద్వారా జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్‌కు అర్హత కల్పిస్తారు. ఏటా రెండుసార్లు నెట్‌ను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది. జూలైలో నిర్వహించే నెట్‌లో రెండు ప్రధాన మార్పులు చేశారు. పరీక్ష తేదీలు, పరీక్ష విధానం, మార్పుల పై సంక్షిప్తంగా....

- **నెట్:** నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్. నెట్‌ను యూజీసీ నెట్/సీబీఎస్ఈ నెట్‌గా పిలుస్తారు. దేశంలోని ప్రామాణికమైన బోధనా నిపుణులకు, పరిశోధనార్థులకు ఉండాల్సిన కనీస ప్రమాణాలను పరిశీలించడానికి ఈ నెట్‌ను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది. దేశవ్యాప్తంగా 91 కేంద్రాల్లో 100 సబ్జెక్టుల్లో నెట్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుంది.



యూజీసీ - నెట్ 2018

ప్రధాన మార్పులు

- ఇప్పటివరకు 3 పేపర్లతో నెట్ నిర్వహిస్తుండగా ఈసారి నుంచి రెండు పేపర్లు మాత్రమే ఉంటాయి.
- వయోపరిమితి పెంపు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) కోసం నెట్ రాసే అభ్యర్థుల వయస్సును రెండేండ్లు పెంచారు. అంటే 28 ఏండ్ల నుంచి 30 ఏండ్లకు పెంచారు.

పేపర్ - I

- పేపర్- Iలో 50 ప్రశ్నలు. అన్ని తప్పనిసరి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. టీచింగ్/రిసెర్చ్ ఆప్టిట్యూడ్‌లను పరీక్షించడం.
- పరీక్ష సమయం గంట. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహిస్తారు.

పేపర్ - II

- 100 ప్రశ్నలు. అన్ని తప్పనిసరి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. ఇవి అభ్యర్థి ఆప్షనల్ సబ్జెక్టుపై ఉంటాయి.
- పరీక్ష కాలవ్యవధి రెండు గంటలు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహిస్తారు.
- **నెట్ విశేషాలు:** దేశంలో ఎక్కువమంది రాసే పరీక్షల్లో నెట్ ఒకటి. నవంబర్ 2017లో ఈ పరీక్షకు 9.29 లక్షలమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనిలో 5.19 లక్షల మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు, 4.09 లక్షల మంది పురుషులు ఉన్నారు. దేశవ్యాప్తంగా 91 పరీక్ష కేంద్రాల్లో దీన్ని నిర్వహించారు.
- **కటాఫ్:** నెట్‌లో క్యాటగిరీల వారీగా అర్హత మార్కులను నిర్ణయించారు. నిర్దేశించిన అర్హత సాధించిన వారిని మాత్రమే మెరిట్‌లిస్ట్ ప్రిపరేషన్‌లో పరిగణనలోకి తీసుకుంటారు.
- జనరల్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు అంటే రెండు పేపర్లలో కలిపి 80 మార్కులను, ఓబీసీ/ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులు 70 మార్కులను సాధించాలి. జాబితాలో టాప్‌లో ఉన్నవారికి జేఆర్ఎఫ్ ప్రదానం చేస్తారు.

ఈ పరీక్ష రాయడానికి ఎవరు అర్హులు?

- సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ/తత్సమాన కోర్సులు ఉత్తీర్ణత. పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయనున్నవారు కూడా నెట్ రాయవచ్చు.

ప్రయోజనాలు ఏమిటి...?

- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే ఐదేండ్లపాటు ఫెలోషిప్ లభిస్తుంది. మొదటి రెండేండ్లు రూ. 32,500/-, కంటిన్‌జెన్సీ ఫండ్ కింద రూ. 10 వేలు ఇస్తారు. తర్వాత మూడేండ్లు రూ. 36,500/- ఇస్తారు. కంటిన్‌జెన్సీ ఫండ్ కింద రూ. 25 వేలు ఇస్తారు.
- జేఆర్ఎఫ్ అర్హత సాధించినవారికి దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో అంటే ఐఐటీ/నిట్‌లలో పీహెచ్‌డీ చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు.
- చాలా పీఎస్‌యూలు (నవరత్న, మహారత్న, మినీరత్న) ఉద్యోగాల్లో ఎంపికకూ ఈ స్కోర్‌ను ప్రామాణికంగా పరిగణిస్తున్నాయి.
- లెక్చరర్‌షిప్ అర్హత సాధిస్తే దేశంలోని అన్ని డిగ్రీ/యూనివర్సిటీ కాలేజీల్లో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడానికి అర్హులు.
- టీఎస్‌పీఎస్సీ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు నెట్/స్లెట్ తప్పనిసరి.

ముఖ్యతేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 6 నుంచి ప్రారంభం
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** ఏప్రిల్ 6
- **పరీక్షతేదీ:** జూలై 8
- **చివరితేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** https://cbsenet.nic.in

రైల్వేలో కొలువుల మేళా!

@26,502 ఖాళీలు

ప్రపంచంలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు కలిగిన ప్రభుత్వ సంస్థల్లో భారత రైల్వే ఒకటి. ఏటా వేల సంఖ్యలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తూ నిరుద్యోగులపాలిట కల్పతరువుగా పేరుగాంచిన ఇండియన్ రైల్వే మరోసారి నిరుద్యోగులకు సువర్ణావకాశం అందించింది. 26,502 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ వివరాలు 'నిపుణ' పాఠకుల కోసం...

(అసిస్టెంట్ లోకో పైలట్ - 17,673, టెక్నీషియన్లు - 8829)

భారతీయ రైల్వే వివిధ రైల్వే బోర్డుల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్‌పీ), టెక్నీషియన్ పోస్టుల భర్తీకి సెంట్రలైజ్డ్ ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఆర్ఆర్‌బీ బోర్డులు (21)

- అహ్మదాబాద్, అజ్మీర్, అలహాబాద్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, జమ్ము, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, త్రివేంద్రం.
- **పోస్టులు:** అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్లు
- **పేస్కేల్:** ప్రారంభ వేతనం రూ. 19,900/ + ఇతర అలవెన్సులు. ఏడో వేతన కమిషన్ లెవల్ 2 స్థాయి జీతభత్యాలు ఇస్తారు.
- **వయస్సు:** 2018 జూలై 1 నాటికి 18 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి. అంటే 1990 జూలై 2 నుంచి 2000 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హతలు

- **అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులకు -** పదోతరగతి లేదా తత్సమాన పరీక్షతోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐటీఐల్లో కింది ట్రేడ్‌లలో ఉత్తీర్ణత.
- **ట్రేడ్‌లు:** ఆర్మేచర్ & కాయిల్ వైండర్/ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, హీట్ ఇంజిన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, మోకానిక్ మోటార్ వెహికిల్, మిల్‌రైట్ మెయింటెనెన్స్ మెకానిక్, రేడియో & టీవీ మెకానిక్, రిఫ్రిజిరేషన్ &ఏసీ మెకానిక్, ట్రాక్టర్ మెకానిక్, టర్నర్, వైర్‌మ్యాన్. లేదా
- సంబంధిత ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా. సంబంధిత బ్రాంచీల్లో ఇంజినీరింగ్ డిగ్రీ చేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- **టెక్నీషియన్ పోస్టులకు -** పదోతరగతి/తత్సమాన కోర్సుతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత. అప్రెంటిస్‌షిప్ చేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి వ్యాలిడిటీ కలిగి ఉన్న లైట్ & హెవీ డ్యూటీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- సిగ్నల్, టెలికమ్యూనికేషన్ పోస్టులకు పై అర్హతలు లేదా ఇంటర్ (మ్యాథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణత.



మొత్తం పోస్టుల సంఖ్య: 26,502

- **అసిస్టెంట్ లోకోపైలట్ -17,673 ఖాళీలు** (జనరల్-9230, ఓబీసీ-4362, ఎస్సీ-2694, ఎస్టీ-1387)
- **టెక్నీషియన్-8829 ఖాళీలు** (జనరల్-4563, ఓబీసీ-2162, ఎస్సీ-1363, ఎస్టీ-738)
- దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్) పరిధిలో 3262 పోస్టులు ఉన్నాయి. వీటిలో జనరల్-1643, ఓబీసీ-836, ఎస్సీ-517, ఎస్టీ-266 ఖాళీలు. మొత్తం పోస్టుల్లో అసిస్టెంట్ లోకోపైలట్- 2719 (ఎలక్ట్రికల్ (ఈసీవోఆర్)- 70, మెకానికల్(ఎస్‌సీఆర్)- 2649 ఖాళీలు), టెక్నీషియన్-543 ఖాళీలు ఉన్నాయి. అత్యధికంగా అలహాబాద్ ఆర్ఆర్‌బీలో 4694, కోల్‌కతాలో 1824.

అప్లికేషన్ ఫీజు

- జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ. 500/-,
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, మహిళ, ట్రాన్స్‌జెండర్, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు - రూ. 250/-
- **ఎంపిక:** రెండు దశల్లో జరుగుతుంది. కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను మొదటి దశ సీబీటీ, రెండో దశ సీబీటీగా నిర్వహిస్తారు.

మొదటి దశ సీబీటీ

- దీనిలో 75 ప్రశ్నలను ఇస్తారు. కాలవ్యవధి 60 నిమిషాలు.
- కనీస అర్హత మార్కులు జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఓబీసీ/ఎస్సీ అభ్యర్థులు 30 శాతం, ఎస్టీ అభ్యర్థులు 25 శాతం సాధించాలి. పీహెచ్‌సీ అభ్యర్థులకు 2 శాతం మినహాయింపు ఉంటుంది.
- ఈ పరీక్షలో ప్రశ్నలు పోస్టులకు సంబంధించిన విద్యార్హతల స్థాయిలో ఉంటాయి. మ్యాథ్స్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్‌పై ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు.

రెండోదశ సీబీటీ

- మొదటిదశలో అర్హత సాధించిన వారిని 1:15 నిష్పత్తిలో రెండోదశకు ఎంపికచేస్తారు.
- రెండోదశ సీబీటీలో పార్ట్ - ఏ, పార్ట్ - బీ ఉంటాయి. పరీక్ష కాలవ్యవధి 150 నిమిషాలు.
- పార్ట్ - ఏలో 100 ప్రశ్నలు. 90 నిమిషాలు. దీనిలో మ్యాథ్స్, జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, జనరల్ అవేర్‌నెస్ (కరెంట్ అఫైర్స్).
- పార్ట్ - బీలో 75 ప్రశ్నలు. 60 నిమిషాలు. ఈ పరీక్షలో 35 శాతం మార్కులు అర్హతగా నిర్ణయించారు. సంబంధిత ట్రేడ్‌లపై ప్రశ్నలు ఇస్తారు. దీనికి సంబంధించిన సిలబస్ డీజీఈటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 5
- **మొదటిదశ సీబీటీ:** ఏప్రిల్/మేల్లో నిర్వహిస్తారు
- **వెబ్‌సైట్:** www.rrbsecunderabad.nic.in
- Phone : 040-27821663

... తన్నీరు వెంకటేశ్వర్లు

ప్రత్యేక అవసరాలున్న పిల్లల విద్య

వినికిడి లోపం, దృష్టి లోపం, బుద్ధి మాంద్యం, శారీరక వైకల్యం, అభ్యసన సమస్యలు ఉన్న పిల్లలు సాధారణ పిల్లల కంటే లక్షణాలు, స్వభావం, అభిరుచులు, అలవాట్లు, శక్తి సామర్థ్యాల్లో భిన్నంగా ఉంటారు. వీరినే ప్రత్యేక అవసరాలున్న పిల్లలు అంటారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను సాధారణ పాఠశాలల్లో చేర్పించి అందరితోపాటు విద్యనందించడమే విలీనవిద్య. బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం- 2009 ప్రకారం 6-14 ఏండ్ల బాలలకు ప్రాథమిక విద్యను పొందే హక్కు ఉంటుంది. 6-14 ఏండ్ల వయస్సున్న వారిలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలు కూడా ఉంటారు. కాబట్టి సాధారణ పాఠశాలల్లో చేర్పించాలి. సెక్షన్-4 ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాధారణ బాలల సామర్థ్యాలను పెంపొందించాలి. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలి.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలు - రకాలు

1. బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలు: ప్రజ్ఞాలబ్ధి (ఐక్యూ) ఆధారంగా బుద్ధిమాంద్యం ఉన్న పిల్లలు నాలుగు స్థాయిల్లో ఉంటారు.
2. వినికిడి లోపం ఉన్న పిల్లలు
3. **దృష్టి లోపం ఉన్న పిల్లలు:** పిల్లల్లోని దృష్టి లోపాన్ని దృష్టి స్పష్టత, దృష్టి క్షేత్రం ద్వారా గుర్తిస్తారు.

- **దృష్టి స్పష్టత:** వివిధ దూరాల నుంచి వివిధ పరిమాణాల్లో ఉన్న వస్తువులను చూసినప్పుడు 180^0 పరిధిలోని వస్తువులు కనిపించడం.
- ఒక వ్యక్తి విజువల్ అక్విటి 20/200 లేదా 6/60 కంటే తక్కువ ఉంటే అతడిని అంధుడు అంటారు.

దృష్టి లోపం 20/200 అంటే?

- సాధారణ దృష్టి స్పష్టత కలిగిన వ్యక్తి కంటి ముందున్న వస్తువును 200 అడుగుల దూరం నుంచి స్పష్టంగా చూస్తే, దృష్టిలోపం ఉన్న వ్యక్తి కేవలం 20 అడుగుల దూరం నుంచి కూడా అస్పష్టంగా చూడటం.

4. **మస్తిష్క పక్షవాతం:** కేంద్రనాడీ వ్యవస్థ లోపం వల్ల సంభవించే అసాధారణ కండర మార్పు లేదా కదలికే మస్తిష్క పక్షవాతం.
5. **శల్యలోపం ఉన్న పిల్లలు:**

- ప్రమాదవశాత్తు అవయవాలు కోల్పోయినవారు
- శల్యాలు, కీళ్లు, కండరాల్లో లోపాల వల్ల అంగవైకల్యం పొందినవారు
- పోలియో వ్యాధిగ్రస్థులు
- చేతులు, కాళ్లు వంకర్లు తిరిగి ఉండటం

6. **అభ్యసనా సామర్థ్యం లోపించిన పిల్లలు :** పిల్లల భాషణం, పఠనం, రాయడం గణిత అవగాహన రీతుల్లో వైపరీత్యాలు ఉండటం
7. **ఆటిజం:** పిల్లలు తక్కువ ఏకాగ్రత కలిగి, వారిలో వారే అర్థరహితమైన శబ్దాలు చేస్తూ, భాషా అవగాహన, వ్యక్తీకరణలో లోపం, ఆటపాటల్లో ఎటువంటి ఆసక్తి ఉండని అసహజ ప్రవర్తన.

- ఆటిజం పిల్లల్లో ఒంటరిగా ఉండటానికి ప్రయత్నించడం, చేసిన పనిని పదేపదే చేయడం, ఎక్కువగా అనుకరించడం, ప్రవర్తన, నిలకడగా లేని ప్రవర్తన, మునివేళ్ల మీద నడవడం, సాంఘిక ప్రవర్తనా లోపం వంటి లక్షణాలు ఉంటాయి.

స్థాయి	ప్రజ్ఞాలబ్ధి	విద్యాపర వర్గీకరణ
స్వల్ప బుద్ధిమాంద్యత	52-69	విద్యాస్థాయి బుద్ధిమాంద్యత
కొద్దిపాటి బుద్ధిమాంద్యత	36-51	శిక్షణస్థాయి బుద్ధిమాంద్యత
తీవ్ర బుద్ధిమాంద్యత	20-35	సురక్షణ స్థాయి బుద్ధిమాంద్యత
అతి తీవ్రమైన బుద్ధిమాంద్యత	19 కంటే తక్కువ	సురక్షణ స్థాయి బుద్ధిమాంద్యత

సెరిబ్రల్ పాల్సీ రకం	లక్షణాలు
ఎథెటోసిస్	అసంకల్పిత, అనియంత్రిత చలనాలవల్ల సరిగ్గా నడవలేరు, వస్తువులు అందుకోలేరు, మాట్లాడలేరు.
గతిలోపం	ప్రతి కదలిక అపసవ్యంగా ఉండి ప్రాదేశిక సబంధాలు హీనంగా ఉంటాయి
స్పాస్టిసిటి	కండరాలను దాటే అసంకల్పిత ప్రతీకార చర్య ఉంటుంది. చేయి ఒకవైపునకు చాచాలంటే మరోవైపు పోతుంది, వణుకుతుంది.
అనమ్యత	కండరాలు బిగుసుకొని ఉండటం వల్ల అవయవాలు కదల్చలేకపోతారు. నిర్దేశించిన కదలిక ఉండదు.

అభ్యసన వైకల్యరకం	లక్షణాలు
డిస్‌ఫేసియా	ఇతరులు వ్యక్తపర్చిన పదాలను అర్థంచేసుకోవడంలో, తిరిగి వ్యక్తపర్చడంలో లోపం
అఫేసియా	పదాలు రాయడంలో, ఇంగితాలను గుర్తించి వాడటంలో అనాసక్తి
డిస్‌లెక్సియా	పదాలు సరిగా ఉపయోగించలేకపోవడం, చదవడం, చదివింది గ్రహించడంలో సమస్యలు
అలెక్సియా	ముద్రణ రూపంలో ఉన్న దాన్ని చదవడం, రాయడంలో అశక్తత
డిస్‌గ్రాఫియా	పదాలను, సంఖ్యలను రాయడంలో, చలన సంబంధాల్లో ఉండే అశక్తత
డిస్‌కాల్కులియా	గణితసంబంధ అంశాలను, సంఖ్యలను వ్యక్తపర్చడంలో సమస్యలు

వినికిడి నష్టస్థాయి	రకం	నివారణ చర్య
16-20dB	న్యూనత	వినగలిగి, మాట్లాడగలిగే స్థాయి
20-30dB	అతి తక్కువ	
30-40dB	తక్కువ	
40-60dB	మితమైన	అతి తక్కువ స్థాయినుంచి తీవ్రస్థాయి వరకు వినికిడి నష్టం
60-75dB	తీవ్రమైన	
75dB ఆ పైన	అతి తీవ్రమైన	వినికిడి యంత్రాలు పనిచేయవు

8. **బహుళ వైకల్యం ఉన్న పిల్లలు:** పిల్లలు రెండు లేదా అంతకంటే ఎక్కువ రకాల వైకల్యాలు కలిగి ఉండటం, సమస్యతోపాటు బుద్ధిమాంద్యం కలిగి ఉండటమే బహుళ వైకల్యం.

- ప్రత్యేక అవసరాలున్న పిల్లల వర్గీకరణలో 'డన్' అనే శాస్త్రవేత్త మనస్తత్వ విద్యాపరంగా సాధారణ పిల్లల కంటే ముందంజలో ఉన్న ప్రతిభావంతులైన పిల్లలను ప్రత్యేక అవసరాలున్న పిల్లలుగా గుర్తించాడు.
- ప్రతిభావంతుల ఐక్యూ 140 కంటే ఎక్కువగా ఉంటుంది.

ప్రతిభావంతుల ప్రత్యేక విద్యావిధానం


1. **త్వరితం/ఉచ్ఛగతి:** వేగంగా విద్యాకార్యక్రమాలు లబ్ధి పొందడం
2. **వేర్పాటు/పృథక్కరణ:** సాధారణ పాఠశాల నుంచి వేరుచేసి ప్రత్యేక విద్యా సౌకర్యాలు అందించడం బహుళరూప మెరుగైన విద్యా ప్రణాళికలు ఏర్పాటుచేయడం
3. **సంవృద్ధిమత్వం:** ప్రతిభావంతులకు సాధారణ పాఠశాలలోనే అదనపు తరగతులు, విద్యానుభవాలు, అభ్యసనానుభవాలు కల్పించి నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంపొందించడం.

ప్రత్యేక అవసరాల పిల్లలు - ప్రత్యేక చట్టాలు

1. మానసిక ఆరోగ్య చట్టం
2. రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1992-93
3. వికలాంగుల చట్టం- 1995
4. జాతీయ ట్రస్ట్ చట్టం- 1999

- ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు చట్టం- 2009 కూడా ప్రత్యేక అవసరాలున్న 6-14 ఏండ్ల బాలలందరికీ విద్యనందించడం తప్పనిసరి అని సూచిస్తుంది.
- మానసిక ఆరోగ్య చట్టం-1987 ప్రకారం మానసిక వికలాంగులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు ఉచితంగా కల్పించి సమాజంలో జీవించగలిగే సామర్థ్యాలు పెంచాలని సూచిస్తుంది.
- రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా-1982 ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధించే హక్కును కల్పించింది.
- వికలాంగుల చట్టం-1985 ప్రకారం ప్రత్యేక అవసరాలు పిల్లలు 18 ఏండ్ల వయస్సు ఉన్నవారికి ఉచిత విద్యను అందించడం, సాధారణ పాఠశాలలోనే వికలాంగులైన పిల్లలను చదువుకునేలా ప్రోత్సహించడం, ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వం నుంచి సహాయం పొందుతున్న విద్యా సంస్థల్లో వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్‌కు తక్కువ కాకుండా చూడాలి.
- ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మన రాష్ట్రంలో రాజీవ్ విద్యామిషన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు

1. ప్రత్యేక శిక్షణ పొందిన మండల రిసోర్స్ టీచర్స్ ద్వారా తీవ్ర, అతి తీవ్ర వైకల్యం కలిగిన పిల్లలకు ఇంటివద్దనే విద్యనందించి వారి సామర్థ్యాలను పెంపొందించడం.
2. ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు, తిరిగి పాఠశాలల్లో ప్రవేశం పొందిన ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధించడానికి ప్రత్యేక శిక్షణ పొందిన సంచార ఉపాధ్యాయులను నియమించి విద్యనదించడం.
3. వైకల్య నిర్ధారణ అయిన పిల్లలకు మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చంకకర్రలు, కంటి అద్దాలు, బ్రెయిలీ పలకలు, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందించి సాధారణ పాఠశాలల్లో చేర్పించి విద్యనందించడం.
4. తీవ్ర, అతితీవ్ర వైకల్యం ఉన్న పిల్లలను చక్రాల కుర్చీ ద్వారా బడికి తీసుకురావాలి. ఇంటికి తీసుకెళ్లే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ అందించడం
5. స్వల్ప మానసిక బుద్ధిమాంద్యం ఉన్నవారిని పాఠశాలలో చేర్పించి, ప్రత్యేక శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ ఇచ్చి, వారి తరగతికి అనుగుణంగా సామర్థ్యాలను పెంపొందించి తిరిగి సాధారణ పాఠశాలలో చేర్పించడం.
6. గ్రహణ మొర్రి, శూల, పోలియో, కంటి శస్త్రచికిత్సలు చేయించి సాధారణ పాఠశాలలో కొనసాగేట్లు పిల్లలకు చేయూతన్వివడం.
7. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలో చేర్పించి శిక్షణ.
8. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధించడం, మెలకువలు అందించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా చేపడుతున్నారు.


సామల రమేష్

సుడోకు

డైలీ సుడోకు 117 సమాధానం

2	6	3	9	5	1	8	7	4
8	9	5	7	4	2	3	6	1
4	7	1	3	6	8	2	5	9
6	5	4	2	1	7	9	8	3
3	1	8	4	9	5	6	2	7
9	2	7	8	3	6	4	1	5
5	4	2	1	8	3	7	9	6
7	3	6	5	2	9	1	4	8
1	8	9	6	7	4	5	3	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -118

	1		3	2				
		6			8			
5				6			7	3
		2			4			9
		5		8		4		
4			6			2		
1	5			9				6
			8			3		
				7	2		8	

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 5 ఫిబ్రవరి 2018

ఎయిమ్స్ ఎంబీబీఎస్ -2018

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నిర్వహించే ఎంబీబీఎస్ ఎంట్రెన్స్ వివరాలను ఎయిమ్స్ ఎగ్జామినేషన్ విభాగం ప్రకటించింది. మే 26, 27 తేదీల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం కానున్నది.

- ఈ పరీక్ష ద్వారా ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎయిమ్స్ న్యూఢిల్లీ, పాట్నా, భోపాల్, జోధ్‌పూర్, భువనేశ్వర్, రిషికేష్, రాయ్‌పూర్, గుంటూరు, నాగ్‌పూర్‌లలోని మెడికల్ కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.
- ఈ పరీక్ష రాయడానికి ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు లేదా ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్నవారు అర్హులు. ఇంగ్లిష్, ఫిజిక్స, కెమిస్ట్రీ, బయాలజీల్లో కనీసం 60 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు 50 శాతం) ఉత్తీర్ణులు.
- పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. రెండు షిఫ్టులలో ఈ పరీక్ష ఉంటుంది. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6.30 వరకు పరీక్ష నిర్వహిస్తారు.

– ఎడ్యుకేషన్ డెస్క్



ఫిజిక్స్




టీఆర్టీ ఫిజికల్ సైన్స్

1. కింది వాటిలో మితులు లేని భౌతిక రాశి?
1) యంగ్ గుణకం 2) పాయిజన్ నిష్పత్తి
3) స్థూల గుణకం 4) దృఢతా గుణకం
2. కాంతి సంవత్సరం దేనికి ప్రమాణం?
1) కాలం 2) దూరం 3) వడి 4) ఏడాది
3. కేంద్రక వ్యాసాన్ని కొలిచేందుకు ఉపయోగించే ప్రమాణం?
1) ఫెర్మి 2) ఆంగ్‌స్ట్రామ్
3) మైక్రాన్ 4) నానోమీటర్
4. పార్‌సెక్ ఉపమాణం దేన్ని కొలవడానికి?
1) కాలం 2) దూరం
3) ద్రవ్యరాశి 4) బలం
5. ఎలక్ట్రాన్ వోల్ట్ దేనికి ప్రమాణం?
1) శక్తి 2) ఆవేశం
3) పొటెన్షియల్ తేడా 4) ద్రవ్యరాశి
6. స్థిర వేగంతో ప్రయాణిస్తున్న పై భాగంలేని కారులో కూర్చున్న వ్యక్తి ఒక బంతిని నిలువుగా పైకి గాలిలోకి విసిరాడు. ఆ బంతి పడే చోటు?
1) కారుకు వెలుపల
2) కారులో ఆ వ్యక్తికి ఎదురుగా
3) కారులో ఆ వ్యక్తి పక్కకు
4) ఏ చేతితో విసిరాడో కచ్చితంగా అదే చేతిలో
7. నిలువుగా ఊర్ధ్వ దిశలో ప్రక్షిప్తం చేసిన వస్తువు వేగం, కాలం గ్రాఫ్?
1) పరావలయం 2) దీర్ఘవృత్తం
3) అతిపరావలయం 4) సరళరేఖ
8. కణం స్థానభ్రంశం శూన్యమైతే అది పూర్తిచేసిన దూరం?
1) తప్పకుండా సున్నా కావాలి
2) సున్నా అవ్వొచ్చు లేదా కాకపోవచ్చు
3) సున్నా కాదు
4) కణంపై ఆధారపడుతుంది
9. ఒక ఇంటి పైకప్పు నుంచి ఒక బాణంతో అంతే ఎత్తులో చెట్టు మీది ఉన్న ఆపిల్‌ను కొట్టారు. బాణం వదిలిన వెంటనే ఆపిల్ స్వేచ్ఛగా కిందికి పడటం ప్రారంభమైతే, ఆపిల్‌కు బాణం తగలాలంటే దాన్ని?
1) ఆపిల్ తొలి స్థానం కంటే కాస్తపైన గురిపెట్టాలి
2) ఆపిల్ తొలిస్థానం కంటే కాస్త కిందకు గురిపెట్టాలి
3) ఆపిల్ చివరగా నేలను చేరే బిందువును గురిపెట్టాలి
4) ఆపిల్‌పై గురిపెట్టాలి
10. ఏకరీతి వృత్తాకార చలనంలో ఉన్న ఒక వస్తువు?
1) వేగం స్థిరంగా ఉంటుంది
2) త్వరణం స్థిరంగా ఉంటుంది
3) కోణీయ వేగం స్థిరంగా ఉంటుంది
4) స్థానభ్రంశం స్థిరంగా ఉంటుంది
11. ఒక క్రీడాకారుడు R వ్యాసార్థం గల క్షితిజ సమాంతర వృత్తాకార మార్గం వెంట ఒక చుట్టు పూర్తిచేయడానికి 40 సెకన్లు పట్టింది. 2 ని. 20 సెకన్ల చివర అతని స్థానభ్రంశం పరిమాణం?
1) 7R 2) πR 3) 2πR 4) 2R
12. న్యూటన్ మూడు గమన నియమాల దృష్ట్యా కింది వాటిలో సరైన ప్రవచనం?
1) 2, 3 నియమాలను మొదటి నియమం నుంచి ఉత్పాదించవచ్చు
2) 3, మొదటి నియమాలను 2వ నియమం నుంచి ఉత్పాదించవచ్చు
3) మొదటి, 2వ నియమాలను 3వ నియమం నుంచి రాబట్టవచ్చు
4) ప్రతి నియమం దేనికదే స్వతంత్రం
13. ఒక వస్తువు బలం-కాలం వక్రంలో వైశాల్యం సూచించేది?
1) వస్తువు స్థానభ్రంశం
2) బలం చేసిన పని
3) వస్తువు పనిచేసే రేఖీయ ప్రచోదనం
4) వస్తువు రేఖీయ ద్రవ్యవేగం
14. న్యూటన్ రెండో నియమం వేటిని పాటిస్తుంది?
1) సదిశ నియమాలు
2) అదిశ నియమాలు
3) టెన్సర్ నియమాలు
4) జడత్వ నియమాలు
15. సదిశ Q దిశలో P అంశ శూన్యం అయితే ఈ రెండు సదిశ రాశులు ఒకదానికొకటి?
1) సమాంతరంగా ఉంటాయి
2) ప్రతి సమాంతరంగా ఉంటాయి
3) పరస్పరం లంబంగా ఉంటాయి
4) 45^0 కోణంతో ఉంటాయి
16. ఒక వస్తువుపై పనిచేసే బలం దాని వడికి విలోమానుపాతంలో ఉంటే ఆ వస్తువు గతిజశక్తి?
1) కాలానికి విలోమానుపాతంలో ఉంటుంది
2) కాలానికి అనులోమానుపాతంలో ఉంటుంది
3) కాలం వర్గానికి విలోమానుపాతంలో ఉంటుంది
4) స్థిరాంకం
17. గడియారంలోని స్ప్రింగ్?
1) ఎలాంటి శక్తిని నిల్వ ఉంచుకోదు
2) యాంత్రిక గతిజశక్తిని నిల్వ చేసుకుని ఉంటుంది
3) యాంత్రిక స్థితిజశక్తిని నిల్వ చేసుకుని ఉంటుంది
4) విద్యుత్ శక్తిని నిల్వ ఉంచుకుంటుంది
18. ఒక కణం వృత్తాకార మార్గానికి పరిమితమై క్రమంగా తగ్గుతున్న రేఖీయ వడితో భ్రమణం చేస్తుంది. అప్పుడు?
1) కేంద్రం పరంగా ఆ కణం నిత్యత్వం అవుతుంది (ఆ కోణీయ ద్రవ్యవేగం)
2) ఆ కణం కోణీయ ద్రవ్యవేగం L దిశ మాత్రమే నిత్యత్వం అవుతుంది
3) ఆ కణం కేంద్రంవైపు సర్పిలాకార మార్గంలో చలిస్తుంది
4) కణం త్వరణం కేంద్రంవైపు ఉంటుంది
19. కణాల వ్యవస్థపై పనిచేసే అన్ని బాహ్యబలాల ఫలిత బలం శూన్యం అయితే ఒక జడత్వ నిర్దేశ చట్రం నుంచి గమనించినప్పుడు?
1) ఆ వ్యవస్థ రేఖీయ ద్రవ్యవేగం కాలంతో మారదు
2) ఆ వ్యవస్థ గతిజశక్తి కాలంతో మారదు
3) ఆ వ్యవస్థ కోణీయ ద్రవ్యవేగం కాలంతో మారదు
4) ఆ వ్యవస్థ స్థితిజశక్తి కాలంతో మారదు
20. గరుకు క్షితిజ సమాంతర తలంపై ఒక బంతి దొర్లుతుంది. దాని వేగం క్రమంగా శూన్యం వరకు తగ్గింది. దానిపై పనిచేసే ఘర్షణ బలం దాని?
1) రేఖీయ వేగాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తుంది
2) కోణీయ వేగాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తుంది
3) రేఖీయ వేగాన్ని పెంచడానికి ప్రయత్నిస్తుంది
4) కోణీయ ద్రవ్యవేగాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తుంది
21. ఒక మనిషి స్వేచ్ఛా ప్రదేశంలో భ్రమణం చేస్తూ చేతులు చాచి లేదా ముడుచుకుని శరీరాకృతిని మార్చుకుంటున్నప్పుడు అతని?
ఎ. జడత్వ భ్రామకం మారుతుంది
బి. కోణీయ ద్రవ్యవేగం మారుతుంది
సి. కోణీయ వేగం మారుతుంది
డి. భ్రమణ గతిజశక్తి మారుతుంది
1) ఎ, బి 2) ఎ, బి, డి
3) ఎ, సి, డి 4) బి, సి, డి
22. వడి అవిచ్ఛిన్నంగా పెరుగుతూ ఉండే విధంగా ఒక కణం వృత్తాకార మార్గంలో చలిస్తుంది. వృత్త వ్యాసం మీద కణం ప్రక్షేప చలనం?
1) ఆవర్తన 2) డోలనాత్మక
3) సరళహరాత్మకం 4) సమవేగంతో కూడిన
23. లఘులోలకానికి ఉక్కు గోళం బదులు అదే పరిమాణంలో చెక్కతో చేసిన గోళాన్ని వేలాడదీసినట్లయితే లోలకం ఆవర్తన కాలం?
1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
3) మారదు 4) సగం అవుతుంది
24. లఘులోలకం గోళం బోలుగా ఉండి నీటితో నిండి ఉంది. గోళం అడుగున రంధ్రం చేస్తే కొద్దిసేపటికి నీరంతా బయటికి పోయి గోళం ఖాళీ అయ్యింది. ఈ సమయంలో లోలక డోలనావర్తన కాలం?
1) మారదు
2) క్రమంగా పెరుగుతూ స్థిరంగా ఉంటుంది
3) మొదట పెరిగి, ఆ తర్వాత తొలి విలువకు తగ్గుతుంది
4) మొదట తగ్గి, ఆ తరువాత పెరుగుతుంది
25. భూమి సూర్యుని చుట్టూ తిరిగే కక్ష్యలో జూలై నెలలో కంటే జనవరి నెలలో ఎక్కువ వేగంగా తిరుగుతుంది. ఇది దేన్ని సూచిస్తుంది?
1) భూమి జూన్ నెలలో కంటే జనవరి నెలలో సూర్యునికి దగ్గరగా ఉంటుంది
2) భూమి జూన్ నెలలో కంటే జనవరి నెలలో సూర్యునికి గరిష్ఠ దూరంలో ఉంటుంది
3) సంక్రాంతి జనవరి నెలలో వస్తుంది కాబట్టి సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చెందడానికి ఆత్రుతపడతాడు
4) కొత్త ఏడాది జనవరి నెలలో మొదలవడం వల్ల దాన్ని అందుకోవడానికి సూర్యుడు వడివడిగా తిరుగుతాడు
26. కెప్లర్ గ్రహగతుల నియమాల సందర్భంలో గ్రహ కక్ష్య ఉత్కేంద్రత (e) విలువ సున్నా అయితే ఆ కక్ష్య?
1) దీర్ఘ వృత్తాకారం
2) వృత్తాకారం
3) అతి పరావలయ ఆకారం
4) ఉత్కేంద్రత e విలువ సున్నాను సమీపిస్తున్న కొద్దీ అది ఎలాంటి వక్రపు జాడను గీయదు
27. ఒక ఊహాజనిత నక్షత్రం చుట్టూ తొమ్మిది ఊహాజనిత గ్రహాలు ఒకే అర్ధగురు అక్షం పొడవులు వేర్వేరు ఉత్కేంద్రతలను కలిగి ఉంటూ తిరుగుతున్నాయి అనుకుందాం. అప్పుడు కింది వాటిలో వాస్తవమైనది?
1) ఈ గ్రహాలన్నింటికి స్థితిజశక్తి సమానంగా ఉంటుంది
2) ఈ గ్రహాలన్నింటికి గతిజశక్తి సమానంగా ఉంటుంది
3) ఈ గ్రహాలన్నింటి యాంత్రికశక్తి సమానంగా ఉంటుంది
4) ఈ గ్రహాలన్నింటి స్థితిజశక్తి మాత్రమే సమానంగా ఉంటుంది, గతిజశక్తి సమానంగా ఉండదు
28. ఒక మామిడి పండు ఒక చెట్టు కొమ్మకు వేలాడుతున్నది. అంతే ద్రవ్యరాశి ఉన్న మరో మామిడిపండు అంతే ఎత్తు నుంచి అప్పడే కిందికి పడటం ప్రారంభించింది. వేలాడుతున్న మామిడి పండు కింద పడుతున్న క్షణంలో ఈ మామిడి పండ్లపై గురుత్వాకర్షణ బలాలను పోల్చినట్టయితే మనం ఏ నిర్ణయానికి వస్తాం?
1) వేలాడుతున్న మామిడి పండుపై కంటే కింద పడుతున్న పండుపై గురుత్వాకర్షణ బలం ఎక్కువ
2) కిందపడుతున్న మామిడి పండుపై కంటే వేలాడుతున్న పండుపై గురుత్వాకర్షణ బలం ఎక్కువ
3) వేలాడుతున్న మామిడి పండు, కిందపడుతున్న మామిడి పండు ఒకే గురుత్వాకర్షణ బలాన్ని అనుభవిస్తాయి
4) మామిడి పండు పడిందా లేదా అనే విషయంపై పాక్షికంగా గురుత్వాకర్షణ బలం ఆధారపడి ఉంటుంది
29. రెండు కృత్రిమ ఉపగ్రహాలు భూమిచుట్టూ ఒకే వ్యాసార్థం ఉన్న వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తున్నాయి. ఒక కృత్రిమ ఉపగ్రహం ద్రవ్యరాశిలో వేరొక దానికి రెట్టింపు ఉంది. అప్పుడు?
1) ఎక్కువ బరువున్న కృత్రిమ ఉపగ్రహం తేలికైన దానికంటే రెండు రెట్లు ఎక్కువ వేగంతో పరిభ్రమిస్తుంది
2) రెండు కృత్రిమ ఉపగ్రహాలకు ఒకే కక్ష్యా వడి ఉంటుంది
3) తక్కువ బరువున్న కృత్రిమ ఉపగ్రహం ఎక్కువ బరువున్న దానికంటే రెండు రెట్లు ఎక్కువ వేగంతో పరిభ్రమిస్తుంది
4) ఎక్కువ బరువున్న కృత్రిమ ఉపగ్రహం తేలికైన దానికంటే 4 రెట్లు ఎక్కువ వేగంతో పరిభ్రమిస్తుంది
30. సూర్యుడు అకస్మాత్తుగా ఒక కృష్ణబిలంగా రూపాంతరం చెందిందని ఊహిద్దాం. అలాంటి ఒక ఊహాజనిత పరిస్థితిలో...?
1) కృష్ణబిలం అపరిమితమైన గురుత్వాకర్షణ బలం కారణంగా సూర్యుడి గర్భంలోకి భూమి పీల్చబడుతుంది
2) అంతరిక్షంలోకి స్పర్శరేఖీయంగా భూమి ఎగిరిపోతుంది
3) భూమి తన అసలైన కక్ష్యలోనే పరిభ్రమించడం కొనసాగిస్తుంది
4) భూమి తన అసలైన కక్ష్యలోనే పరిభ్రమించినప్పటికీ మునుపటికంటే రెండు రెట్లు శక్తిని కలిగి ఉంటుంది
31. పదార్థపు స్థితిస్థాపకతను ప్రభావితం చేయగలిగినవి?
ఎ. మోదన, అనీలనం
బి. పదార్థంలోని మాలిన్యం
సి. ఉష్ణోగ్రతలో మార్పు
1) ఎ 2) బి 3) సి 4) పైవన్నీ
32. వేర్వేరు పదార్థాలతో తయారు చేయబడి ఒకే రకంగా ఉన్న లోహపు తీగల ఖండన ప్రతిబలం?
1) తీగ సాంద్రతపై ఆధారపడుతుంది
2) తీగ మధ్యచ్ఛేద వైశాల్యంపై ఆధారపడుతుంది
3) తీగపొడవుపై ఆధారపడుతుంది
4) తీగ యంగ్ గుణకంపై ఆధాపడుతుంది
33. l పొడవు, A మధ్యచ్ఛేద వైశాల్యం గల ఇనుప కడ్డీని 0^0 నుంచి 100^0 C ఉష్ణోగ్రత వరకు వేడిచేశారు. కడ్డీలో వ్యాకోచం లేదా కడ్డీని వంగకుండా ఉండేలా పట్టుకున్నట్లయితే అందులో వృద్ధిచెందే బలం?
1) కడ్డీ మధ్యచ్ఛేద వైశాల్యానికి విలోమానుపాతంలో ఉంటుంది
2) కడ్డీ పొడవుపై ఆధారపడదు
3) కడ్డీ పొడవుకు విలోమానుపాతంలో ఉంటుంది
4) కడ్డీ పొడవుకు అనులోమానుపాతంలో ఉంటుంది
34. కింది ప్రవచనాల్లో ఏది తప్పు?
1) ఆదర్శ దృఢ వస్తువు యంగ్ గుణకం శూన్యం
2) ఆయతన గుణకాన్ని ఘన, ద్రవ, వాయు పదార్థాలకు నిర్వచిస్తారు
3) ఉక్కుకంటే రబ్బరు తక్కువ స్థితిస్థాపకత గల పదార్థం
4) ఒక లోహ తీగ సాగుదల దాని నిమోటన గుణకంపై ఆధారపడుతుంది
35. ద్రవాన్ని వేడిచేస్తే దాని స్పర్శా కోణం పెరుగుతుంది. సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ఆ ద్రవం తలతన్యత?
1) అనంతం 2) సున్నా
3) నిర్వచించలేం 4) చాలా కొంచెం
36. ద్రవం ఉపరితలంపై ఒక సూది తేలుతూ ఉండగలిగే దృగ్విషయానికి కారణం?
1) ద్రవం స్నిగ్ధత 2) ద్రవ తలతన్యత
3) ద్రవ ఉల్లేకనం 4) ఆర్కిమెడిస్ సూత్రం
37. ఆటోమైజర్ పనిచేసే విధానం?
1) ద్రవం తలతన్యతపై ఆధారపడుతుంది
2) గురుత్వ త్వరణంపై ఆధారపడుతుంది
3) బెర్నౌలీ సూత్రంపై ఆధారపడుతుంది
4) ద్రవం స్నిగ్ధతపై ఆధారపడుతుంది
38. l పొడవు ఉండే లోలకాన్ని కలిగిఉన్న గడియారం 20^0 C వద్ద సరైన సమయాన్ని ఇస్తుంది. గడియారం 60^0 C పనిచేస్తే అది?
1) నిదానంగా నడుస్తుంది
2) వేగంగా నడుస్తుంది
3) కచ్చితంగా నడుస్తుంది
4) చెప్పలేం
39. 277^0 K వద్ద ఒక పాత్రలో నీటిని నింపారు. ఉష్ణోగ్రతను తగ్గిస్తే ఆ పాత్రలోని నీరు?
1) పొర్లిపోతుంది 2) పొర్లదు
3) ద్రవమట్టం పడిపోతుంది 4) ఏమీ చెప్పలేం
40. స్థిర ఘనపరిమాణ వాయు థర్మామీటర్ పనిచేసే సూత్రం?
1) బాయిల్ నియమం 2) చార్లెస్ నియమం
3) అవగాడ్రో నియమం 4) డాల్టన్ నియమం
41. నీటిని 0 నుంచి 4^0C మధ్య ఘనపరిమాణ వ్యాకోచ గుణకం?
1) రుణాత్మకం 2) ధనాత్మకం
3) సున్నా 4) కనిష్టం
42. ఒక ద్విలోహాత్మక పట్టీ ఇత్తడి, ఇనుమును కలిగి ఉంది. దాన్ని వేడిచేసినప్పుడు ఇత్తడి కుంభాకారం వైపు ఇనుము, పుటాకారం వైపు ఉండేటట్లుగా ఒక చాపంగా వంగింది. ఇలా జరగడానికి కారణం?
1) ఇత్తడి, ఇనుము కంటే ఎక్కువ ఉష్ణధారణ సామర్థ్యం కలిగి ఉండటం
2) ఇత్తడి సాంద్రత ఇనుము కంటే ఎక్కువ
3) ఇనుము బద్దను ఇత్తడి బద్ద కంటే సులభంగా వంచవచ్చు
4) ఇత్తడి ∝b విలువ ఇనుము కంటే ఎక్కువ
43. వాయువుల్లో ధ్వని వేగాన్ని తెలిపే న్యూటన్ నియమాన్ని లాప్లస్ సవరించడానికి కారణం?
1) ధ్వని తరంగాలు కనిష్ట తరంగ దైర్ఘ్యం కలిగి ఉంటాయి
2) ధ్వని తరంగాలు సమోష్ణోగ్రత పరిస్థితుల్లో ప్రయాణిస్తాయి
3) ధ్వని తరంగాలు స్థిరోష్ణోగ్రత పరిస్థితుల్లో ప్రయాణిస్తాయి
4) ధ్వని తరంగాలు అనుదైర్ఘ్య తరంగాలు
44. కింది తరంగ ధర్మాల్లో మిగిలినవాటిపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండేది?
1) తరంగదైర్ఘ్యం 2) కంపన పరిమితి
3) పౌనఃపున్యం 4) వేగం

ANSWERS

1-2	12-2	23-3	34-1
2-2	13-3	24-3	35-2
3-1	14-1	25-1	36-2
4-2	15-3	26-2	37-3
5-1	16-2	27-3	38-1
6-4	17-3	28-3	39-1
7-4	18-2	29-2	40-2
8-2	19-1	30-4	41-1
9-2	20-1	31-4	42-4
10-3	21-3	32-4	43-3
11-4	22-2	33-2	44-3




P. Sreenivas
Physics Sr.Faculty,
Hyderabad
9700724464

కెమిస్ట్రీ

1. కింది వాటిలో ఏది భౌతిక మార్పు కాదు?
1) NH4 Cl ను వేడిచేయడం
2) ZnO ను వేడిచేస్తే పసుపు రంగులోకి మారడం
3) పారఫిన్ మైనాన్ని వేడి చేయడం
4) లెడ్ నైట్రేట్‌ను వేడి చేయడం
2. లెడ్ నైట్రేట్‌ను వేడిచేస్తే వెలువడే జేగురు రంగు వాయువు?
1) NO_2 2) O_2
3) H_2 4) N_2
3. కింది వాటిలో ఏది రసాయన మార్పు కాదు?
1) $CuCO_3$ ని వేడి చేయడం
2) మెగ్నీషియం తీగను గాలిలో మండించడం
3) జింక్ కార్బోనేట్‌ను వేడి చేయడం
4) రసాయన సంఘటనంలో మార్పు రాదు
4. భౌతిక మార్పు కానిది?
1) కొత్త పదార్థాలు ఏర్పడవు
2) ఫార్ములాలో మార్పు ఉండదు
3) ఇరువైపులా చర్య ఉంటుంది, తిరిగి మొదటి పదార్థాన్నే పొందవచ్చు
4) సంఘటనంలో మార్పు వస్తుంది
5. $CuCO_3$ రంగు?
1) ఆకుపచ్చ 2) పసుపుపచ్చ
3) నలుపు రంగు 4) రంగు ఉండదు
6. కింది వాటిలో దేన్ని వేడి చేయడం రసాయనిక చర్య?
1) సోడియం నైట్రేట్ ($NaNO_3$)
2) కాపర్ కార్బోనేట్ ($CuCO_3$)
3) పొటాషియం నైట్రేట్ (KNO_3)
4) పైవన్నీ
7. కాపర్ కార్బోనేట్‌ను వేడిచేస్తే ఏర్పడే నల్లటి పదార్థం?
1) $CuCl_2$ 2) CuO
3) $CuBr_2$ 4) CuI_2
8. ఇనుప ముక్కను అయస్కాంతీకరణ చేయడం?
1) భౌతిక మార్పు 2) రసాయన మార్పు
3) పై రెండూ 4) ఏదీకాదు
9. కింది వాటిలో ఏది రసాయన చర్య కాదు?
1) $C + O_2 \rightarrow CO_2$
2) $2Mg + O_2 \rightarrow 2MgO$
3) $S + O_2 \rightarrow CO_2$
4) $NH4Cl \rightarrow NH4Cl$
10. కింది వాటిలో భౌతిక మార్పు?
1) ద్రావణం ఏర్పడటం
2) పదార్థం ఉత్పతనం చెందడం
3) ఇది తాత్కాలికం, ఫార్ములాలో మార్పు ఉండదు
4) పైవన్నీ సరైనవే
11. కింది వాటిలో రసాయన సంయోగ నియమం కానిది?
1) ద్రవ్య నిత్యత్వ నియమం
2) స్థిరానుపాత నియమం
3) బాహ్యానుపాత నియమం
4) వియోగ నియమం
12. ఒక చర్యలో క్రియాజనకాల భారం, క్రియాజన్యాల భారం రెండూ సమానం అయిన, ఆ నియమం?
1) ద్రవ్య నిత్యత్వ నియమం
2) స్థిరానుపాత నియమం
3) బాహ్యానుపాత నియమం
4) ఏదీకాదు
13. కింది వాటిలో వియోగ చర్య ఏది?
1) లెడ్ నైట్రేట్‌ను వేడి చేయడం
2) నీటిని విద్యుత్ విశ్లేషణం చెందించడం
3) సూర్యకాంతి సమక్షంలో సిల్వర్ బ్రోమైడ్‌ను చర్య నొందించడం
4) పైవన్నీ
14. కింది వాటిలో స్థానభ్రంశ చర్య ఏది?
1) $Fe + CuSO_4 \rightarrow FeSO_4 + Cu$
2) $Zn + CuSO_4 \rightarrow ZnSO_4 + Zn$
3) $A + B + C \rightarrow A - C + B$
4) పైవన్నీ
15. కింది వాటిలో రసాయన సంయోగ చర్య ఏది?
1) $X + Y \rightarrow X - Y$
2) $Mg + Cl_2 \rightarrow MgCl_2$
3) $CaCO_3 \rightarrow CaO + CO_2$
4) 1, 2
16. కింది వాటిలో ద్వంద్వ వియోగ చర్య?
1) $X + YZ \rightarrow XY + Z$
2) $X + Y \rightarrow XY$
3) $XYZ \rightarrow YZX$
4) $XY + A - B \rightarrow XA + YB$
17. $CuO + H_2 \rightarrow Cu + H_2O$ రసాయన చర్యలో క్షయకారిణి ఏది?
1) CuO 2) H_2 3) Cu 4) H_2O
18. సల్ఫ్యూరిక్ ఆమ్లంతో చర్య జరిపినపుడు జింక్‌ను స్థానభ్రంశం చెందించే వాయువు?
1) O_2 2) CO_2
3) NO_2 4) H_2
19. ఇనుము తుప్పు పట్టడం?
1) ఆక్సీకరణం, సంయోగ చర్య
2) ఆక్సీకరణం, స్థానభ్రంశ చర్య
3) క్షయకరణం, సంయోగ చర్య
4) క్షయకరణం, ద్వంద్వ వియోగం
20. $H_2S + Cl_2 \rightarrow S + 2HCl$ సమీకరణంలో Cl_2 అనేది?
1) ఆక్సీకరణి 2) క్షయకారిణి
3) పై రెండూ 4) చెప్పలేం
21. X ఆవేశం +3, అది ఒక ఫాస్ఫేట్ అయాన్‌తో చర్య జరిపితే దానికి సంబంధిత ఫార్ములా?
1) XPO_4 2) XPO_3
3) XPO_2 4) XPO_5
22. కింది వాటిలో వాయుస్థితిలో లేని మూలకం?
1) హైడ్రోజన్ 2) ఆమ్లజని
3) కార్బన్ డై ఆక్సైడ్ 4) నత్రజని
23. కింది వాటిలో ఏ సంకేతం లాటిన్ నుంచి రాలేదు?
1) Fe 2) Hg 3) Sn 4) Ar
24. కింది వాటిలో ఏవి చతుర్, అష్ట పరమాణుకతను కలిగి ఉంటాయి?
1) P, S 2) S, P
3) P, Na 4) H, Na
25. కింది వాటిలో చతుర్‌సంయోజకత లేనిది?
1) లెడ్ 2) ప్లాటినం
3) టిన్ 4) ఐరన్
26. కింది వాటిలో అయాన్ కానిది ఏది?
1) ఆక్సైడ్ 2) నైట్రైడ్
3) నైట్రేట్ 4) ఆక్సిజన్
27. జింక్ పూత వేయడం ద్వారా ఇనుము తుప్పుపట్టకుండా నిరోధించే పద్ధతి?
1) గాల్వనైజేషన్ 2) తుప్పుపట్టడం
3) కార్బోనైజేషన్ 4) పల్వనైజేషన్
28. STP వద్ద 44 గ్రా. CO_2 వాయువు ఆక్రమించునది, కలిగినది?
1) 22.4 లీ.
2) 6.023×10^{23} CO_2 అణువులు
3) గ్రామ్ మోలార్ ఘ.ప.
4) పైవన్నీ
29. చలువరాతి ముక్కలను వేడిచేస్తే వచ్చేది?
1) Ca, CO_2 2) CaC_2, O_2
3) $CaO + CO_2$ 4) ఏదీకాదు
30. లెడ్ నైట్రేట్‌ను విఘటం చెందించే వాయువులు?
1) $H_2 + N_2$ 2) $NO_2 + O_2$
3) $NO_2 + N_2$ 4) NO_2
31. హైడ్రోజన్ అంటే లాటిన్ భాషలో?
1) నీటిని ఇచ్చేది 2) ఆమ్లాన్ని ఇచ్చేది
3) రెండూ ఇచ్చేది 4) లవణాన్ని ఇచ్చేది
32. ఆక్సీకరణం అంటే లాటిన్ భాషలో?
1) నీటిని ఇచ్చేది 2) ఆమ్లాన్ని ఇచ్చేది
3) పై రెండూ 4) లవణాన్ని ఇచ్చేది
33. H_2 ను సేకరించే పద్ధతి?
1) అధో ముఖస్థాన చలనం
2) ఊర్ధ్వ ముఖస్థాన చలనం
3) 1, 2 4) ఏదీకాదు
34. కింది వాటిలో H_2 – వాయు ధర్మం కానిది ఏది?
1) అతి తేలికైన వాయువు
2) ఆక్సీ హైడ్రోజన్ జ్వాల ఉష్ణోగ్రత – 2400^0 C
3) ఇది లిట్మస్‌కు పరీక్ష ఇస్తుంది
4) ఇది సల్ఫర్‌తో చర్యనొంది H_2S వాయువును ఇస్తుంది
35. H_2 వాయువు తయారీలో థిసిల్ గరాటు ఆమ్లంలో ఎందుకు మునిగి ఉండాలి?
1) మునిగి ఉండకపోతే H_2 వాయువు దాని గుండా బయటికి పోయే అవకాశం ఉంది
2) ఇతర వాయువులు లోపలికి రాకుండా
3) ఏవిధంగా ఉన్నా పర్వాలేదు
4) ఏదీకాదు
36. కింది వాటిలో సరికానిది?
1) ఆక్సిజన్‌లను కలుపడం ఆక్సీకరణం
2) H_2– లను తొలగించడం ఆక్సీకరణమే
3) ఆక్సీకరణ స్థితిలో తగ్గుదల – క్షయకరణం
4) ఆక్సీకరణ స్థితిలో పెరుగుదల క్షయకరణం
37. $2K + Cl_2 \rightarrow 2KCl$ అనే చర్య ఆక్సీకరణి, క్షయకారిణిలు వరుసగా...
1) K, Cl_2 2) $Cl_2–, K$
3) K, K 4) K, KCl
38. నీటి విద్యుత్ వాహకతను పెంచడానికి ఏం కలుపుతారు?
1) NaCl 2) HCl
3) NH_3 4) Cl_2
39. నీటిని విద్యుత్ విశ్లేషణం చేస్తే వెలువడే ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువుల ఘనపరిమాణాల నిష్పత్తి?
1) 1:2 2) 2:1 3) 1:1 4) 4:1
40. ప్రయోగశాలలో O_2 ను సేకరించే పద్ధతి?
1) అధోముఖ 2) ఊర్ధ్వముఖ
3) 1, 2 4) ఏదీకాదు
41. కింది వాటిలో సల్ఫర్ దాతువు కానిది ఏది?
1) గెలినా 2) సిన్నబార్
3) ఐరన్ పైరటిస్ 4) కార్నలైట్
42. కింది వాటిలో అధిక స్థిరత్వం కాలిగింది?
1) రాంబిక్ సల్ఫర్ 2) మోనోక్లినిక్ సల్ఫర్
3) ప్లాస్టిక్ సల్ఫర్ 4) ఏదీకాదు
43. కింది వాటిలో ఏది సల్ఫర్ గొలుసులుగా ఉంటుంది?
1) రాంబిక్ సల్ఫర్ 2) మోనిక్లినిక్ సల్ఫర్
3) ప్లాస్టిక్ సల్ఫర్ 4) పైవన్నీ
44. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత ఎంత?
1) 76^0C 2) 86^0C
3) 96^0C 4) 106^0C

ANSWERS

1-4	12-1	23-4	34-3
2-1	13-4	24-1	35-1
3-4	14-4	25-4	36-4
4-4	15-4	26-4	37-2
5-1	16-4	27-1	38-1
6-4	17-2	28-4	39-1
7-2	18-4	29-3	40-1
8-1	19-1	30-2	41-4
9-4	20-1	31-1	42-1
10-4	21-1	32-2	43-3
11-4	22-3	33-1	44-3



కెమిస్ట్రీ చంద్రం
కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీ
నల్గొండ. 9848 595 085

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 5 ఫిబ్రవరి 2018


హైపర్ ఆది, వెంకీ, వరుణ్‌తేజ్, బీవీఎస్ఎన్ ప్రసాద్, దిల్ రాజు, రాశీఖన్నా

ఆ సినిమాకు ఇది ఇమిటేషన్ మాత్రమే!

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తొలిప్రేమ'. రాశీ ఖన్నా కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు విడుదల చేస్తున్నారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను శనివారం రాత్రి ఏపీలోని భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''తొలిప్రేమ' అనగానే అందరికీ ఏం గుర్తొస్తుందో నాకు తెలుసు. 20 ఏళ్ల తరువాత అదే టైటిల్‌తో మళ్లీ సినిమా చేస్తున్నాం. ఆ సినిమాకు ఇది ఇమిటేషన్ మాత్రమే కానీ రీమేక్ కాదు. ఈ కథకు సరిపోవడంతో టైటిల్‌ను మాత్రమే తీసుకున్నాం. బాబాయ్ టైటిల్‌ను పాడు చేస్తానని అభిమానులు భయపడక్కర్లేదు. నేను నా ఫిల్మ్ కెరీర్ మొదలుపెట్టినప్పుడు ఫస్ట్ షూటింగ్ భీమవరంలోనే జరిగింది. ఈ విషయాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. వెంకీకి తొలి చిత్రమే అయినా చాలా చక్కగా కథ రాసుకుని మా నుంచి మంచి నటనను రాబట్టుకున్నాడు. ఈ సినిమా తరువాత వెంకీ పెద్ద దర్శకుడు అవుతాడు. తొలి నుంచి ఈ కథపై గట్టి నమ్మకంతో వున్న దిల్ రాజు ఈ చిత్రానికి మూలస్థంభంలా నిలిచారు. నిర్మాత ప్రసాద్‌గారు కూడా కథని నమ్మిచేశారు. ఏ విషయంలోనూ ఖర్చుకు వెనుకాడలేదు. ఆదరిస్తున్న మెగా అభిమానులకు కృతజ్ఞతలు. కొన్ని కారణాల వల్ల నా సినిమాతో పాటు తేజు(సాయిధరమ్‌తేజ్) నటించిన 'ఇంటిలిజెంట్' ఒక రోజు ముందుగా విడుదలవుతున్నది. ఆ సినిమా కూడా మంచి విజయం సాధించాలి. ఈ రెండు చిత్రాలకు అభిమానుల దీవెనలుండాలి' అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్‌గారు 'తొలిప్రేమ' చేసినప్పుడు ఎంత ఫ్రెష్‌నెస్ అనిపించిందో ఈ చిత్రాన్ని మొదలుపెట్టినప్పుడు కూడా అంతే నిజాయితీతో తీయడం జరిగింది. ఈ టైటిల్ పెడదామని అనుకున్నప్పుడు భయం వేసింది. 'సినిమాకు ఈ టైటిల్ పెడుతున్నాం అంతా ఓకే కదా' అని వరుణ్ హెచ్చరించాడు. ఆ సినిమాతో మాత్రం పోల్చలేను కానీ ఆ సినిమా గౌరవాన్ని మాత్రం కాపాడతాను' అన్నారు. '1998లో 'తొలిప్రేమ'..2018లో 'తొలిప్రేమ'..ఈ రెండు చిత్రాల్ని నేనే డిస్ట్రిబ్యూట్ చేయడం నా అదృష్టం. ఈ సినిమా వంద శాతం యూత్ ఫిల్మ్. వరుణ్‌కు 'ఫిదా' తరువాత అంత మంచి సినిమా అవుతుంది' అని దిల్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాశీఖన్నా, ఎమ్మెల్యే రాధాకృష్ణ, బీవీఎస్ఎన్ ప్రసాద్, హైపర్ ఆది తదితరులు పాల్గొన్నారు.

గోపీచంద్ 'పంతం'


గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. కె.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.కె. రాధా మోహన్ నిర్మిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. ఈ చిత్రానికి 'పంతం' అనే టైటిల్‌ను ఖరారుచేశారు. 'ఫర్ ఏ కాజ్' ఉపశీర్షిక. మే 18న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ 'సామాజిక ఇతివృత్తానికి వాణిజ్య విలువల్ని మేళవించి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఓ యువకుడి పంతానికి కారణమేమిటి? తన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో అతడికి ఎలాంటి ఆటుపోట్లు ఎదురయ్యాయన్నది థ్రిల్‌ను కలిగిస్తుంది. ఓ పాట, కొంత టాకీపార్ట్‌తో పాటు విరామ సన్నివేశాలకు సంబంధించిన పోరాటఘట్టాన్ని ఇటీవలే చిత్రీకరించాం. గోపీచంద్ నటిస్తున్న ఇరవైఐదవ సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే వైవిధ్యమైన ప్రయత్నంగా నిలుస్తుందనే నమ్మకముంది. బలుపు, జైలవకుశతో పాటు పలు విజయవంతమైన సినిమాలకు స్క్రీన్‌ప్లేను అందించిన చక్రవర్తి మాస్, క్లాస్‌తో పాటు అన్ని వర్గాలను అలరించేలా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు' అని తెలిపారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: ఎ.ఎస్.ప్రకాష్, సంభాషణలు: రమేష్‌రెడ్డి, స్క్రీన్‌ప్లే: కె. చక్రవర్తి, బాబీ(కె.ఎస్. రవీంద్ర), సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల.



అల్లు అర్జున్

మైనస్ 12 డిగ్రీల చలిలో..

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య- నా ఇల్లు ఇండియా'. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై కె. నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీష, శ్రీధర్ నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రధారులు. ప్రస్తుతం భారత సరిహద్దుల్లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'సూర్య అనే ఓ సైనికుడి కథ ఇది. కోపం, ఆవేశం కారణంగా వృత్తిపరంగా, వ్యక్తిగతంగా అతడికి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? వాటిని ఎలా అధిగమించాడన్నది చిత్ర కథ. సైనికుడి కథ కావడంతో సహజత్వం కోసం దేశ సరిహద్దుల్లో కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నాం. మైనస్ 12 డిగ్రీల ఉష్ణోగ్రతలో ప్రతికూల వాతావరణంలో తెరకెక్కిస్తున్న ఈ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. నిజమైన సైనికుల త్యాగాల స్ఫూర్తితో అల్లు అర్జున్ ఈ సన్నివేశాల కోసం శ్రమిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన టీజర్, సైనిక గీతానికి చక్కటి స్పందన లభిస్తున్నది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 14న మరో గీతాన్ని విడుదల చేయనున్నాం. మలయాళ వెర్షన్ టీజర్‌ను ఈ నెల 7న విడుదలచేస్తున్నాం. ఏప్రిల్ 27న సినిమాను విడుదలచేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, సినిమాటోగ్రఫీ: రాజీవ్‌రవి, సహనిర్మాత: బన్నీవాసు.

రవితేజకు జోడీగా..!


కాజల్ అగర్వాల్

'ఖైదీనంబర్ 150'తో మళ్లీ విజయాల బాటపట్టింది కాజల్ అగర్వాల్. తెలుగు, తమిళ భాషల్లో వరుస క్రేజీ చిత్రాల్లో నటిస్తున్న కాజల్ తాజాగా తెలుగులో మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. 'రాజా ది గ్రేట్' సినిమాతో స్పీడు పెంచిన రవితేజ ప్రస్తుతం కల్యాణ్ కురసాల రూపొందిస్తున్న సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రంతో పాటు ఆయన శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమాను అంగీకరించారు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. శ్రీను వైట్ల మార్కు ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా ఈ నెల 19న ప్రారంభం కానుందని, ఇందులో రవితేజ తొలిసారి త్రిపాత్రాభినయం చేయనున్నారని చిత్ర వర్గాల సమాచారం. కాగా ఈ సినిమా కోసం హీరోయిన్‌గా కాజల్ అగర్వాల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. గతంలో రవితేజ, కాజల్ కలిసి వీర, సారొచ్చారు చిత్రాల్లో నటించారు. ఇది వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న మూడవ చిత్రం. కాజల్‌తో పాటు ఇందులో మరో ఇద్దరు కథానాయికలు నటించనున్నారు. నివేదా థామస్ మరో నాయికగా నటించనున్న ఈ చిత్రం కోసం మూడవ నాయిక ఎంపిక జరగాల్సి వుంది. కాగా ఈ చిత్రానికి 'అమర్ అక్బర్ ఆంటోనీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.


నాగశౌర్య, గౌతమ్, ఉష, రష్మిక, శంకర్‌ప్రసాద్, వెంకీ కుడుముల

నా తప్పుల్ని క్షమించారు!

''ఛలో' హిట్టవుతుందని, మంచి సినిమాగా నిలుస్తుందని అనుకున్నాను. కానీ ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తుందని ఊహించలేదు' అని అన్నారు నాగశౌర్య. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఛలో'. వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. ఉషా మూల్పూరి నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం థ్యాంక్స్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగశౌర్య మాట్లాడుతూ 'గత సినిమాల్లో నేను చేసిన తప్పులను క్షమించి నాకో మంచి సక్సెస్‌ను ఇచ్చారు. ఎమోషనల్ జర్నీ ఇది. నేనొక్కడినే ఈ సినిమాకు బలం కాలేదు. నాతో పాటు దర్శకుడు వెంకీ కుడుముల, ఛాయాగ్రహకుడు సాయిశ్రీరామ్, సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ప్రతి ఒక్కరు ప్రాణం పెట్టి సినిమా చేశారు. రష్మిక, వెన్నెల కిషోర్‌తో పాటు నటీనటులంతా అద్భుతమైన నటనను ప్రదర్శించారు. మంగళవారం నుంచి నిర్వహించనున్న విజయయాత్ర ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రేక్షకుల్ని కలిసి వారితో ఈ సక్సెస్ పంచుకోనున్నాం' అని తెలిపారు. 'చిత్రసీమలో కొత్త దర్శకులకు అవకాశం లభించడం ఎంతో కష్టమైన పని. అలాంటిది నన్ను, నా కథను నమ్మి, సొంత సంస్థలో సినిమా చేసే అవకాశమిచ్చిన నాగశౌర్యకు జీవితాంతం రుణపడి ఉంటాను. ఉష, శంకర్‌ప్రసాద్ ఎక్కడ రాజీపడకుండా సినిమాను నిర్మించారు. నేను రాసిన పాత్రలకు నాగశౌర్య, రష్మిక పూర్తిగా న్యాయం చేశారు. పోటీపడి నటించారు' అని దర్శకుడు వెంకీ కుడుములు చెప్పారు. చిన్న సినిమాకు దక్కిన పెద్ద విజయమిదని రష్మిక మందన చెప్పింది. ఈ కార్యక్రమంలో ఉష, శంకర్‌ప్రసాద్, గౌతమ్, సాయిశ్రీరామ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


అమీర్‌ఖాన్

చైనాలో 500 కోట్లు

అమీర్‌ఖాన్ నటించిన 'సీక్రెట్ సూపర్‌స్టార్' చిత్రం చైనా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తున్నది. రెండు వారాల క్రితం విడుదలైన ఈ చిత్రం ఐదు వందల కోట్ల వసూళ్లను సాధించి సరికొత్త రికార్డుల్ని సృష్టించింది. చైనాలో ఇప్పటివరకు ఈ చిత్రం 79.42 మిలియన్ల(509 కోట్లు) కలెక్షన్స్‌ను సాధించినట్లు ప్రముఖ సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. రెండు వారాల్లోనే ఈ ఘనతను సాధించిన భారతీయ చిత్రమిదని ఆయన తెలిపారు. ప్రపంచం మెచ్చే గాయని కావాలని కలలు కనే ఓ యువతి స్ఫూర్తిదాయక ప్రయాణంతో తెరకెక్కిన ఈ చిత్రానికి అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో అమీర్‌ఖాన్ అతిథి పాత్రలో నటించడంతో పాటు నిర్మాతల్లో ఒకరిగా వ్యవహరించారు. గత ఏడాది అక్టోబర్‌లో మన దేశంలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసల్ని సొంతం చేసుకున్నది.

వినోదాల గోలీసోడా..

మానస్, నిత్యనరేష్, కారుణ్య నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'సోడా గోలీ సోడా'. 'మొత్తం గ్యాస్' ఉపశీర్షిక. మల్లూరి హరిబాబు దర్శకుడు. భువనగిరి సత్య సింధూజ నిర్మాత. త్వరలో విడుదల కానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది. ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిది. ప్రతి ఒక్కరినీ కడుపుబ్బా నవ్విస్తుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పాలకొల్లు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపాం. వినోదం, కుటుంబ అనుబంధాల కలబోతగా సాగుతుంది. ప్రతి పాత్ర కొత్తగా వుంటుంది. మానస్‌కు మంచి గుర్తింపును తెచ్చిపెడుతుంది. భరత్ చక్కటి సంగీతాన్నందించాడు' అన్నారు. కారుణ్య, బ్రహ్మానందం, అలీ, కృష్ణభగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ముజీర్ మాలిక్, నిర్మాత: భవనగిరి సత్యసింధూజ, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: మల్లూరి హరిబాబు.


నిత్యనరేష్, మానస్


కాదంబరి కిరణ్, కాజాసూర్యనారాయణ, జయసుధ, హరీష్‌శంకర్, బ్రహ్మానందం, సుధీర్‌బాబు

ఎదుటివారి కష్టాలకు చలించేవాడే నిజమైన మనిషి!

'సేవా కార్యక్రమాలకు నేను దూరంగా ఉంటానని చాలా మంది భావిస్తుంటారు. కానీ నా జీవితంలో ఎంతో మందికి సహాయం చేసిన సందర్భాలున్నాయి' అని అన్నారు బ్రహ్మానందం. చిత్ర పరిశ్రమలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టాల్ని గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ 'మనం సైతం' స్వచ్ఛంద సంస్థ ద్వారా నటుడు కాదంబరి కిరణ్ బృందం సహృదయతను చాటుకుంటున్నారు. శనివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న సినీ పరిశ్రమకు చెందిన ఏడుగురికి మనసైతం చెక్‌లను అందజేసింది. ఈ సందర్భంగా నటి జయసుధ మాట్లాడుతూ 'సేవా కార్యక్రమాలు చేయడం సులభం కాదు. అందుకు ఎంతో పట్టుదల, ఓపిక ఉండాలి. కాదంబరి కిరణ్ బృందం కలిసికట్టుగా ఈ మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం' అని తెలిపారు. ఎదుటివారి కష్టాలకు బాధపడేవాడే నిజమైన మనిషని, ఇబ్బందుల్లో ఉన్న కోట్లాది మందికి మనంసైతం సహాయాన్ని అందించాలని దర్శకుడు హరీష్‌శంకర్ పేర్కొన్నారు. కాదంబరి కిరణ్ మాట్లాడుతూ 'ఒక్కరితో మొదలైన ఈ సంస్థ లక్షమంది సభ్యులతో బలోపేతమవుతున్నది. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే ఆపన్నహస్తం అందించే మంచి మనసున్న మనషులు చాలా మంది ఉన్నారు. మనం సైతం చేపడుతున్న కార్యక్రమాల్ని చూసి టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌తో పాటు చిరంజీవి, పవన్‌కల్యాణ్, కొరటాల శివ, పూరిజగన్నాథ్..ఇలా ఎందరో మాకు అండగా నిలిచారు. ఆర్థికంగా సహాయాన్ని అందించి మాలో భరోసాను నింపారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, కాజా సూర్యనారాయణ, బందరుబాబీ, తదితరులు పాల్గొన్నారు.

నీకు నాకు మధ్య..


కవితా అగర్వాల్, సదా

సదా ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'దళపతి'. బాబూరావు పెదపూడి నిర్మిస్తున్నారు. కవితా అగర్వాల్ కథానాయిక. సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. త్వరలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సినిమాలోని 'నీకు నాకు మధ్య ఏదో ఉంది' అనే గీతాన్ని సామాజిక మాధ్యమాల్లో కోటిమందికిపైగా వీక్షించారు. శ్రేయాఘోషల్, యాజమాన్య ఈ పాటను ఆలపించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'యాక్షన్, ప్రేమ, రొమాన్స్ అంశాలకు ప్రాధాన్యమున్న చిత్రమిది. ఇటీవల విడుదల చేసిన 'నీకు నాకు మధ్య..' గీతం శ్రోతల్ని ఆకట్టుకుంటున్నది. పెద్ద హీరోల స్థాయిలో మా సినిమాలోని పాటకు చక్కటి స్పందన లభిస్తున్నది. రాంబాబు ఘోసల చక్కటి సాహిత్యాన్ని అందించారు. ఈ పాటే సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. మాకు గుర్తింపు తీసుకొచ్చిన ఈ పాట పల్లవినే టైటిల్‌గా తీసుకొని మరో సినిమా చేయబోతున్నాం. ప్రస్తుతం కథా చర్చలు పూర్తయ్యాయి. త్వరలో కొత్త సినిమా చిత్రీకరణ మొదలుపెట్టనున్నాం' అని తెలిపారు.